శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

కమ్యూనిజం అప్రతిహత శక్తి
లోపలి పేజీల్లో...
లోక్‌సభ ఫలితాలతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు లంకె

సంపుటి 07, సంచిక: 174 | ఆదివారం | 26-05-2024 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 8+8 | వెల రూ. 5.00



## తమిళనాడులో సిపిఐ శాశ్వత రాజకీయ పాఠశాల భవనం

### 27న కామ్రేడ్ సి.ఎస్.సుబ్రహ్మణ్యం భవన ప్రారంభోత్సవం

తమిళనాడు పశ్చిమ కనుమల్లో ఈరోడ్‌జిల్లా గోపిశెట్టిపాలయంలో శాశ్వత (కమ్యూనిస్టు) పార్టీ స్కూలు భవనం ప్రారంభోత్సవం (27వ తేదీ, సోమవారం) సందర్భంగా ఆ రాష్ట్రంలోని పార్టీ సభ్యులు, సానుభూతిపరులందరికీ సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ ప్రాంతం భవానీ నది ఒడ్డున ఉంది. ఆ భవనానికి తమిళనాడులో సిపిఐ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన కామ్రేడ్ (కీ.శే) సివిఎస్.సుబ్రహ్మణ్యం పేరు పెట్టారు. చుట్టూ పాత భవనం ఉన్న 31 సెంట్లు స్థలాన్ని, రూ.42 లక్షల నగదును పార్టీకి ఇస్తూ ఆయన విల్లు రాశారు. ఆయన 102 సంవత్సరాలు పరిపూర్ణమైన, క్రమశిక్షణాయుతమైన, త్యాగపూరితమైన జీవితం గడిపారు. ఆ ఆదర్శ కమ్యూనిస్టు జీవితం ప్రతి ఒక్క కమ్యూనిస్టుకు అనుసరణీయం. ఈ సరికొత్త నాలుగు అంతస్తుల భవనం విలువ రూ.5 కోట్లు. అధునాతన పరికరాలు, సౌలభ్యకరమైన సామాగ్రి అందులో ఏర్పాటు చేస్తున్నారు. అందులో గ్రంథాలయానికి దక్షిణ భారతదేశంలో తొలి కమ్యూనిస్టు అయిన కామ్రేడ్ (కీ.శే) సింగారవేలు చెట్టియార్ పేరు పెట్టారు. 60 మంది విద్యార్థుల వసతికి సరిపడ గదులను తీర్చిదిద్దారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 1200 మంది కూర్చునే వసతితో ఆడిటోరియం ఏర్పాటు చేశారు. భారతీయ లక్షణాలతో మార్క్సిజం–లెనినిజం భావజాలంతో విప్లవకారులను తయారు చేయడానికి ఈ విప్లవ కేంద్రాన్ని సవ్యంగా ఉపయోగించుకోవాలని నారాయణ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

### ప్రజాస్వామ్యం బతకాలంటే...

# కాంగ్రెస్ విజయం కీలకం

- నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్నను గెలిపించండి
- కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), టిజెఎస్ నాయకులు పిలుపు
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో ఎన్నికల ప్రచార శైలి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ



ప్రజాపక్షం/హైదరాబాద్

నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎం), టిజెఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం బతకాలంటే ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం చాలా కీలకమన్నారు. నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్షనేత కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, బాగం హేమంతరావు, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, నాగయ్య, టిపిసిసి వర్కింగ్ తరువాయి 2లో

### తీన్మార్ విజయం బిజెపికి ఓటమికి నాంది కావాలి

బిజెపి మతపరమైన దాడుల నేపథ్యంలో ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు అవసరమని, తద్వారా బిజెపి ఓటమికి నాంది అవుతుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. తీన్మార్ మల్లన్న విజయంతో కాంగ్రెస్ విధానాలు, కమ్యూనిస్టులు, టిజెఎస్ ఆదరణ బాగుందని రుజువుచేసే రోజు రానుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత, ఇప్పుడు కాంగ్రెస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇండియా కూటమి పొత్తులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతునిస్తున్నామని తెలిపారు. సిపిఐ శ్రేణులు, ప్రజా సంఘాలు,ప్రజాస్వామ్య శక్తులు మంచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

## ఆరోదశలో 59.06% పోలింగ్

### దశాబ్దాల తర్వాత అనంత్‌నాగ్‌లో ఎక్కువ పోలింగ్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఆరోదశ ఎన్నికల్లో శనివారంనాడు 59.06 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఇప్పటివరకూ 486 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో 58 నియోజకవర్గాలలో జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లోని జంగల్ మహల్ ప్రాంతంలో 78.19 శాతం పోలింగ్ నమోదైందని భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. అదేవిధంగా జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్–రాజౌరీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో దశాబ్దాల తర్వాత చాలా ఎక్కువశాతం పోలింగ్ నమోదైంది. కాగా తమ పార్టీ కార్యకర్తలను, పోలింగ్ ఏజంట్లను నిర్బంధించారని నిరసన వ్యక్తం చేస్తూ పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ బిజ్‌బెహరా పోలీస్ స్టేసన్ ఎదుట బైఠాయించారు. ఆమె అనంత్‌నాగ్ – రాజౌరీ స్థానం నుండి పోటీ చేశారు. స్వల్ప ఘర్షణలు, నిరసనలు పశ్చిమ బెంగాల్‌లో జరిగాయి. బెంగాల్ సహా ఢిల్లీలో కూడా కొన్ని చోట్ల ఇవిఎంలు సరిగా పనిచేయలేదు. జార్ఖండ్‌లో 62.74 శాతం ఓటింగ్ నమోదైంది. రాత్రి 7.45 గంటలు నాటికి తరువాయి 2లో





## ఓటేసిన వామపక్ష నేతలు



**న్యూఢిల్లీ :** ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని వామపక్ష నేతలు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల ఆరవ విడతలో భాగంగా శనివారం ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగగా, ఢిల్లీ వామపక్ష నాయకులు ఓటు వేశారు. సిపిఐ నేత అన్నీరాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, ప్రకాష్ కారత్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి విజయం సాధిస్తుందని వామపక్ష నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని వసంత్ కుంజ్‌లో ఓటు వేసిన అనంతరం పిటిఐతో ఏచూరి మాట్లాడారు. తాను తన దేశంలో దేశం 'ఇండియా'కు ఓటు వేశానన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, దేశ ఐక్యత కోసం ఓటు వేశానన్నారు. భారత ప్రజలు విజయం సాధిస్తారన్నారు. తద్వారా ఇండియా గెలుస్తుందన్నారు. 'ఇండియా' కచ్చితంగా గెలుస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. కేరళలోని వాయనాడ్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీపై పోటీలో ఉన్న అన్నీ రాజా న్యూఢిల్లీలోని సంచార్ భవన్‌లోని తరువాయి 2లో

### భారీ అగ్నిప్రమాదం

## 22 మంది మృతి



**రాజ్‌కోట్ :** గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో చిన్నారులు సహా 22 మంది చనిపోయారు. మరికొందరు గాయపడ్డారు. ఇంకా పలువురు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. నగరంలోని టిఆర్‌పి గేమ్ జోన్‌లో శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటల్లో చిక్కుకున్న కొందరిని కాపాడారు పోలీసులు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరువాయి 2లో

### ఆంధ్రా ఫలితాలపై తెలంగాణలో

## బెట్టింగులు



- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- గెలుపు పైనా, సీట్ల సంఖ్య పైనా పందేలు

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణలో జరిగిన పార్లమెంటు ఎన్నికల కంటే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన శాసన సభ ఎన్నికలపై జోరుగా బెట్టింగ్ సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు, పార్లమెంటు ఎన్నికలకు కలిపి ఈనెల 13న పోలింగ్ నిర్వహించారు. ఖమ్మం జిల్లా తెలంగాణ సరిహద్దులో ఉండడంతో జిల్లా ప్రజలకు విస్తారమైన బంధుత్వాలు ఆంధ్రాలో ఉండడం వ్యాపార, రాజకీయ సంబంధాల నేపథ్యంలో ఖమ్మంజిల్లా ప్రజలకు ఇక్కడి ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. ఖమ్మం జిల్లాలో నివసిస్తున్న వారిలో చాలా మంది ఆంధ్రా ఓటర్లు ఉండడం కూడా గమనార్హం. కూటమికి 100కు పైగా స్థానాలు వస్తాయని కొందరు బెట్టింగులు కాస్తుండగా జగన్‌దే అధికారమంటూ మరి కొందరు బెట్టింగ్ కాస్తున్నారు. కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోను ఎన్నికల ఫలితాలకు సంబంధించి పందెలు జోరుగా కాస్తున్నారు. కొందరు బాలకృష్ణ మెజార్టీ గెలుపు పైన కూడా పందెలు కాస్తున్నారు. గుడివాడలో కోడాలి నాని, గన్నవరంలో వల్లభనేని వంశీ, పీఠాపురంలో పవన్ కళ్యాణ్, భీమిలిలో అవంతి శ్రీనివాస్, నగరిలో రోజా గెలుపుపైనా ఎక్కువగా పందెలు జరుగుతున్నాయి. గతంలో పందెం అంటే మాటల రూపంలోను, కాస్తో కూస్తో నగదు రూపంలో ఉండేది. కానీ ఇప్పుడు తరువాయి 2లో

## 12 నుంచి స్కూల్స్

- 1వ తేదీ నుంచి 11 వరకు 'బడి బాట'
- 2025 మార్చిలో పదవ తరగతి పరీక్షలు
- '2024-25 విద్యా సంవత్సర' క్యాలెండర్ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12 నుండి పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. 2025 ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. 2025 ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుగా నిర్ణయించారు. మార్చిలో పదో తరగతి తుది పరీక్షలు, వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. జూన్ 1వ తేదీ నుండి 11 వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు 2024–25 విద్యా సంవత్సర క్యాలెండర్‌ను తరువాయి 2లో

## మద్యం అక్రమాలకు చెక్!





- అంతా సిసి టివి నిఘాలోనే
- డిస్టిలరీస్, డిపోలలో సర్వేలెన్స్ విజన్ ఏర్పాటు
- బంజారాహిల్స్, నాంపల్లి కమాండ్ కంట్రోల్ రూమ్‌లలో పర్యవేక్షణ

ప్రజాపక్షం/హైదరాబాద్

మద్యం అక్రమాలు, అవినీతికి చెక్ పెట్టేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నడుం బిగించారు. 'ట్రేస్ అండ్ ట్రాకింగ్' విధానం అమలు చేయడం ద్వారా మద్యం తయారీ నుంచి అమ్మకం వరకు పూర్తిగా పారదర్శకంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలోని 18 మద్యం తయారీ కేంద్రాలు (డిస్టిలరీస్), 19 మద్యం బాటిల్స్ నిల్వ (టిజిబిసిఎల్ డిపో) కేంద్రాలలో సర్వేలెన్స్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క మద్యం బాటిల్ కూడా పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ విధానం పూర్తిగా తోడ్పడుతుంది. ఇందుకోసం తరువాయి 2లో

### నకిలీ, కల్తీ విత్తనాలు అమ్మితే

## కఠిన చర్యలు

- నకిలీ విత్తనాలు, ఎరువులు ఆరికట్టేందుకు పటిష్ట చర్యలు
- దృష్టి సారించిన వ్యవసాయ శాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

నకిలీ విత్తనాల సరఫరా, నాసిరకం ఎరువులను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. మరీ ముఖ్యంగా వరి, పత్తి నకిలీ విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం రెండు పంటలను అధికంగా సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల వల్ల నష్ట పోకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 151.93 లక్షల ఎకరాలు సాగు చేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేయగా, అందులో వరి 66 లక్షల ఎకరాలు, పత్తి 55లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉండగా, మిగిలిన 30.93 తరువాయి 8లో

# శాంతి-యుద్ధం దేనికైనా సిద్ధం : పుతిన్

### ఇప్పుడున్న సరిహద్దులు గుర్తిస్తే కాల్పుల విరమణ

**మాస్కో :** రష్యాతో ప్రస్తుతం ఉన్న సరిహద్దులను అంగీకరించినట్లయితే ఉక్రేన్‌తో కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు ప్రకటించారు. శాంతి స్థాపనకైనా, యుద్ధానికైనా తాము సిద్ధమేనంటూ ఉక్రేన్‌కు శాంతి ప్రతిపాదన చేశారు. యుద్ధంలో తామే విజేతలమని ప్రకటించడానికి ఇప్పటివరకూ ఉన్న ఫలితాలు సరిపోతాయని ఆయనఅన్నారు. ఇక ఆపమని చెప్పేవరకూ రష్యా సేనలు ముందుకు పురోగమిస్తూనే ఉంటాయని ఆయనహెచ్చరించారు. ఐతే నాటో భూభాగలోకి వెళ్ళి యుద్ధం చేసే ఆలోచన లేదని కూడా ఉక్రేన్‌కు రష్యా తన షరతులో వెల్లడించింది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామనీ, శాశ్వత యుద్ధానికి తాము సిద్ధంగా లేమనీ పుతిన్ తరపున క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ రాయిటర్స్ వార్తాసంస్థకు చెప్పారు. ఉక్రేన్‌లో యుద్ధానికైనా శాంతి చర్చలకైనా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఉక్రేన్‌తో ఏనాడూ రష్యా శాంతి చర్చలను తిరస్కరించలేదని ఆయన అన్నారు. చట్టబద్ధమైన వ్యవస్థలతో, సంబంధిత చట్టబద్ధమైన నాయకులతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పదవీకాలం నిర్ణీత ప్రకారం వారం రోజుల క్రితమే ముగిసింది.



గతంలో చేసుకున్న ఒప్పందాలపై తాము చర్చిసామనీ, ఐతే ఈ చర్చల్లో శాంతి పత్రాలపై చట్టబద్ధమైన వ్యక్తులు ఎవరు సంతకాలు చేస్తారనిఆయన ప్రశ్నించారు. మొదట ఉక్రేన్ పాలకులు ఈ విషయంపై తమకు సమాధానం చెప్పాలని ఆయన సవాలు చేశారు. ఇస్తాంబుల్‌లో ఇరు దేశాలకు నచ్చేవిధంగా తాము శాంతి ఒప్పంద పత్రాలను సిద్ధం చేశామనీ, ఐతే ఆనాటి బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ కీవ్‌లో పర్యటించిన అనంతరం ఉక్రేన్ అధ్యక్షుడు తాము శాంతి చర్చల నుండి వైదొలగుతున్నామని ప్రకటించారని పుతిన్ గుర్తుచేశారు.

### ఉక్రేన్‌కు మరో 275 మిలియన్ డాలర్ల అమెరికా సైనిక సహాయం

ఉక్రేన్‌కు మరో 275 మిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని అమెరికా ప్రకటించింది. ఇప్పటివరకూ ప్రకటించిన దానికంటే ఇది అదనం. రష్యా సైన్యాలు ఖార్కీవ్ ప్రాంతంలోకి ముందుకు దూసుకువెళుతున్న తరుణంలో ఉక్రేన్ తన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయడం కోసం శనివారంనాడు అమెరికా ఈ ప్రకటన చేసింది. రష్యాను ప్రతిఘటించేందుకు, ఉన్నచోటనే అడ్డుకునేందుకు తాము చేసే ప్రయత్నాల్లో భాగంగా ఈ సహాయం చాలా త్వరగా అందిస్తామని అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు. ఉక్రేన్ స్వేచ్ఛ, సార్వభౌమత్వాలనను రక్షించేందుకు అమెరికాతోపాటు అంతర్జాతీయ మిత్ర కూటమి కూడా కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. ఈ తాజా ప్యాకేజీలో హై మొబిలిటీ ఆర్టిల్లరీ రాకెట్ వ్యవస్థలు (హెచ్ఐఎంఎఆర్ఎస్), మ్యునిషన్స్, 155 ఎంఎం, 105 ఎంఎం హైడిమాండ్ ఆర్టిల్లరీ రౌండ్స్ కూడా అదనంగా ఉక్రేన్‌కకు సరఫరా చేస్తున్నామని బ్లింకెన్ చెప్పారు. ఇంకా అదనంగా యుద్ధ శకటాల విధ్వంసక ఎటి—4 ఆయుధాలు, యుద్ధ శకటాలను ధ్వంసం చేసే మందుపాతరలు, వ్యూహాత్మకమైన వాహనాలు, చిన్నపాటి ఆయుధాలు, తూటాలు సమకూరుస్తున్నట్లు చెప్పారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా యుద్ధం ప్రకటించింది. అప్పటినుండి ఇప్పటివరకూ మొత్తంగా 51 బిలియన్ డాలర్లు యుద్ధ సహాయం సమకూర్చినట్లవుతుంది.

# 29న దక్షిణాఫ్రికా ఎన్నికలు

## సర్వత్రా ఉత్కంఠ

### ఎవరికీ మెజార్టీ ఉండదని ముందస్తు సర్వేల జోస్యం




**కేప్‌టౌన్ :** దక్షిణాఫ్రికా పార్లమెంటుకు వచ్చే బుధవారం (ఈనెల 29వ తేదీ) జరిగే సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ముందస్తుగానే ఎన్నికల సర్వేలుకూడా వెలువడ్డాయి. అనేక దశాబ్దాలుగా నిరాటంకంగా అధికారంలో కొనసాగుతున్న ప్రస్తుత అధికారంలో ఉన్న నెల్సన్ మండేలా ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీ (ఎ.ఎన్.సి)కి ఈసారి ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగులుతుందని ఎన్నికల సర్వేలు జోస్యం చెబుతూ ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఈసారి ఏ రాజకీయపార్టీకి తగినంత మెజారిటీ రాదని, ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీకి 50 శాతం కంటే తక్కువగా పోలింగ్‌లో మద్దతు లభిస్తుందని పలు సర్వేలు ముందస్తుగానే ప్రచారం చేసినప్పటికీ దేశంలో ప్రజలు మాత్రం ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీనే అతి పెద్ద పార్టీగా, దేశాన్ని ముందుకు నడిపించగల పార్టీగా భావిస్తున్నారు. అంతర్గత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో అనూహ్యమైన రాజకీయ పరిణామాలు ఇటీవలికాలంలో సంభవించాయి. దీంతో కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నికల తర్వాత ఏ విధంగా ఎన్నుకుంటారన్న సందేహాలు ఇప్పటినుండే తలెత్తుతున్నాయి. ఎఎన్‌సిపార్టీ నేత రామఫోసా రెండోసారి అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టేందుకు మెజారిటీ రాకపోతే, భాగసామ్యపక్షంగా మరొక పార్టీలను ఎఎన్‌సి ఆశ్రయించవలసి వస్తుంది. దేశాధ్యక్షుడే ప్రభుత్వ అధికారం చెలాయిస్తున్నప్పటికీ అధ్యక్షుణ్ణి ప్రజలు ఈ జాతీయ ఎన్నికల్లో ప్రత్యక్షంగా ఎన్నుకోరు. ఓట్ల నిష్పత్తిని బట్టి రాజకీయపార్టీలకు పార్లమెంటులో సీట్లు లభిస్తాయి. తర్వాత ఎన్నికైన చట్టసభ సభ్యులందరూ కలిసి పార్లమెంటు దిగువ సభ జాతీయ అసెంబ్లీలో సమావేశమై దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. దక్షిణాఫ్రికా జాతీయ అసెంబ్లీలో మొత్తం 400 మంది చట్టసభ్యులు ఉంటారు. అధ్యక్ష అభ్యర్థి 201 ఓట్లు పొందితేనే విజేతగా పదవీ బాధ్యతలు చేపడతారు. 1994 నుండీ ఈనాటి వరకూ 30 ఏళ్ళుగా ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ పార్టీకి జాతీయ అసెంబ్లీలో సంపూర్ణ మెజారిటీ దక్కుతూ వస్తున్నది. ఐతే ముందస్తు సర్వేలప్రకారంఎఎన్‌సిపార్టీకి మెజారిటీరాకపోతే కూటమి ప్రభుత్వం ద్వారా రామఫోసాను అధ్యక్షుడుగా ఎన్నుకునేందుకు ఏ ఏ పార్టీలు మద్దతు ఇస్తాయన్న విషయంలో ఇప్పటికీ ఇంకా ఒక స్పష్టత లేదు. ఐతే 30 ఏళ్ళక్రితం నెల్సన్ మండేలా ఈ దేశ ప్రభుత్వంలోకి ఇతర పార్టీలను కూడా భాగస్వాములుగా ఆహ్వానించి జాతీయ ఐక్యతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయాన్ని రాజకీయ పండితులు గుర్తుచేస్తున్నారు. ఈసారి కూడా ఎఎన్‌సిపార్టీ అదేమార్గం అనుసరించవచ్చునని ఊహాగానాలు సాగుతున్నాయి.

## మయన్మార్ నుండి పారిపోయిన 45 వేలమంది రోహింగ్యాలు

**జెనీవా :** మయన్మార్‌లో అంతర్యుద్ధ రోజు రోజుకూ ముదురుతున్నది. రోహింగ్యాలే ఈ యుద్ధానికి బలవుతున్నారు. తలలు నరకడం, చంపడం, హింసించడం వంటి వదంతులు వ్యాపించడంతో మయన్మాలో కల్లోలంగా ఉన్న రఖైన్ రాష్ట్రం నుండి మళ్ళీ 45,000 మంది రోహింగ్యాలు ఆ ప్రాంతం వదిలిపారిపోయినట్లు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.జుంటా పాలకుల అరఖాన్ ఆర్మీకీ, తిరుగుబాటు దారులకు మధ్య భీకర పోరాటం ఈ ప్రాంతంలో జరుగుతున్నది.

# ఇజ్రాయిల్‌పై ఒత్తిడి : వచ్చేవారం మళ్లీ శాంతి చర్చలు

**టెల్ అవీవ్ :** తక్షణం యుద్ధం ఆపాలనీ, రఫా క్రాసింగ్‌ను వెంటనే తెరచి మానవతా సహాయం, ప్రాణావసర సామాగ్రిని పాలస్తినాలోకి అనుమతించాలనీ అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు చెప్పిన నేపథ్యంలో ఇజ్రాయిల్‌పై విపరీతమైన ఒత్తిడి పెరిగిపోయింది. కోర్టు తీర్పును కూడా ధిక్కరించి ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ రఫాలో దాడులు కొనసాగిస్తూ ఉండటంతో ప్రపంచదేశాల ఆగ్రహం అనూహ్యంగా విస్తరిస్తున్నది. దీంతో ఆయన మరింతగా ఏకాకిగా మారుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన చర్చలకు తలవంచక తప్పేట్టులేదని రాయిటర్స్ వార్తాసంస్థ వెల్లడించింది. ఖతార్ ప్రధానమంత్రితో, అమెరికా ఇంటిలిజన్స్ ఏజన్సీ సిఐఎ అధిపతితో ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ అధిపతి మసూద్ సమావేశాల అనంతరం ఆ దేశం హమాస్‌తోతిరిగి చర్చలకు అంగీకరించింది. ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఖైదీలుగా ఉన్న 8,840 మంది పాలస్తీనియన్లను విడుదల చేయడం, అదే విధంగా హమాస్ వద్ద ఉన్న బందీలను వారు విడుదల చేయడంప్రధాన ఎజెండాగా ఈ చర్చలు తిరిగి ప్రారంభం అవుతాయి. ఈజిప్టు, ఖతార్ దేశాలకు చెందిన మధ్యవర్తుల సమక్షంలో ఈ చర్చలు జరుగుతాయి. వారి ప్రతిపాదన మేరకే ఇదే ఎజెండాతో తిరిగి చర్చలు మొదలవుతున్నాయి. అంతర్జాతీయ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత ఆ తీర్పును గౌరవించి నేతన్యాహూ తక్షణం యుద్ధం ఆపాల్సి ఉన్నప్పటికీ లెక్కచేయకుండా శనివారం కూడా రఫాలో ఇష్టానుసారంగా ఇజ్రాయిల్ సేనలు దాడులు కొనసాగించాయి. గడచిన 24 గంటల్లో గాజాలో జరిగిన దాడుల్లో 46 మంది మరణించగా, మరో 130 మంది గాయపడ్డారు. అదేవిధంగా దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లా మిలిటరీ స్థావరాలపై కూడా దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం శనివారం ప్రకటించింది. గాజాలో యుద్ధం ఊహాతీతంగా ఉందనీ, మాటల్లో ఆ దారుణాలను చెప్పలేమనీ ఐక్యరాజ్యసమితి అత్యవసర విభాగం అధిపతి ఒక ప్రకటనలో చెప్పారు. మరోవైపు పాలస్తినా ప్రధానమంత్రి మహ్మద్ ముస్తాఫా ఇటలీకి ఒక విజ్ఞప్తిచేస్తూ, పాలస్తినాను ఒక దేశంగా, సార్వభౌమాధికారంగల స్వతంత్ర దేశంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 140 దేశాలు పాలస్తినాకు గుర్తింపు ఇచ్చాయి. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్—పాలస్తినా మధ్య యుద్ధం మొదలైంది. అప్పటినుండీ 35,903 మంది పాలస్తీనియన్లు యుద్ధంలో మరణించగా మరో 80,420 మంది గాయపడ్డారు. 147 మంది జర్నలిస్టులు, 194 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బంది ఈ దాడుల్లో మరణించారు.



## ఉక్రేన్ యుద్ధంపై ఐదు ప్రపంచ అంశాల ప్రభావం

**బీజింగ్ :** రష్యా—ఉక్రేన్ మధ్య జరుగుతున్న యుద్ధంపై ప్రపంచంలోని ఐదు అంశాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని నిపుణుడు ఝుయాంగ్ ఝి చెప్పారు. బీజింగ్‌లో శుక్రవారం జరిగిన ఒక సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, రష్యాలో, అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు, పశ్చిమ ఆసియా సంక్షోభం,నల్లసముద్రంలో పరిణామాలు, రష్యాపై పాశ్చాత్య దేశాల ఆంక్షలు, శాంతి చర్చలు ప్రధానంగా రష్యా—ఉక్రేన్ యుద్ధం ప్రభావం చూపిస్తున్నాయన్నారు. చైనా సోషల్ సైన్సెస్అకాడమీలో ఉన్న రష్యా, తూర్పు యూరప్, సెంట్రల్ ఆసియా అధ్యయనాల సంస్థ డైరెక్టర్‌గా ఝుయాంగ్ ఝి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలపై బీజింగ్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, భౌగోళిక ప్రాదేశిక రాజకీయలు ఆడుగున్న ఆటల్లో భాగంగానే ఉక్రేన్ ఈ యుద్ధానికి బలైపోయిందని, ఒక పావుగా మారిందన్నారు. రష్యా ఎన్నికలు మార్చిలో పూర్తి కాగా, అమెరికా ఎన్నికలు నిర్ణీత ప్రకారం నవంబరులో జరుగుతాయనీ, ఈ రెండు దేశాలలోనూ అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలు ఉక్రేన్‌లో యుద్ధంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని ఆయన చెప్పారు. పాశ్చాత్యదేశాలు చేస్తున్న సహాయం, ఉక్రేన్ స్వతంత్రతను దెబ్బతీసి ఎగదోయడం, ఆ దేశాన్ని తమ ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడంవల్ల ఈ యుద్ధం ఇంకా చాలా కాలం కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఉక్రేన్ దేశం ఇప్పుడు అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో ఉందని, ఆ దేశానికి అవసరమైన సగానికి సగం ఆర్థిక వనరులను పాశ్చాత్య దేశాలే సమకూరుస్తున్నాయని ఆయన అన్నారు. ఇప్పుడు ఉక్రేన్‌కు పూర్తిగా పశ్చిమ దేశాల మీద ఆధారపడి బతకడం తప్ప వేరే మార్గం కనిపించడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా, ఉక్రేన్ రెండు దేశాలూ పరస్పరం ఖైదీలను భరిస్తున్నాయని, చర్చలకు అవకాశాలు రావడంలేదనీ, ఈ చర్చలకు ఇప్పటికీ అవకాశాలు కనుచూపు మేరలో కనిపించడంలేదని అన్నారు. నల్లసముద్రంలో పరిస్థితులను వివరిస్తూ, నల్ల సముద్రంలో తీవ్రమైన పోటీ జరుగుతుందన్నారు.

## 12 నుంచి స్కూల్స్

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు, అప్పర్ ప్రైమరీకి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు తరగతులు ఉంటాయి. 2025 ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి.2025 ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులను నిర్ణయించారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 2025 ఫిబ్రవరి 28 వరకు సిలబస్‌ను పూర్తి చేయాలి. అలాగే పదవ తరగతిలోని అన్ని సబ్జెక్టుల సిలబస్‌ను 2025 జనవరి 10లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. మార్చిలో పదో తరగతి తుది పరీక్షలను నిర్వహిస్తారు. 2024—25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు జూన్ 12న ప్రారంభమై, ఏప్రిల్ 23 వరకు మొత్తం 229 పని దినాలు ఉండనున్నాయి. 2025 ఏప్రిల్ 24 నుంచి 2025 జూన్ 11 వరకు మొత్తం 49 రోజులు ఈ విద్యాసంవత్సరంలో వేసవి సెలవులను ప్రకటించారు. అక్టోబర్ 2 నుండి 14 వరకు (13 రోజులు) దసరా సెలవులు, డిసెంబర్ 23 నుండి 27 వరకు 5 రోజులు మిషనరీ స్కూల్స్‌కు క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుండి 17 వరకు 5 రోజుల పాటు సంక్రాంతి సెలవులను పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. ప్రతిరోజు ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు నిమిషాల పాటు యోగా, మెడిటేషన్ తరగతులు ఉంటాయి. 2025 ఫిబ్రవరి 28లోపు పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని, వచ్చే ఏడాది మార్చి నెలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యా సంవత్సర క్యాలెండర్‌లో పొందుపరిచారు.

### విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

అన్ని పాఠశాలలు స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సహకారంతో క్రమం తప్పకుండా నిరంతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. ఏడాదిలో రెండు సార్లు వైద్య పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుందని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. పాఠశాలలకు నిరంతరం హాజరు కాని విద్యార్థులను గుర్తించి, వారి ఇంటికి వెళ్లి, ఆ విద్యార్థి తిరిగి పాఠశాలకు వచ్చేలా పాఠశాల నిర్వాహకులు, ఎస్ఎంసి సభ్యులు చూడాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. అలాగే ప్రతి నెలా మూడవ శనివారం పేరంట్స్,టీచర్ మీటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. మొత్తగా పది రోజులు నో 'బ్యాగ్ డే'గా గుర్తించింది.

### పరీక్షలషెడ్యూల్ :

2024 జూలై 31లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్1 పరీక్షలు.
2024 సెప్టెంబర్ 30 లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్2 పరీక్షలు.
2024 అక్టోబర్ 21 నుంచి 28 వరకు సమ్మేటివ్ అసెస్మెంట్1 పరీక్షలు.
2024 డిసెంబర్ 12 లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్3 పరీక్షలు .
2025 జనవరి 29 లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్ 4 పరీక్షలు,
2025 ఏప్రిల్ 9 నుంచి 19 వరకు సమ్మేటివ్ అసెస్మెంట్2 పరీక్షలను(1 నుంచి 9 క్లాస్‌లకు).
2025 ఫిబ్రవరి 28 లోపు పదవ తరగతి ప్రి ఫైనల్ పరీక్షలు.
2025 మార్చిలో పదవ తరగతి బోర్డ్ పరీక్షలు

## విజయం కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ మహేష్‌కమార్‌గౌడ్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు శనివారం హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఉప ఎన్నికల ప్రచార శైలి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పోలింగ్ తేదీన వ్యవహరించే తీరు తెన్నులపై కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది. అయితే ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సిపిఐ, టిజెఎస్, సిపిఐ(ఎం) మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. సమావేశనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఘన విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజాస్వామ్యాన్ని బలపడాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం: కోదండరామ్

ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న విజయం కోసం ఒక కూటమిగా అందరమూ ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజాస్వామిక పాలనను పునరుద్ధరించాలని, ప్రజాస్వామ్యం బలపడాలని లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఎంఎల్‌సి ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుపు చాలా కీలకమన్నారు.

ఇటీవల జరిగిన శాసనసభతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో తాము బిజెపి, బిఆర్‌ఎస్‌ను వ్యతిరేకంగా నిలిచామన్నారు. బిఆర్‌ఎస్ నిరంకుశ పాలన అంతం కావాలని, రాజ్యాంగ సవరణకు బిజెపి చేస్తున్న కుట్రను తుద ముట్టించేందుకే తాము కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశామన్నారు.

### రాజకీయ, సామాజిక పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకోండి : వీరయ్య

ఎస్. వీరయ్య మాట్లాడుతూ ఎంఎల్‌సి ఉప ఎన్నికలలో రాజకీయ, సామాజిక పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకుని, సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలను కోరారు. తీన్మార్‌మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇండియ కూటమిలో సిపిఐ(ఎం) ఉన్నదని, లోక్ సభ ఎన్నికల్లో కూడా తాము కాంగ్రెస్ కు మద్దతు నిచ్చామని తెలిపారు.

## 22 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

తరలించారు. చెలరేగుతున్న మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. వేసవి సెలవుల కారణంగా గేమ్‌జోన్‌లో ఘటనా సమయంలో చాలా మంది పిల్లలు ఉన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని రాజ్‌కోట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ధవల్ హరిపరా తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపిన తర్వాత ప్రమాదానికి గల కారణాలు వెల్లడిస్తామని రాజ్‌కోట్ పోలీస్ కమిషనర్ రాజు భార్గవ్ తెలిపారు. సహాయక చర్యలు పెద్ద ఎత్తున చేపట్టినట్లు చెప్పారు. నగరంలోని మిగతా గేమింగ్ జోన్‌లకు ఆదేశాలు పంపారు రాజ్‌కోట్ సిపి. అన్ని సెంటర్లను మూసి వేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ స్పందించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులంతా తక్షణమే ఘటనా స్థలికి చేరుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్. గాయపడిన వారికి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. 'మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. ఈ ఘటనను ఇప్పుడే ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) దర్యాప్తు చేయనుంది' అని మరో ట్వీట్ చేశారు సీఎం భూపేంద్ర.

### మోదీ సంతాపం

మరోవైపు, అగ్నిప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయినందుకు ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని విధాలుగా సహాయం అందించేందుకు స్థానిక యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. 'రాజ్‌కోట్‌లో అగ్నిప్రమాదం జరగడం చాలా బాధాకరం. నా ఆలోచనలు తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారందరితో ఉన్నాయి. క్షతగాత్రుల కోసం ప్రార్థిస్తున్నా. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా సహాయాన్ని అందించడానికి కృషి చేస్తోంది'అనిఎక్స్‌లోమోదీ ట్వీట్ చేశారు. భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు.

## అక్రమాలకు చెక్!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు 442 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ అన్ని కెమెరాలను బంజారాహిల్స్‌లోని పోలీసు కమిషనర్ కార్యాలయం ట్విన్ టవర్‌లోని కమాండ్‌కంట్రోల్ రూమ్‌తో పాటు నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధించారు. ఇక్కడ ఎక్సైజ్ సిబ్బంది రోజుకు మూడు షిఫ్టుల విధానంలో 24 గంటలు సిసిటివిలను పర్యవేక్షిస్తుంటారు. ఎక్కడైనా ఏదైనా అనుమానాలు గానీ, ఫిర్యాదులు గానీ వస్తే వెంటనే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను అప్రమత్తం చేస్తారు. తద్వారా శాస్త్రీయంగా చర్యలు తీసుకునే ఆస్కారం ఏర్పడుతుంది. డిస్టిలరీస్, డిపోలలో వైన్, ఓడ్కా, రమ్, విస్కి, బీరు కార్టున్‌లన్నీ ప్రతీది సిసిటివి ఆటోమెటిక్‌గా చేసుకుంటుంది. దీంతో స్కాన్ చేసిన ఈ కార్డున్లు పక్కదారి పట్టకుండా ట్రేస్ అండ్ ట్రాకింగ్ విధానంతో అధికారులు పర్యవేక్షిస్తారు. ఏ రోజు ఏ కంపెనీలో ఎంత మద్యం తయారు చేశారు, ఏఏ డిపోలలో ఏఏ కంపెనీ బ్రాండ్‌ల మద్యం నిల్వలు ఉన్నాయి అనే వివరాలు సిసిటివిల ద్వారా తెలుసుకునే వీలుంది. ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్ నేరుగా సిసిటివిల ద్వారా పర్యవేక్షిస్తారు. ముఖ్యంగా మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్‌ను ఎక్సైజ్ శాఖ ద్వారానే మద్యం తయారీ కంపెనీలకు సరఫరా అవుతుంది. సదరు కంపెనీ ఎంత స్పిరిట్ తీసుకుంటుందో అతే విలువైన మద్యం బాటిల్స్ తయారు చేయాల్సి ఉంటుంది. స్పిరిట్ సరఫరాకు మద్యం బాటిల్స్ తయారీలో తేడాలు వస్తే సదరు కంపెనీపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడంతో పాటు సీజ్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. డిపోలలో ఏ బ్రాండ్ మద్యం నిల్వలు ఎన్ని ఉన్నాయి అనే వివరాలను వైన్ షాప్, బార్ అండ్ రెస్టారెంట్ యజమానులకు తెలుసుకునే వీలు కల్పించారు. తద్వారా వారికి కావల్సిన బ్రాండ్‌లను ఎంచుకుని సదుపాయంతో పాటు ఆన్‌లైన్‌లోనే డబ్బులు చెల్లించి మద్యాన్ని ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ద్వారా తీసుకెళ్లారు. డిపోల నుంచి వైన్‌షాప్‌కు బయలుదేరిన ప్రతి వాహనాన్ని సిసిటివిల ద్వారా ఆటోమెటిక్ స్కాన్ అవుతుంది. ఆ వాహనం నేరుగా వైన్‌షాప్‌కు వెళ్లకుండా పక్కదారి పట్టినా అధికారులకు వెంటనే తెలిసిపోతుంది. తద్వారా మద్యం పక్కదారి పట్టే అవకాశాలు లేవు. అలాగే వైన్‌షాప్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లలో కూడా మద్యం నిల్వలు, అమ్మకం వివరాలు పారదర్శకంగా ఉండే విధంగా రికార్డులను నమోదు చేస్తున్నారు. ప్రతి రోజు ఈ వివరాలను సదరు వైన్‌షాప్ యజమాని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

### అంతా పారదర్శకం: ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్

మద్యం తయారీ నుంచి అమ్మకం వరకు అంతా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆబ్కారీ శాఖలో పెను మార్పులు తీసుకువచ్చాం. ముఖ్యంగా ఎక్సైజ్ ఆధాయానికి గండికొట్టె చర్యలకు 'ట్రేస్ అండ్ ట్రాకింగ్' అడ్డుకట్ట వేస్తుంది. నాన్ డ్యూటీ పెయిండ్ లిక్కర్‌ను పూర్తిగా నిర్మూలించాము.మద్యం కంపెనీలుగాని డిపోలలోగాని మద్యం కార్టును పక్కదారి పట్టిస్తే అక్కడి సిసిటివి ఆ విషయాన్ని పసిగట్టి సిబ్బందని వెంటనే అప్రమత్తం చేస్తుంది.
ఈ విధానం ద్వారా మద్యం అక్రమమార్గం పట్టే అవకాశాలు ఉండవు.

## ఆకట్టుకున్న అవేర్నెస్ డే

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్నెస్ డే 2024 పేరిట ఎల్ వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 125 మందికి పైగా దృష్టి పునరావాస వైద్యులు సాంకేతిక నిపుణులు, దృష్టి వైకల్యాలున్న వ్యక్తులు, వారి కుటుంబాలు పాల్గొన్నారు. ఇటువంటి విజయవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించడం మాకెంతో ఆనందదాయకంగా ఉన్నదని డా. బ్యూలా క్రిస్టీ అన్నారు. గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్నెస్ డే అనేది డిజిటల్ డిజైన్ అభివృద్ధి అన్ని అంశాలలో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం గురించి తెలియజేస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు అవగాహన పెంచడమే కాకుండా అందరికీ మరింత సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మించే దిశలో ప్రేరేపిస్తాయని తెలిపారు.

## 59.06% పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర ప్రదేశ్‌లో 54.03, బీహార్‌లో 53.30 శాతం, జమ్మూ కశ్మీరులో 52.28 శాతం, హర్యానాలో 58.37 శాతం, ఒడిశాలో 60.07 శాతం, ఢిల్లీలో 54.48 శాతం పోలింగ్ జరిగింది. అనంత్‌నాగ్—రాజౌరీ నియోజకవర్గంలో గతంలోలేని విధంగా 48.6 శాతం మేరకు పోలింగ్ జరగడం విశేషం. ఇప్పటివరకూ ఆరు దశల ఎన్నికలు పూర్తికాగా ఇంకా ఒకేఒక్క దశ ఓటింగ్‌ప్రక్రియ మిగిలి ఉంది. 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ ఆరు దశల్లోనూ 486 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తికాగా, జూన్ 1వ తేదీన కట్టకడపటిగా మరో 57 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. తర్వాత మూడు రోజులకు కౌంటింగ్ జరుగుతుంది. దేశంలోని చాలా ప్రాంతాలలో ప్రజలను పట్టిపీడిస్తున్న వేడిగాలులు కూడా అక్కడక్కడ ఈ పోలింగ్ ప్రక్రియపై కూడా ప్రభావం చూపిస్తున్నాయి. దీనికి పరిష్కారంగా పోలింగ్ ప్రాంతాలవద్దచల్లటినీరు,కూలర్లు,టెంట్లు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌లు ఏర్పాటు చేశారు. వేడిగాలుల నుండి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం కూడా తగిన ఆదేశాలు జారీ చేసింది. ఆరోదశ ఎన్నికల్లో మొత్తం 5.84 కోట్లమంది పురుషులు, మరో 5.29మంది స్త్రీలు సహా మొత్తం 11.13 కోట్లమందిఈవిడత పోలింగ్ జాబితాలో ఉన్నారు. వీరికోసం ఎన్నికల సంఘం 1.14 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి మరో 11.4 లక్షలమంది పోలింగ్ అధికారులను నియమించింది.

## బెట్టింగులు

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు చేతులు మారుతున్నాయి. మధ్యవర్తుల వద్ద కోట్ల రూపాయలను డిపాజిట్ చేస్తున్నారు. కొంత మంది భూములు కూడా గెలుపోటముల బెట్టింగుల్లో తాకట్టు పెడుతున్నారు. తెలంగాణలో 17 స్థానాలకు పార్లమెంటు ఎన్నికలు జరిగినా ఆ ఫలితాల పట్ల ఎక్కడ ఆసక్తి కనిపించడం లేదు. అసలు ఎన్నికలు జరిగాయన్న ఊహ కొందరిలో లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. కాని ఆంధ్రాలో పరిస్థితి ఉత్కంఠంగా ఉండడం, ఇరు పార్టీల మధ్య హోరా హోరీ పోటీ జరగడంతో జనం బెట్టింగులు కాస్తున్నారు . ఈనెల నాల్గున ఫలితాల తర్వాత ఎవరు నష్టపోతారో ఎవరు లాభపడతారో అర్థమవుతుంది. ఐపిఎల్ బెట్టింగుల్లో మునిగి తేలే వారికి ఇప్పుడు ఆంధ్రా ఎన్నికలు కూడా అదే తీరులో ఉండడంతో ఇప్పుడు బెట్టింగు రాయుళ్ల దృష్టి ఆంధ్రా వైపుకు మళ్లింది. కొందరైతే కూటమి అధికారంలోకి వస్తుందని లక్షకు రెండు లక్షల చొప్పున బెట్టింగు కాస్తున్నారు.

## వామపక్ష నేతలు

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఈ ఎన్నికలు దేశానికి, ప్రజలకు, రాజ్యాంగ హక్కులకు సంబంధించి కీలకమైన ఎన్నికలని అన్నారు. అందుల వల్ల ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. 'ఇండియా' కూటమి గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత మత, ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని ఓడించడానికి తాము కృషి చేస్తున్నామన్నారు. తాము ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న నమ్మకం తమకు ఉందన్నారు. న్యూఢిల్లీలోని సెయింట్ కొలంబస్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసిన బృందా కారత్, పోలింగ్ బూత్‌లోని ఇవిఎం కంట్రోల్ యూనిట్ బ్యాటరీ డిశ్చార్జ్ కావడం వల్ల ఓటు వేయడానికి దాదాపు గంటసేపు వేచి ఉండాల్సి వచ్చిందని చెప్పారు. పోలింగ్ ఏర్పాట్లపై బృందా కారత్ మాట్లాడుతూ తాను ఉదయం 9 గంటలకు బ్యాటరీ ఎలా డౌన్ అయింది? వారు చేసిన ఏర్పాట్లు ఏమిటి?' అని ఆమె ప్రశ్నిస్తూ తాను ఇక్కడ ఫిర్యాదు రాశానన్నారు. సిపిఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారత్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, నియంతృత్వానికి వ్యతిరేకంగా ఈరోజు ఓటు వేశానని, ఎందుకంటే ఇది దేశానికి అత్యంత కీలకమైన ఎన్నికలన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చాం: కెటిఆర్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నియమించిన ఉద్యోగాలకంటే ఎక్కువ ఉద్యోగాలు ఏ రాష్ట్రం లోనైనా ఇచ్చినట్టు చూపిస్తే, ఆ మరుసటి రోజే తాను తన ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేస్తానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు సవాల్ విసిరారు. ప్రభుత్వ రంగంలో 2,36,000, ప్రైవేట్ రంగంలో 24 లక్షల ఉద్యోగాలను కల్పించామని, బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో మొత్తం 26.30లక్షలపై చిలుకు ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా తెలంగాణ యువత నెత్తినిండా అబద్దాలను నింపి పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల కాలంలో ఒక్క నోటిఫికేషన్ జారీ చేసిందా అని ప్రశ్నించారు. తాము ఇచ్చిన గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, దీనికి 60 పోస్టులు కలిపి నోటిఫికేషన్ జారీ చేశారని,తాము డిఎస్సి ద్వారా 5 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేస్తే, దీనిని రద్దు చేసి, మరో 5 వేల ఉద్యోగాలు కలిపి కొత్త నోటిఫికేషన్ జారీ చేశారని కెటిఆర్‌తెలిపారు. రేవంత్ రెడ్డి అధికారంలోనికి వచ్చిన తర్వాత ఒక్క కొత్త నోటిఫికేషన్ జారీ చేయలేదని, జాబ్ క్యాలెండర్‌కు అతీగతి లేదన్నారు. తాము కష్టపడి ప్రైవేట్ సెక్టార్‌లో పరిశ్రమలను తీసుకొస్తే, వాటికి కూడా సిఎం పాతర వేస్తుంటే బాధనిపిస్తుందన్నారు. భట్టి ట్యాక్స్, రేవంత్ ట్యాక్స్, ఉత్తమ్ ట్యాక్స్ ఇలా రాష్ట్రంలో బ్రూ (బిఆర్‌యు ట్యాక్స్ మొదలైందని, ఎవరి దుకాణం వారి దేనని ఆరోపించారు. బిల్డర్లపైన కూడా ట్యాక్స్ వేస్తూ వారి నుంచి కూడా దోచుకుంటున్నారన్నారు. త్వరలోనే జూపల్లి కృష్ణారావు కూడా కొత్త దుకాణం స్టార్ట్ చేస్తారంట అని అన్నారు. వీరు సామంత రాజులని, ఢిల్లీకి కప్పం కట్టేందుకు ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్య శ్రేణి నగరాలలకు కూడా తాము ఐటి సంస్థలను తీసుకొచ్చామని, కానీ ఇప్పుడు వరంగల్ నుంచి టెక్ మహీంద్రా అనే సంస్థ వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఏది పడితే అది చెబుతామంటే, తెలంగాణ నష్టపోతుందని, ఈ వాస్తవాలన్నీ తెలంగాణ ప్రజల ముందు పెట్టాలన్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి కాదని, ఒక జోకర్‌గా మారిపోయారన్నారు. మేడిగడ్డ విషయంలో కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందన్నారు. కాఫర్ డ్యామ్ కట్టాలని కెసిఆర్ చెప్పిందే ఇప్పుడు చేస్తున్నారని కెటిఆర్ అన్నారు.

## కెటిఆర్‌పై మల్లురవి ఫైర్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిఆర్ఎస్ అభ్యర్థి బిట్స్ ఫిలాని అభ్యర్థి అయితే ఆ కాలేజీల్లో నే ఓట్లు అడగండి, వాళ్లే పట్టభద్రు లా మిగతా వాళ్ళు కదా అని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి కెటిఆర్‌ను ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నను పల్లి బఠాని అన్న కెటిఆర్ వ్యాక్యలను మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పట్టభద్రుల పై బిఆర్ఎస్ వైఖరి ఏంటో కనిపిస్తుందని అన్నారు. తీన్మార్ మల్లన్న అర్హుడని ఎలక్షన్ కమిషన్ ఒప్పుకుందని, వెంటనే కెటిఆర్ ఆయన మాటలు విత్ డ్రా చేసుకోవాలని అన్నారు. కెటిఆర్ మాటలపై ఎలక్షన్ కమిషన్‌కు పిర్యాదు చేస్తున్నాం, ఈసిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మె ల్సీ పోలింగ్ గురించి సిపిఐ, సిపిఎం, టిజెఎస్ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారని, అన్ని పార్టీలు కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను గెలిపించాలని తీర్మానించాయన్నారు. ఎమ్మెల్సీగా గెలిచాక కాంగ్రెస్ భావజాలాన్ని ఎఫెక్టీవ్‌గా ప్రజల్లోకి తీసుకెళ్తారన్నారు. సోనియా తప్పనిసరిగా వస్తారు:ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సోనియా గాంధీ తప్పనిసరిగా వస్తారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. దశాబ్ది ఉత్సవాలకు సోనియా గాంధీని ఎలా ఆహ్వానిస్తారని మా జీ మంత్రి జగదీష్ రెడ్డి మతి లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన రోజు దేవత కాబట్టే మా సిఎం రేవంత్ రెడ్డి సోనియమ్మను ఆహ్వానించారన్నారు. సోనియమ్మ తెలంగాణ ఇవ్వకపోతే కెసిఆర్, జగదీష్‌రెడ్డికి పదవులు ఎలా వచ్చేవని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో తెలంగాణ ద్రోహులకు పెద్ద పీట వేసింది కెసిఆర్ అని తెలిపారు. సోనియమ్మను విమర్శిస్తే బిఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు తరిమికొడతారని హెచ్చరించారు.

## మే 30కి ఆలయ భూముల జియోట్యాగింగ్ పూర్తి




**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఆలయ భూముల పరిరక్షణలో దేవాదాయ శాఖ అధికారులు నిమగ్నమై ఉన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉన్న దేవాలయాల భూములకు జియోట్యాగింగ్ చేయాలని ఇటీవల జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి కొండా సురేఖ ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ మేరకు దేవాదాయ పరిధిలోకి వచ్చే ప్రతి దేవాలయానికి చెందిన భూములను జియోట్యాగింగ్ చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని సైతం నియమించారు.ఈ నెల చివరి నాటికి ఆలయ భూముల జియోట్యాగింగ్ పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని దేవాదాయ శాఖ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అనిత తెలిపారు. దేవాలయ భూములు అన్యాక్రాంతం, కబ్జాలకు గురికాకుండా ఉండేందుకు జియోట్యాగింగ్ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో దేవాలయాలకు చెందిన సుమారు 91,827 ఎకరాల భూములు ఉన్నాయని వీటిలో ఇప్పటి వరుకు 70 శాతం జియోట్యాగింగ్ పూర్తయిందని మిగిలిన వాటికి కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో సుమారు 19 వేల ఎకరాల భూములపై ట్రిబ్యూనల్, జిల్లా కోర్టులు, హైకోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో పలానా దేవాలయానికి చెందిన భూమి కొంత మేర కబ్జాకు గురైందని ఫిర్యాదులు వచ్చేవని, వాటిని సర్వే చేసేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వచ్చేదని, జియోట్యాగింగ్ చేయడం ద్వారా దేవాలయ భూముల హద్దులు వెంటనే అందుబాటులో ఉంటాయన్నారు.

## డ్రిప్ కంపెనీలు రైతులకు మరింత సహకారం అందించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** డ్రిప్ కంపెనీలు రైతులకు మరింత సహకారం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతినిధులకు సూచించారు. శనివారం పలువురు డ్రిప్ కంపెనీల ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్‌ను సాగులో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను పంపిణీ చేస్తునట్లు, ఇప్పటికే రాష్ట్రంలో 57000 వేల ఎకరాలు ఆయిల్ పామ్ తోటలలో ఇన్స్టాలేషన్ పూర్తి అయిందని వారు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రిప్ కంపెనీల సహకారం ఇక ముందు కూడా కొనసాగాలని, తమ ప్రభుత్వం రైతుల సంక్షేమునకు కట్టుబడి ఉందని, ముమ్ముందు మరిన్ని పంటలకి డ్రిప్ సౌకర్యము వర్తింపజేయడానికి తమ ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని తెలిపారు.

# అణగారిన వర్గాల స్వరం ఇప్టా

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్
తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి
ఘనంగా ఇప్టా 81 వ వ్యవస్థాపక దినోత్సవాలు




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** భారతదేశ సాంస్కృతిక చరిత్రలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రత్యేక స్థానం కలిగి ఉందని ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అన్నారు. అన్యాయాలకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల స్వరవాణిగా పనిచేస్తుందన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లోని ఇప్టా రాష్ట్ర కార్యాలయం వద్ద శనివారం ఇప్టా (ప్రజా నాట్య మండలి) 81వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇప్టా పతాకాన్ని కందిమళ్ల ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ నేతృత్వంలో కళాకారులు పాడిన పాటలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ డప్పు, పాటలు, నాటకాల, జానపదాల ద్వారా ఇప్టా ప్రజలలో సాంస్కృతిక చైతన్యం తీసుకవచ్చిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, చారిత్రాత్మకమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొనేలా పౌరులను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి గట్టిగా కృషి చేసిందని అభినందించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజా నాట్యమండలిపైన ప్రభుత్వం విపరీతమైన నిర్బంధకాండను మోపిందన్నారు. 'మాభూమి' నాటకాన్ని, పాటలను, జానపదులను కార్యక్రమాలను నిజాం ప్రభుత్వం అణచివేసిందని ప్రతాప్‌రెడ్డి వివరించారు. 1943 సంవత్సరంలో ఆనాటి నాటక, చలన చిత్ర దిగ్గజాలు బాలరాజ్ సహానీ, సలీల్ చౌదరి, పృథ్వీరాజ్ కపూర్, కె.ఎ. అబ్బాస్, శంభో మిత్ర, పండిట్ రవి శంకర్, ఆనంద్ శంకర్, కైఫీ అజ్మీ, ఏకె హంగల్ లాంటి మహానుబావుల సారథ్యంలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు భారత దేశంలో ఇప్టా సాహిత్యం, చరిత్ర, సినిమా,సంగీతం, సంస్కృతి, రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తువస్తుందని తెలిపారు.అనేక ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలను ఇప్టా తమ పాట లు, నాటకాలు, కళారూపాల ద్వారా ప్రచారం చేసి, సమస్యల పరిష్కరానికి కృషి చేస్తోందన్నారు. ప్రగతిశీల కళాకారులు తమ సృజనాత్మక కళారూపాలతో ఇప్టా సాంస్కృతిక మేల్కొలుపు వారసత్వాన్ని ముందుకు సాగించాలని కందిమళ్ల ప్రతాప్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి అధ్యక్షులు కె శ్రీనివాస్,రాష్ట్ర నేతలు కె లక్ష్మి నారాయణ,కె ఉప్పలయ్య,సైదులు, విజయ్, డప్పు వెంకన్న, ఎర్ర వెంకటేశ్, అలెట స్వామి, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బి. స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు విలాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా బనాయించిన కుట్రకేసును ప్రభుత్వం ఎత్తివేసేలా చూడాలి

సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావుకు విద్యార్థి సంఘాల విజ్ఞప్తి




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డిపై అక్రమంగా బనాయించిన కుట్ర కేసును ప్రభుత్వం ఎత్తివేసేలా చూడాలని విద్యార్థి సంఘాల నేతలు సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావును కోరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య గొంతుకగా ఉన్న సిపిఐ ఎంఎల్‌ఎ విద్యార్థుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించి, అక్రమ కేసును ఎత్తివేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రెహమాన్, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, విశ్రాంత ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సతీష్, కోశాధికారి రత్నం రమేష్, రాష్ట్ర నాయకులు గణేష్, సుమన్, ధరణిలు శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లో శనివారం కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే

# దేశంలో 2 వేల సహకార బ్యాంకులు

అర్‌బిఐ రిటైర్డ్ అధికారి వైద్యనాథం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** భారతదేశానికి స్వతంత్రం వచ్చే నాటికి దేశంలో 2000 సహకార బ్యాంకులు ఉన్నాయని, సహకార బ్యాంకుల ఏర్పాటు వాటి ప్రక్రియ 1904 లోనే ప్రారంభమైందని అర్‌బిఐ రిటైర్డ్ అధికారి, బ్యాంకు డైరెక్టర్ ఆర్. ఎం.వైద్యనాథం తెలిపారు. మల్టీ స్టేట్ విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు 1 09 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగోల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం మహా జనసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ డైరెక్టర్ ఆర్.ఎం.వైద్యనాథం అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ,స్వాతంత్రం అనంతరం భారత దేశంలో 40 ఏళ్ల పాటు సహకార వ్యవస్థను పూర్తి బలిష్టం చేయడానికి కిందిస్థాయి వ ర్గాలను ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పాలక వర్గం నుంచి ఆర్‌బిఐకి సూచనలు చేస్తూ సహకార బ్యాంకులను వివిధ స్థాయిలో బలవంతం చేస్తూ వచ్చిందన్నారు. తర్వాత పూర్తి వ్యాపార దృష్టి తోటి ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలోకి తీసుకోకుండా దేశ పాలకుల అశ్రద్ధ, బ్యాంకింగ్ రంగం నిపుణుల స్వార్థంతో సహకార బ్యాంకులను దేశంలో బలహీనపర్చాడానికి కిఆర్‌బిఐ ని ఉపయోగించుకోవడం మొదలుపెట్టారని తెలిపారు, తద్వారా సహకార బ్యాంకులపై చిన్న చూపు చూస్తూ తీవ్రమైనఒత్తిడి తేవడానికి అనేక నిబంధనలు తీసుకొచ్చారని, అయినా కొన్ని బ్యాంకులు నిలదొక్కుకొని ముందుకు సాగుతూ వస్తున్నా సహకార బ్యాంకులను ప్రజలే రక్షించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు, మరో డైరెక్టర్ జె వి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అన్ని రకాల ఖాతాదారులకి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు, ఒకటి ప్రమాద బీమా, ఆరోగ్య భీమా, విద్యావంతులకు ప్రోత్సాహకార పథకాలు, సులభతరమైన రుణాలు, వీధి వ్యాపారస్తులకు వారి చెంతకే రుణాలు, అందించేందుకు అనేక సులభమైన పద్ధతులను ప్రవేశపెట్టిందన్నారు. నేటి వరకు 52 శాఖలు 14సొంత భవనాలు కలిగి ఉన్నాయని సభ్యులు, ఉద్యోగులు,పాలకవర్గం శ్రమతో, మరిన్ని బ్రాంచ్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. డైరెక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు పొందిన వారు పరిమితులోపు రుణం చెల్లించినట్లయితే 4 శాతం తిరిగి చెల్లిస్తామని తెలిపారు. బ్యాంక్ షేర్ హోల్డలందరూ ఎల్లప్పుడు సహకారం అందించాలని కోరారు, అనంతరం నాగోల్ శాఖా సంప్రదిపుల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నారాయణరెడ్డి, గోవిందరావు, సుధాకర్ రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, ఎం.వి. మూర్తి, నాగ జ్యోతి ఎన్నికైయ్యారు.

సిసిఎస్ ముందు

## సాహితి బాధితుల ధర్నా




**ప్రజాపక్షం / హైదరాబాద్:** తమకు న్యాయం చేయాలంటూ సాహితీ సర్వాణి బాధితుల సంఘం బషీర్బాగ్ లోని సిసిఎస్ కార్యాలయం ముందు బాధితులు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో రూ 2000 కోట్ల అతిపెద్ద కుంభకోణం పై గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. ఈ కుంభకోణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ కుంభకోణంపై ప్రత్యేకంగా దర్యాప్తు చేసి దీని వెనుక రాజకీయ నేతలు ఎవరున్నారో బహిర్గతమవుతుందని వారు డిమాండ్ చేశారు. ప్రీ లాంచ్ పేరిట 2,500 మంది మోసపోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అమీన్‌పూర్‌లో సాహితీ శర్వాణి ఎలైట్ పేరుతో 25 ఎకరాల్లో 32 అంతస్తులతో 10 టవర్లు నిర్మిస్తామంటూ సుమారు రూ.1,500 కోట్లు మోసానికి పాల్పడ్డారని వారు తెలిపారు. చాలా మంది తమ కష్టార్జితంతో డబ్బులు పెట్టామని, తమకు స్థలమైన, డబ్బులైన ఇప్పించాలని కోరారు. తక్షణమే ఫాస్ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి తక్షణమే న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ కేసును చూస్తున్న సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్ రావును అరెస్టు చేయడంతో కేసు నీరుగారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని తమ కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు.

# రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతాం

తీన్మార్ మల్లన్నను గెలిపించి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ప్రజాపక్షం / నల్లగొండ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభు త్వం తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా పాలన సాగిస్తుందని, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తు మ్మల నాగేశ్వరరావు అన్నారు. తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ శనివారం నల్లగొండ పట్టణంలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల సమావేశంలో మం త్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికలలో కాం గ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది ఏళ్లలో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలు చేసి తీరుతామని అన్నారు. పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఓటర్లంతా తీన్మార్ మల్లన్నకు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నపై ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందుల గురిచేసిందని అన్నారు. అయినప్పటికీ తీన్మార్ మల్లన్న కెసిఆర్ ప్రభుత్వ అక్రమాలను ఎండగట్టాడని అన్నారు. ప్రశ్నించే తత్వం ఉన్న తీన్మార్ మల్లన్న గెలిస్తే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి రాజకీయాలలో సమూల మార్పులు తీసుకువస్తా కాంగ్రెస్ ఇచ్చి న హామీలు అమలు చేయకపోతే గెలిచిన మళ్ళీ రాజీనామా చేస్తానని కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. కెసిఆర్ నియంత పాలనపై పోరాటం చేసినందుకు తనపై ఎన్నో అక్రమ కేసులు బనాయించిన ఒకటి కూడా నిరూపించలేకపోయిందని అన్నారు. అక్రమ కేసులతో జైల్లో పెట్టి తన ను, తన కుటుంబాన్ని ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన భయపడకుండా నిరుద్యోగుల కోసం పోరాటం చేశానని అన్నారు. గత ప్రభుత్వం తనను చంపడానికి సూ పారి కూడా ఇచ్చిందని, అయినప్పటికీ తాను దేనికి భయపడలేదని అన్నారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టి నిరుద్యోగుల కోసం పోరాటం చేశానే తప్ప ఇంతవరకు ఎవరిని ఇ బ్బందులకు గురిచేసిన దాఖలాలు లేవని స్పష్టం చేశా రు. బ్లాక్ మెయిలర్ అంటూ తనపై అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. తనను ఓ డించడానికి అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని, గ్రాడ్యుయేట్ ఓట్లను కూడా కొనడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఆలోచించి ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓట్లతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూట లక్ష్మణ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దే సుమన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, సిపిఎం నాయకులు ఎండి సలీం, సయ్యద్ హాషం, మైనార్టీ నాయకులు బషీర్, ఎంఎ ఖాన్, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రచారం.. రేపు ఎమ్మెల్సీ ఎన్నికలు

పట్టభద్రులను ఆకట్టుకునే యత్నంలో అభ్యర్థులు
పోలింగ్ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
ఖమ్మంలో 83,879 మంది ఓటర్లు - 118 పోలింగ్ కేంద్రాలు
భద్రాద్రిలో 40,106 మంది ఓటర్లు - 55 పోలింగ్ కేంద్రాలు







**ప్రజాపక్షం / ఖమ్మం :** ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల ప్రచారం ముగిసింది. గడిచిన వారం రోజులుగా కొందరు స్వతంత్ర అభ్యర్థులతో పాటు ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహించారు. ర్యాలీలు, సభలు లేకపోయినా పట్టభద్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తమను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ల పక్షాన ఆయా పార్టీల నేతలు, అనుబంధ సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు సంబంధించి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆ పార్టీ శాసన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, మట్టా దయానంద్, మహ్మద్ జావిద్ తదితరులు ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ పక్షాన పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపు కోరుతూ మాజీ మంత్రులు కెటి రామారావు, హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు తాతా మధు, మాజీ ఎంఎల్ఎలు, ఆ పార్టీ నాయకులు ప్రచార కార్యక్రమంలో పాల్గొనగా బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోరుతూ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తాండ్ర వినోద్‌రావు, ఈటల రాజేందర్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ తదితరులు ప్రచారం నిర్వహించారు. కొందరు స్వతంత్రులు ముఖాముఖిగాను, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం జరిగే ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పట్టభద్రులు ఓటు వినియోగించుకునే ఉద్యోగులకు సెలవు దినంగా ప్రకటించింది. ఖమ్మంజిల్లాలో మొత్తం 83,879 మంది ఓటర్లు ఉండగా 50,676 మంది పురుషులు, 33,199 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నలుగురు ఇతరులు ఉన్నారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో 40,106 మంది ఓటర్లు ఉండగా అందులో 22,590 మంది పురుషులు, 17,516 మంది మహిళా పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 118 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా ఖమ్మం నగరంలో 52 బూత్‌లను ఏర్పాటు చేయగా ఆ తర్వాత సత్తుపల్లిలో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రూరల్ మండలంలో 7, మధిరలో 6, కల్లూరులో 4, వైరాలో 4, నేలకొండపల్లిలో 4, కూసుమంచిలో 3 బూత్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన మండలాల్లో సగటున రెండు బూతుల చొప్పున ఏర్పాటు చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు పోలింగ్ బాధ్యతలను అప్పగించారు. బహిరంగ ప్రచారం ముగియడంతో పట్టభద్రుల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో అభ్యర్థులు ఆయా రాజకీయ పార్టీలు ఉన్నాయి. గత ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా నెలకొన్న సందడి ఇప్పుడు లేదన్నది వాస్తవం. 52 మంది రంగంలో ఉన్న ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు గెలుపుపై ఆశలు పెంచుకున్నాయి. కాంగ్రెస్‌కు సిపిఐ, సిపిఎం మద్దతు పలకడం గెలుపుకు సానుకూల అంశంగా మారింది. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ బాక్స్‌లను పోలింగ్ అనంతరం నల్గొండలోని ఓటర్ల లెక్కింపు కేంద్రానికి తరలించనున్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ ను 48 గంటల పాటు అమలు చేయనున్నారు. పోలింగ్ ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉండనుంది. పోలింగ్ సందర్భంగా వైన్ షాపులను 48 గంటల పాటు బంద్ చేయనున్నారు.

## నిరుద్యోగుల ఊసెత్తే అర్హత కెటిఆర్‌కు లేదు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గత పదేండ్లలో విద్యార్థులను బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడూ నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే విధంగా కెటిఆర్ మాట్లాడడం విచారకరమన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉండగా విద్యార్థుల్ని కెటిఆర్ ఏనాడన్నా కలిశారా? అని ప్రశ్నించారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే జీవో నెం. 46,317లో ఉన్న సమస్యల్ని పరిష్కారం చేస్తామన్నారు. జీవో నెం 46పై కెటిఆర్ అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. బిఆర్ఎస్ హయాంలో జిఓ 46ను ప్రభుత్వం తీసుకు వచ్చినప్పుడు తాము దానిని వ్యతిరేకించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క ఆ జిఓ నెం 46 అంశం పై కేబినెట్ సబ్ కమిటటీని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని, ఆ హామీల అమలు కోసం కాంగ్రెస్‌పార్టీలోని నాయకులం బాధ్యత తీసుకుంటారన్నా రు. ప్రశ్నించే గొంతుక తీన్మా ర్ మల్లన్నను గెలిపించండని, మీ సమస్యల కోసం శాస న మండలిలో తాను, తీన్మార్ మల్లన్న కొట్లాడుతామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత జాబ్ కేలండర్ ప్రకటిస్తామన్నారు. బిఆర్ఎస్ సర్కారు నోటిఫికేషన్ ఇస్తే ఉద్యోగం ఇచ్చినట్టు కాదని, ఉద్యోగ పత్రం ఇస్తేనే ఉద్యోగం ఇచ్చినట్టు అని బల్మూరి వెంకట్ అన్నారు. గత ప్రభు త్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాలు అమ్ముకోవాలని యత్నించారని, అలాంటి పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శి క్షిస్తామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఒకటో తేదీననే జీతాలు ఇస్తున్నామన్నారు. టెక్నికల్ ప్రాబ్లంతోనే స్టాఫ్‌నర్స్‌లకు జీతాలు లేట్ అయ్యాయి తప్పితే మ రోటి కాదన్నారు. మూడు నెలల్లో తమ ప్ర భుత్వం చేసిన కార్యక్రమాలు, పథకాలపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, మీరు పది సంవత్సరాలలో చేసిన అభివృద్ధి పై చర్చకు వస్తారా? అని సవాల్ విసిరారు.




## వడదెబ్బ అంటే ఏమిటి?



బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఇటీవల వడదెబ్బ కారణంగా ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం అతనిని డిశ్చార్జి చేశారు. దక్షిణాదిలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, ఉత్తరాదిని హీట్‌వేవ్ (వడగాలులు) ముంచెత్తుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, ఎంతో మంది ఉష్ణతాప వ్యాధులతో సతమతమవుతున్నారు. వడదెబ్బ తగిలి ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇంతకీ హీట్‌స్ట్రోక్ లేదా వడదెబ్బ అంటే ఏమిటి? పరిసరాల ఉష్ణోగ్రతను బట్టి శరీరం ఎప్పటికప్పుడు మార్పు చెందుతూ, వేడిని నియంత్రిస్తుంది. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు చెమట పట్టడం ద్వారా శరీరం చల్లబడుతుంది. అయితే, బాహ్య ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి, చెమటను నిరోధించినప్పుడు శరీరం విపరీతమైన వేడికి గురవుతుంది. దీనినే వడదెబ్బగా పేర్కొంటారు. ఆ సమయంలో శరీర ఉష్ణోగ్రత సుమారుగా 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతుంది. శరీరంలో సోడియం, పొటాషియం లవణాల సమతుల్యత లోపిస్తుంది. వడదెబ్బకు గురైన వారు మగతగా ఉంటారు. కొన్ని సందర్భాల్లో కోమాలోకి కూడా వెళ్లే ప్రమాదం ఉంది. మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటాయి. అతి కొద్ది సందర్భాల్లో మరణాలు కూడా సంభవిస్తాయి. వడదెబ్బ తగిలినట్టు గుర్తించిన వెంటనే, శరీర ఉష్ణోగ్రతను త్వరగా తగ్గించే ప్రయత్నం చేయాలి. చల్లటి నీటిని ఒంటిపై పోసుకోవడం, కొబ్బరినీరు, నిమ్మకాయ నీరు, కుదరకపోతే, కనీసం స్వచ్ఛమైన నీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవాలి. 'ఎలక్ట్రొలైట్స్' పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వాంతులు, విరోచనాలు సంభవిస్తే, తక్షణమే వైద్య సేవలు పొందాలి. ఆల్కహాల్, టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండి, లస్సీ, లెమన్‌వాటర్, ఓఆర్ఎస్ వంటి హైడ్రేటింగ్ పానీయాలు తీసుకోవాలి. తేలికైన లేదా తక్కువ రంగుగల వదులుగా ఉండే, కాటన్ దుస్తులను ధరించడం మంచిది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఇప్పటికే హెచ్చరించినట్టు, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లకపోవడం ఉత్తమం.

## జంతు దౌత్యం.. స్నేహ హస్తం



ప్రపంచంలోనే పామాయిల్ ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలుస్తున్న మలేషియా జంతు దౌత్యాన్ని ముందుకు తీసుకొచ్చింది. తమ నుంచి పామాయిల్‌ను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసే దేశాలకు 'ఒరాంగుటాన్'లను కానుకగా ఇస్తామన్న ప్రతిపాదన చేసింది. తద్వారా, వివిధ దేశాలతో వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవడమేగాక, పర్యావరణ పరిరక్షణపైన తన చిత్తశుద్ధిని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ కాలుష్యం ఆందోళన కలిగిస్తున్న అంశం. పర్యావరణ పరిరక్షకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు అవసరమన్న డిమాండ్ పెరుగుతున్నది. నిర్లక్ష్యం ఇదే రీతిలో ఉంటే, భవిష్యత్తులో భూమి అగ్నిగోళంగా మారుతుందని, మనిషి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మలేషియా జంతు దౌత్యాన్ని తెరపైకి తీసుకురావడం ఆహ్వానించదగిన పరిణామం. వివిధ దేశాల మధ్య స్నేహం లేదా సుహృద్భావానికి చిహ్నంగా జంతువులను ఇవ్వడం లేదా అప్పు ఇవ్వడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ జీవులు సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి లేదా వాటిని బహుమతిగా ఇచ్చే దేశానికి చెందినవై ఉంటాయి. అందువల్ల వాటిని దౌత్యానికి ప్రభావవంతమైన సాధనాలుగా చేస్తాయి. మధ్య యుగాలు, పునరుజ్జీవనోద్యమ కాలంలో, యూరోపియన్ రాజులు ప్రత్యర్థులపై తమ అధికారాన్ని చూపించడానికి తరచుగా సింహాలు, పులులు వంటి జంతువులను మార్పిడి చేసుకునే వారు. 14, 15వ శతాబ్దాలలో ప్రాచీన ఈజిప్టులో పాలకులు జిరాఫీలను బహుమతిగా ఇచ్చేవారు. జంతు దౌత్యం అనేది దేశాలమధ్య ఘర్షణను తగ్గించడమేగాక, అంతరించిపోతున్న వివిధరకాల జంతువులను కాపాడటానికి, అడవులను సంరక్షించడానికి తోడ్పడుతుంది. అటవీ భూముల సంరక్షణ అనేది పర్యావరణ పరిరక్షణకు మొదటి మార్గం. అందుకే, ఒరాంగుటాన్‌లను బహుమతిగా ఇస్తామన్న మలేసియా ప్రయత్నాన్ని ప్రపంచ దేశాలు ఆహ్వానించాలి. పామాయిల్ ఒప్పందాలతో ముందుకు రావాలి.

## సౌర చక్రాలపై విస్తృత అధ్యయనం

సూర్యుని అయస్కాంత క్షేత్రం (మాగ్నటిక్ ఫీల్డ్), సౌర చక్రాలు (సోలార్ సైకిల్స్)పై విస్తృత అధ్యయనం జరుగుతున్నది. వీటి మూలాలను గుర్తించే పనిలో పలువురు శాస్త్రవేత్తలు. సూర్యుని డైనమో, అయస్కాంత క్షేత్రాన్ని ఉత్పత్తి చేసే ప్రక్రియ, బయటి పొరలలో ఉపరితలానికి చాలా దగ్గరగా ఉంటుందని కొత్త అధ్యయనం సూచిస్తున్నది. దీనికి, సూర్యుని శక్తివంతమైన అయస్కాంత క్షేత్రం అనేది దాని మధ్యభాగం నుంచి ఉద్భవిస్తున్నదన్న వాదన బలంగా ఉండేది. కానీ, తాజా అధ్యయనాలు ఆ సిద్ధాంతాన్ని తోసిపుచ్చాయి. సూర్యుని ఉపరితల పొరల నుండే అయస్కాంత క్షేత్రం, దాని నుంచి సౌర చక్రాలు ఏర్పడుతున్నట్టు సూచన ప్రాయంగా నిర్ధారించారు. అయితే, ఈ విషయంలో మరింతలోతైన అధ్యయనం అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ప్రతి 11 సంవత్సరాలకు ఒకసారి సూర్యుని అయస్కాంత క్షేత్రం సౌరచక్రంగా పిలిచే చక్రానికి లోనవుతుంది. సూర్యునిపై అత్యధిక అయస్కాంత క్షేత్రం ఉన్న ప్రాంతం ఆధారంగా సౌర చక్రాలు ఏర్పడతాయి. సౌర చక్రం ప్రారంభం (సౌర కనిష్ఠం)లో సూర్య మచ్చలు చాలా తక్కువగా ఉంటాయి . ఆ తర్వాత గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. అనంతరం తిరిగి మందగిస్తాయి. మచ్చలు చాలా ఎక్కువగా ఉన్న సమయంలో, సూర్యుని ధ్రువ ప్రాంతాల్లో ప్రపంచ అయస్కాంత క్షేత్ర ధ్రువణత తిరగబడుతుంది. ఈ చక్రీయ నమూనాను టోర్షనల్ పెండలం లేదా టోర్షనల్ డోలనం అంటారు. ఇందులో సౌర భ్రమణం క్రమానుగతంగా కొన్ని అక్షాంశ మండలాల్లో వేగవంతమవుతుంది. ఒక్కోసారి మందగిస్తుంది. అయితే ఇతర ప్రాంతాల్లో భ్రమణం స్థిరంగా ఉంటుంది. తదుపరి సౌర చక్రం బలంగా ఉంటుందా లేదా బలహీనంగా ఉంటుందా అని మునుపటి నమూనాలు ఖచ్చితంగా అంచనా వేయలేకపోయాయి. కొత్త అధ్యయనం ఇలాంటి అంచనాలకు అవకాశం కల్పిస్తుంది. సౌర మండలం నుంచి సౌర జ్వాలల వరకూ అనేకానేక అంశాలపై ఒక స్పష్టత వస్తే, ఇతర నక్షత్రాల అధ్యయనం సులభమవుతుంది. వివిఎస్ మైత్రేయి

# ఏకాకి అవుతున్న ఇజ్రాయిల్

'హమస్ తీవ్రవాదుల ఏరివేత, తమ బందీల విడుదల' పేరుతో యూదు జాత్యహంకార ఇజ్రాయిల్ ఏడు మాసాలకు పైబడి గాజా స్ట్రిప్‌లోని పాలస్తీనియన్‌లపై సాగిస్తున్న మారణహోమం అతి పెద్ద మానవ సంక్షోభంగా పరిణమించిన నేపథ్యంలో ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (అంతర్జాతీయ న్యాయస్థానం) శుక్రవారం జారీ చేసిన ఆదేశం స్వాగతించదగింది. ''రఫాలో తక్షణం సైనిక చర్యలు ఆపాలి'' అని కోర్టు ఆదేశించింది. రఫాలోని లక్షలాది మంది పాలస్తీనా కాందిశీకులకు ఈజిప్టు నుంచి 'మానవతా సహాయం అందించే రఫా క్రాసింగ్‌ను తెరిచి ఉంచాలని' ఇజ్రాయిల్‌ను ఆదేశిస్తూ, అదే సమయంలో అక్టోబర్ 7న దాడిలో బందీలుగా తీసుకున్న ఇజ్రాయిల్ పౌరులను 'బేషరతుగా'గా విడుదల చేయాలని హమస్‌ను ఆదేశించింది. అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) ఆదేశాలు ఇజ్రాయిల్ సహా ఐరాస సభ్యదేశాలన్నిటికీ శిరోధార్యం. అయితే వాటిని అమలు చేయించేందుకు దానికి ప్రత్యేక యంత్రాంగం ఏమీ లేదు. అందువల్ల అవి నైతిక ఒత్తిడిగా పని వేస్తాయి. గాజాలో ఇజ్రాయిల్ జనసంహారానికి పాల్పడుతున్నదని, అందువల్ల వెంటనే పోరాట విరమణను ఆదేశించాలని కోరుతూ దక్షిణాఫ్రికా గత సంవత్సరమే ఐసిజెకి విజ్ఞప్తి చేసింది. గాజాపై ఇజ్రాయిల్ చర్య 1948 నాటి యుఎన్ జనోసైడ్ కన్వెన్షన్‌ను ఉల్లంఘిస్తున్నదన్నది దాని ఆరోపణ. ఇజ్రాయిల్ ఆ ఆరోపణను తిరస్కరించింది. దానిపై విచారణ పూర్తికావటానికి ఏళ్ళు పూళ్ళు పట్టవచ్చు. ఇంతలో ఈ మధ్యంతర ఆదేశం పోరాట విరమణను కోరక

ప్రజాపక్షం
26-05-2024, ఆదివారం

పోయినా ఇజ్రాయిల్ పాటిస్తే అమానుషమైన నరబాధలను నివారించగలుగుతుంది. గాజాలో తన సైనిక చర్యల సమయంలో సామూహిక జన సంహారానికి (జనోసైడ్) దారి తీసే చర్యలను నిరోధించాలని జనవరి 26న ఐసిజె ఆదేశించింది. అయినా ఇజ్రాయిల్ ప్రస్తుత బాంబుదాడుల్లో దాదాపు 40 వేల మంది స్త్రీలు, బాలలు సహా అమాయక ప్రజలు మృతి చెందారు. 70 వేల మంది దాకా గాయపడ్డారు. ఆసుపత్రులు, విద్యాలయాలు, జనావాసాలు పెద్ద ఎత్తున ధ్వంసమైనాయి. లక్షలాది మందిని గాజా నుండి ఇంత మారణహోమం జరుగుతున్నా రాక్షసకృత్యాలకు పెద్దన్నలాంటి అమెరికా ప్రభుత్వం ఇజ్రాయిల్‌ని నిరోధించకపోగా టెర్రరిజం అణచివేత పేరుతో దానికి ఆయుధాలు అమ్ముకుని సొమ్ము చేసుకునే పనిలో ఉంది. బ్రిటన్‌లాంటి కొన్ని యూరప్ దేశాల మద్దతు కొనసాగుతున్నప్పటికీ, ప్రపంచదేశాల్లో విజ్ఞత, మానవత్వం మేల్కొంటున్నది. అమెరికా అంతటా యూనివర్శిటీల్లో విద్యార్థులు ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నారు. అనేక దేశాల్లో ఇంత పెద్ద ఎత్తున పాలస్తీనా సంఘీభావ ఉద్యమాన్ని ఇటీవల దశాబ్దాల్లో మనం చూడలేదు. దీని పర్యవసానమే కావచ్చు, ఈ వారంలో మూడు యూరప్ దేశాలు ఐర్లాండ్, నార్వే, స్పెయిన్ పాలస్తీనా రాజ్యాన్ని గుర్తిస్తామని ప్రకటించాయి. పాలస్తీనా సమస్య పరిష్కారం కావాలని, రెండు రాజ్యాలు శాంతితో సహజీవనం చేయాలని అవి అభిలషిస్తున్నాయి. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు ప్రాసిక్యూటర్ కరీంఖాన్, యుద్ధనేరాలు, మానవ వ్యతిరేక నేరాలకు గాను ప్రధాని నెతాన్యాహు సహా ఇజ్రాయిల్ అగ్ర నాయకులు, హమస్ నాయకుల అరెస్టును కోరిన సంచలనాత్మక నిర్ణయం తదుపరి వచ్చిన ఐసిజె ఆదేశం తీవ్రమైనది. ఇది అమలు జరిగి మానవబాధలకు తాత్కాలికంగానైనా ఉపశమనం చేకూరాలంటే ఇజ్రాయిల్ పచ్చి మితవాద నాయకులతోపాటు హమస్ నాయకులు కూడా తమచర్యల పట్ల పునరాలోచన చేయాలి. 2007 నుంచి గాజా స్ట్రిప్‌ను పరిపాలిస్తున్న హమస్ గ్రూపు ఒంటెత్తుపోకడ విడనాడి రమల్లాలోని పాలస్తీనా ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా న్యాయమైన పరిష్కారసాధనకు కృషి చేయనిదే ఈ వివాదం రావణకాష్ఠంలా ఎడతెగవులేకుండా దహిస్తూనే ఉంటుంది. చెల్లాచెదురై ప్రవాస జీవితం గడుపుతున్న పదుల లక్షలవేరాలంటే ఐరాస మరింత క్రియాశీలక చొరవ తీసుకోవాలి.

# కమ్యూనిజం అప్రతిహత శక్తి



కె.నారాయణ
సిపిఐ జాతీయ కార్యదర్శి

సోవియట్ యూనియన్, సోషలిస్టు శిబిరం అంతర్థానమైన తదుపరి కమ్యూనిజం అంతరించిపోయిందని సంబరపడిన ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద, అభివృద్ధి నిరోధక శక్తులు అనతి కాలంలోనే నిరాశచెందక తప్పలేదు. మన భూగోళంపై నూతన రాజకీయ పరిస్థితులను సూక్ష్మంగా చూదాం. ఏకధృవ ప్రపంచ నిర్మాణానికి (అనగా అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య ప్రపంచ వ్యవస్థ) తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఐనప్పటికీ ప్రపంచ జనాభాలో ఐదవ వంతు కమ్యూనిస్టుపార్టీలు పరిపాలన సాగిస్తున్న దేశాలలో (చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా, లావోస్) ఉన్నారు. అంతేకాదు, అనేక ఐరోపా, ఆఫ్రికా దేశాల్లో కమ్యూనిస్టుపార్టీల్లో పెద్దసంఖ్యలో సభ్యులు, అనుయాయులు ఉన్నారు. రష్యాలో సైతం డ్యూమా (పార్లమెంటు)లో నాల్గవ వంతు సభ్యులు కమ్యూనిస్టులే. పూర్వపు సోషలిస్టు దేశాలైన జెకొస్లొవేకియా, తూర్పు జర్మనీ, హంగరీ, పోలెండ్, బల్గేరియా, రుమేనియా, ఆల్బేనియాలలో కమ్యూనిస్టులు పరిపాలించారు. మంగోలియా, కంపూచియా, (కాంబోడియా), ఆఫ్ఘానిస్థాన్, దక్షిణ ఎమెన్, సిరియాల్లో కమ్యూనిస్టులు పరిపాలించారు. మధ్య అమెరికాలో నికరాగ్వా, గ్రెనడా కమ్యూనిస్టు దేశాలుగా ఉండినాయి. ఆఫ్రికా ఖండంలో అంగోలా, మొజాంబిక్, సోమాలియా, ఇథియోపియా తదితర దేశాల్లో కమ్యూనిస్టులు పరిపాలించారు. కమ్యూనిస్టులకు తగినంత ప్రభావం, పలుకుబడి ఉంది. దక్షిణ అమెరికాలో బ్రెజిల్, వెనిజులా, మెక్సికోలలో వామపక్ష అనుకూల ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా ఎన్నుకోబడినాయి. పూర్వపు సోవియట్ యూనియన్‌లో ఉన్న అనేక రిపబ్లిక్‌లు – కజఖ్‌స్థాన్, అజర్‌బైజాన్, ఆర్మేనియాల్లో, బాల్కన్ రాజ్యాలైన ఇస్తోనియా, లాత్వియా, లిథువేనియాల్లో కమ్యూనిస్టులకు గణనీయమైన ప్రభావం ఉంది.

వాతావరణ మార్పు అనేకానేక సమస్యలు సృష్టిస్తున్నది. వాతావరణంలో మార్పును నియంత్రించటంలో పశ్చిమ దేశాలు ఘోరంగా విఫలమైనాయి. ప్రకృతి వనరులపైన, వస్తువుల రవాణాపైన పశ్చిమ దేశాలకు ఆధిపత్యం ఉంది. ఇజ్రాయిల్–పాలస్తినా యుద్ధం వల్ల, నిరుద్యోగం, ఆకలివల్ల ప్రజలు వలసపోవటం పెరుగుతున్నది. అమెరికా గనుక ఇరాన్‌పై దాడిచేస్తే, యుద్ధరంగంలోకి రష్యా దిగవలసివస్తుందని అమెరికాకు రష్యా హెచ్చరించింది. దాంతో అమెరికా తదుపరి యుద్ధోన్మాద చర్యను వెనక్కుతీసుకుంది. ఇజ్రాయిల్–పాలస్తినా మధ్య గత ఎనిమిది మాసాలుగా యుద్ధం జరుగుతున్నది. ఇప్పటివరకూ 40 వేలమంది పాలస్తీనియన్లు మృతి చెందారు. 75వేల మంది గాయపడ్డారు. రెండుకోట్ల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు ధ్వంసమవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి పోరాట విరమణకు విజ్ఞప్తి చేసినా అది ఇజ్రాయిల్ చెవిటి చెవులకెక్కలేదు. మానవ హక్కులు ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. అనేక దేశాలు ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు తెంచుకుంటున్నాయి. గతంలో



తమిళనాడులో నిర్మించిన సిపిఐ శాశ్వత రాజకీయ పాఠశాల భవనం

అమెరికా చేతిలో కీలుబొమ్మగా పనిచేసిన కొలంబియా కూడా వాటిల్లో ఉంది. హమస్ అతివాదుల నుండి 400 మంది బందీలను విడిపించుకోవడంలో ఇజ్రాయిల్ విఫలమైంది. దీంతో స్వదేశంలో ప్రతిపక్ష పార్టీలు నేతన్యాహూపై విమర్శలు పెంచుతున్నాయి. నేతన్యాహూ జాతీయ దురభిమానాన్ని రెచ్చగొడుతున్నారు. గాజాస్ట్రిప్‌లో మారణహోమం కొనసాగుతున్నది. అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘించబడుతున్నాయి. అమెరికా, బ్రిటన్‌లలో ఎన్నికలు దగ్గర పడుతున్నందువల్ల పాలక పార్టీలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పశ్చిమ ఆసియాలో అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. అమెరికా ఒకనాడు వియత్నాంలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని కాపాడుకోలేకపోయింది. ఇప్పుడు వియత్నాం కమ్యూనిస్టుల పాలనలో ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా ఉంది. ప్రపంచమంతటా ప్రధాన పట్టణాలలో ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి. అమెరికా, పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అమెరికాలోని యూనివర్సిటీల క్యాంపస్‌లన్నీ నిరసన ప్రదర్శనలతో నిండిపోయాయి.

కమ్యూనిస్టు దేశమైన చైనా ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందింది. కొద్ది సంవత్సరాలలో అది అమెరికాను అధిగమిస్తుంది. శాస్త్ర–సాంకేతిక విప్లవం పురోగతి కారణంగా కృత్రిమ మేధ (ఎఐ) ముందుకు వస్తున్నది. మానవ ప్రాణాలకు అపాయం (రిస్కు) లేకుండా నివారించేందుకు ప్రమాదకరమైన పని ప్రదేశాల్లో ఎ ఐ ని ఉపయోగించవచ్చు. లాటిన్ అమెరికా దేశాలను అమెరికా తన పెరడుగా భావించింది. ఐతే ఆ దేశాలు ఇప్పుడు అమెరికా పైన లేదా ఐఎంఎఫ్ పైన ఆధారపడిలేవు. వాటికి సొంత బ్యాంక్ ఉంది. ''మా వనరులు మావే'' అనే నినాదం బొలివేరియన్ విప్లవ ప్రాంతాల్లో మార్మోగుతున్నది.

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు 164 సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు మ్యానిఫెస్టో 'ప్రణాళి'కను తీర్చిదిద్దారు. దానికి నేటికీ ప్రాసంగికత ఉంది. శాస్త్రీయ సోషలిజం కార్యక్రమాలను రచించటం చారిత్రక కార్యం. అన్ని సమాజాల చరిత్ర వర్గపోరాటాల చరిత్ర అని వారు సూత్రీకరించారు. 2008లో సంభవించిన ఆర్థిక సంక్షోభం తదుపరి కమ్యూనిస్టు మ్యానిఫెస్టో చిరు పుస్తకం ప్రపంచమంతటా పెద్దగా అమ్ముడుపోయింది. బ్రిటన్‌లో ఒక విక్రేత ఒకే ఒక్కవారం రోజుల్లో 30,000 మ్యానిఫెస్టో ప్రతులు విక్రయించారు. ఒక సర్వే ప్రకారం, 40 శాతం ప్రజలు సోషలిజం కోరుకుంటున్నారు. గ్రేట్ బ్రిటన్‌లో 83 శాతం ప్రజలు నీటి సరఫరాను జాతీయం చేయాలని కోరుతున్నారు. 77 శాతం మంది విద్యుచ్ఛక్తి, గ్యాస్ జాతీయీకరణను కోరుతున్నారు. రైల్వేల జాతీయీకరణను 76 శాతం మంది డిమాండ్ చేస్తున్నారు.

పశ్చిమ దేశాలు సైతం చైనాతో, ఇతర సోషలిస్టు దేశాలతో దౌత్య సంబంధాలు కాంక్షిస్తున్నాయి. భూగోళమంతటా కమ్యూనిస్టులు విజయం సాధించే రోజు వస్తుంది. తమిళనాడులో గోపిశెట్టిపాలయం జిల్లాలో, తొలి కమ్యూనిస్టులలో ఒకరైన కామ్రేడ్ సి.ఎస్.సుబ్రహ్మణ్యం పేరుతో నిర్మించిన కమ్యూనిస్టుపార్టీ శాశ్వత రాజకీయ పాఠశాల భవనం పార్టీ క్యాడర్‌లను విప్లవ సిద్ధాంతాలతో, అలాగే మన మాతృదేశంలోని రోజువారీ రాజకీయాలతో సన్నద్ధం చేస్తుందని ఆశిస్తున్నాను. ఈ కమ్యూనిస్టు సౌధాన్ని సవ్యంగా వినియోగించుకోవటమే తమిళనాడు గడ్డపై మన యుగంలో మహాయోధులైన అమరజీవులు సి.ఎస్.సుబ్రహ్మణ్యం, సింగారవేలు చెట్టియార్‌లకు మనం అందించే నిజమైన నివాళులు.

## గుడ్డిగా నమ్మితే ఇంతే..



చట్టం గురించి తెలియదంటే చట్టం ఒప్పుకోదు. పర్యవసానాలు ఎదుర్కోక తప్పదు. అందుకే తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే అంటారు. అలాంటి తప్పే చేశాడు గుజరాత్‌లోని పటాన్ జిల్లా నవగంజ్‌వాసి ఖేమ్‌రాజ్ దేవ్. చిన్న టీ దుకాణం నడిపే అతనికి ఆదాయ పన్ను శాఖ ఏకంగా రూ. 49 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. అంతకు ముందు, గత ఏడాది ఆగస్టులో ఇలాంటి నోటీసు వచ్చినప్పటికీ, కేవలం 7వ తరగతి వరకే చదువుకున్న దేవ్ పట్టించుకోలేదు. తిరిగి తాజాగా నోటీసులు అందేసరికి న్యాయవాదిని సంప్రదించాడు. జరిగింది తెలుసుకొని దిగ్భ్రాంతికి లోనయ్యాడు. విషయం ఏమిటంటే నవగంజ్ కమోడిటీ మార్కెట్‌లో దేవ్ టీ దుకాణానికి సమీపంలోనే అల్పేశ్, విపుల్ పటేల్ అనే అన్నదమ్ములు బ్రోకరేజ్ వ్యాపారం చేస్తున్నారు. తరచు తన వద్ద టీ తాగడంతో, వారితో దేవ్‌కు పరిచయం పెరిగింది. బ్యాంకు ఖాతాను పాన్ కార్డుతో అనుసంధానం చేయడం తనకు తెలియదంటూ, వారి సాయం కోరాడు. వారిద్దరూ 2014లో దేవ్ పాన్ కార్డు, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకున్నారు. కొన్ని కాగితాలపై సంతకాలు కూడా చేయించుకున్నారు. ఆ తర్వాతే సమస్య మొదలైంది. 2014–15, 2015–16 ఆర్థిక సంవత్సరాల్లో భారీగా అక్రమ వ్యాపారం జరిగినట్టు ఐటి అధికారులు గుర్తించి, నోటీసులు పంపారు. దేవ్ తన బ్యాంకు ఖాతాను సరిచూసుకున్నప్పుడు అందులో భారీలావాదేవీలు ఏవీ లేదు. అయితే, తన పేరుతో మరో ఖాతాఉందని అతనికి తెలిసి కంగుతిన్నాడు. న్యాయవాదిని సంప్రదించి, వివరాలు తెలుసుకున్నాడు. తన పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫొటోలు అల్పేశ్, విపుల్ సోదరులకు ఇచ్చిన వైనాన్ని ఐటి అధికారులకు వివరించారు. ఆ అన్నదమ్ములపై ఫోర్జరీ, మోసం కేసుపెట్టాడు. ఆ కేసుతేలే వరకూ దేవ్‌కు కోర్టు చుట్టూ ప్రదక్షిణలు తప్పవు. డబ్బుఖర్చు, సమయం వృథా అదనం. ఎవరినైనా గుడ్డిగా నమ్మితే ఏమవుతుందో చెప్పడానికి దేవ్ ఉదంతమే ఓ ఉదాహరణ.

# లోక్‌సభ ఫలితాలతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు లంకె

లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందనే చర్చ రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలలో జరుగుతోంది. రాజ్యాంగ చటం ప్రకారం క్యాబినెట్ సభ్యుల సంఖ్య దిగువసభ సంఖ్యలో 15 శాతానికి మించకూడదు. ఆ ప్రకారం తెలంగాణ మంత్రిమండలిలో 18 మందికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలుపుకొని మంత్రివర్గంలో 12 మంది సభ్యుల ఉన్నారు. ఇంకా ఆరుగురు మంత్రులకు అవకాశం ఉంది. అయితే, భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా క్యాబినెట్‌లో ఖాళీలు ఉంచుకోవాలని ముందే నిర్ణయించుకున్నారు. కీలకమైన హోం శాఖ, విద్యా శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ వంటివి ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆర్థికం, విద్యుత్ శాఖలు కేటాయించబడ్డాయి. ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందు అభ్యర్థులను గెలిపించే బాధ్యత మంత్రులదే అని ఏఐసిసి సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చి మరీ స్పష్టం చేశారు. మంత్రులకు లోక్‌సభ నియోజకవర్గాలను కూడా కేటాయించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఇందుకు మినహాయింపునిచ్చారు. దీంతో ఎన్నికల ఫలితాలు మంత్రుల భవితవ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుత మంత్రిమండలిలో కొన్ని జిల్లాలకు , కొన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లేదు. ముఖ్యంగా కీలకమైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాను కలుపుకొని ఉన్న జిహెచ్ఎంసి పరిధిలో ఒక్క మంత్రి కూడా లేరు. తెలంగాణలో మూడొంతుల జనాభా ఈ ప్రాంతంలోనే ఉంది. ఇక్కడ నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండడం ప్రధానం, ఒక్క ఎంఎల్‌ఏ లేకపోవడంతో పాటు, ఒక్క మంత్రి ఇక్కడ లేకపోవడంతో వెలితిగా ఉన్నది. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వ్యవహరిస్తున్నారు. అలాగే ముస్లిం మైనారిటీ, లంబాడా, మరి కొన్ని బిసి కులాలకు కూడా మంత్రులు లేరు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ ప్రచార సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ సామాజిక వర్గం నుండి ఒకరిని తీసుకుంటానని ప్రకటించారు. ముదిరాజ్‌లు కాంగ్రెస్‌కు అండగా నిలబడాలని, మెదక్‌లో తాము టిక్కెటిచ్చిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధును గెలిపించాలని వారిని కోరారు. ఈ సామాజికవర్గ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపునకు మలుపుకునేందుకు ముఖ్యమంత్రి శాయశక్తుల ప్రయత్నించారు. ప్రస్తుతం ఆ సామాజిక వర్గానికి సంబంధించి ఏకైక ఎంఎల్‌ఏ కాంగ్రెస్ తరుపున మహబూబ్‌నగర్ నుండి ఎన్నికైన శ్రీహరి ఉన్నారు. అయితే, మంత్రి పదవి ఆయనకే ఇవ్వాలా? లేదా ఆ సామాజిక వర్గానికి చెందిన మరో వ్యక్తికి ఇచ్చి ఎంఎల్‌సిగా అవకాశం కల్పించాలా అనే చర్చ పైస్థాయిలో జరుగుతుంది.జిహెచ్ఎంసి పరిధిలో ఎవరైనా పార్టీ మారే ఎంఎల్ఏలకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం లేకపోలేదు. నిజామాబాద్, ఆది

రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

లాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో చాలా మంది సీనియర్లు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మదన్ మోహన్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వినోద్, బాలూనాయక్, వేముల వీరేశం, తదితరుల పేర్లు మంత్రి పదవి రేసులో వినిపిస్తున్నాయి.

### కేంద్రంలో వచ్చే ప్రభుత్వం ఆధారంగా నిర్ణయం

కేవలం రాష్ట్రంలో లోక్‌సభ ఫలితాలే కాకుండా జాతీయ స్థాయిలో ఫలితాలు కూడా మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఒకవేళ 'ఇండియా' కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చినట్లయితే నాలుగు కేంద్ర మంత్రి పదవులను రాష్ట్రానికి ఇవ్వాలని పట్టుబట్టే అవకాశం కనిపిస్తుంది. అందులో ఇప్పటికే ఇద్దరికి ఎన్నికల్లో గెలిస్తే మంత్రి పదవి ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రచార సభల్లో ప్రకటించారు. వారు కాక ఒక ఎస్‌సి, ఒక ఎస్‌టి వర్గానికి చెందిన వారికి కూడా మంత్రివర్గంలో చోటు కల్పించేందుకు ప్రయత్నం ఉండొచ్చు. దీని ఆధారంగా రాష్ట్ర మంత్రి వర్గంలో మార్పులకు కూడా ఆస్కారం ఉంటుంది. అలాగే శాసనసభలో ఛీఫ్ విప్ పదవి, డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఖాళీగా ఉన్నాయి. వీటన్నిటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ముఖ్యమంత్రి ఇప్పుడే మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ చేయకపోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పూర్తి చేసి, నూతన పిసిసి అధ్యక్షుడి నియామకంతో పాటు, సామాజిక సమీకరణల ఆధారంగా మంత్రి మండలిని పునర్నిర్మించ వచ్చనే వాదన కూడా వినిపిస్తున్నది.

### ఫలితాలు రాగానే పదవుల పందేరం

లోక్‌సభ ఫలితాలు వెలువడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగానే నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు అంతర్గత కసరత్తు కూడా జరిగింది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూలుకు ఒకరోజు ముందు పిసిసి అనుబంధ సంఘాల నాయకులు, ఎన్నికల్లో పని చేసిన నాయకులు కొందరికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు కట్టబెట్టారు. ఇక మిగిలిన కార్పొరేషన్ పదవులను, ఇతరత్ర నామినేటెడ్ పదవులను కూడా త్వరలోనే భర్తీచేయనున్నట్లు కాంగ్రెస్‌లోని ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి. ఈసారి ఇందిరమ్మ కమిటీలు వేసి, గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలను ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగస్వాములను చేసే ప్రక్రియను కూడా ఇప్పటికే తీవ్రంగా పరిశీలిస్తున్నారు. ఇది ఏపిలో వలంటీర్ వ్యవస్థ తరహాలో ఉంటుంది. కాకపోతే కొన్ని మార్పులతో ఉండే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు వీటి నియామకాలు చేయడం ద్వారా గ్రామాలలో కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసే వాతావరణం అధికార పార్టీకి కలిసొస్తుందని భావిస్తున్నారు. ఎందుకుంటే లోక్‌సభ ఎన్నికలకు ముందు కింది స్థాయి కార్యకర్తలలో పదేళ్ళ తరువాత తమ ప్రభుత్వం వచ్చినా తమకు ఏమి జరగలేదనే భావన ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు నివేదికలు ఇచ్చినట్లు తెలిసింది. దానికి అనుగుణంగా చర్యలకు కాంగ్రెస్ ఇప్పటికే సిద్ధమైనట్లు ఆ పార్టీలో కీలక వర్గాల సమాచారం.

# మోదీ 'దోఖా దేనేకీ' గ్యారంటీ



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

వివిధ కులాలు, మతాలు, విభిన్న సంస్కృతులలకు నెలవైనది మన దేశం . దానికి అనుగుణంగా దేశ రాజ్యాంగాన్ని రూపొందించుకోవడం జరిగింది. దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాలను పాటిస్తూ దేశ సమగ్రతను కాపాడాలి. కానీ, దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇటు భారతదేశంలో అటు భారతీయ జనతాపార్టీ అంతర్గతంగా ప్రజాస్వామ్యం పూర్తిగా లోపించి, వ్యక్తి ఆరాధాన జరుగుతున్నది. అందుకు నిదర్శనం భారతీయ జనతా పార్టీ పథకాలకు ''మోదీ కీ గ్యారెంటీ'' అని పేరు పెట్టడం. వ్యక్తి పూజ పెరగడంతో మోదీకి ఒక విధమైన నియంత లక్షణాలు పెరిగిపోయినాయి. అందుకు నిదర్శనమే ఈ మధ్య రాజస్థాన్లో ఒక బహిరంగసభలో మోది చేసిన ప్రసంగం. ఆ ప్రసంగం పూర్తిగా ఆయన మనువాద లక్షణాలను బయటపెట్టింది. అది పూర్తిగా దేశ లౌకిక వ్యవస్థకే ప్రమాదం. భారత రాజ్యాంగం ఈ దేశం అత్యున్నత మార్గదర్శి. అది దేశ పౌరులకు హక్కులు కల్పించడమే కాకుండా కొన్ని విధులు, బాధ్యతలను కూడా నిర్దేశించింది. ఆర్టికల్ 14 నుండి 18 వరకు సమానత్వ హక్కు రాజ్యాంగం కల్పించినది. కాని పది సంవత్సరాల కాలంలో ప్రధానమంత్రిగా పని చేసిన నరేంద్రమోదీ చేసిన ప్రసంగం అన్ని కులాలను, మతాలను ఒకే విధంగా చూడాలన్న భావనతో లేనట్లుగా ఉన్నది. ప్రతి ఎన్నికల సమయంలో ఏదో ఒక రకమైన వివాదం సృష్టించి ప్రజల దృష్టి మరల్చి తద్వారా లాభం పొందడం మోదీ, ఆయన టీమ్కు అలవాటైనది. కాంగ్రెస్ పాలన వస్తే హిందువుల సంపదను పూర్తిగా ముస్లింకు సర్వం దోచి పెడుతారని చెప్పడం, మహిళల మంగళసూత్రాలు లాక్కొని వారికి ఇస్తారని పూర్తిగా రెచ్చగొట్టె వ్యాఖ్యగా భావించవలసి వస్తున్నది. గత పది సంవత్సరముల వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చడానికి మోదీ అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడు గతంలో చాలా హామీలు ఇచ్చాడు. ఉదాహరణకు 2017 సంవత్సరంలో ఆయన 2022 వరకు రైతులకు వారి ఆదాయం రెండింతలు చేస్తానని చెప్పి చేయకపోవడం, ఉద్యోగాల కల్పన విషయంలో వైఫల్యం, హార్ ఘర్ ఖా నల్ పథకంలో వైఫల్యం, మత్స్యసంపద యోజన పథకంలో వైఫల్యం, భారత ఆత్మ నిర్భర పథకం క్రింద పప్పు దినుసుల పథకంలో వైఫల్యం, ఆయుష్మాన్ భావ పథకంలో అవకతవకలు, పెట్రోల్, డిజీల్, వంటగ్యాస్ ధరలు సామాన్యుడికి అందకుండా పోవడంతో పాటు గత పది సంవత్సరాలలో జరిగిన అవినీతి అందుకు నిదర్శనము. దేశంలో ఎన్నికల బాండ్ల క్రింద మొత్తం 16,518 కోట్ల రూపాయలు బాండ్ల క్రింద జమ కాగా అందులో సగం 8252 కోట్ల రూపాయలు కేవలం భారతీయ జనతా పార్టీకి రావడమంటే అది పెద్ద కంపెనీలకు లాభం చేసి వారి లాభపడటం కాదా? ఈ ఎన్నికల బాండ్ల స్కీం 2018 సంవత్సరం నుండి అమలులోనికి బిజెపి ప్రభుత్వం తీసుకరావడం జరిగింది. రాజకీయ పార్టీలకు నిధి వసూలు పేరుతో ఈ పథకం తీసుకువచ్చి అధికారికంగా మోదీ పరోక్ష అవినీతి గేట్లెత్తారు. ప్రజలందరూ వివేకవంతంగా ఆలోచించి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలి. లేకుండా వ్యక్తి ఆరాదన పెరిగిపోయి రాబోవు రోజులలో నియంత పాలన వైపు అడుగులు పడటం జరుగుతుంది. తస్మాత్ జాగ్రత్త.

## మల్లన్నకు భారీ మెజారిటీ ఇస్తాం



శాసన సభ్యులు మందుల సామేల్

**ప్రజాపక్షం/తిరుమలగిరి :** తుంగతుర్తి నియోజకవర్గం నుండి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు భారీ మెజార్టీ ఇస్తామని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 16వేల పట్టభద్రుల ఓట్లు ఉండగా అధికశాతం ఓట్లు తీన్మార్ మల్లన్నకు పడేలా మండల పార్టీ అధ్యక్షులు, గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగియగానే దశలవారిగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు వై నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్ నాయక్, ఎన్ఎస్ఐయూ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ళు త్వరగా పూర్తి చేయాలి



కలెక్టర్ హనుమంతు జండగే

**ప్రజాపక్షం/మోటకొండూరు :** ముందస్తు ఆకస్మిక వర్షాలు పడుతున్న నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హన్మంతు కె జండగే అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలో శనివారం ఆయన ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాలని సందర్శించారు. నాంచారి పేట, మోటకొండూరులలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసారు. మండల కేంద్రంలో వరి ధాన్యం నిల్వలు చాలా ఉన్నాయని, వాటిని త్వరగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శాంతిలాల్, ఆర్ఐ నరేష్, ఎఈఒ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇసి అనుమతితో బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలి




**ప్రజాపక్షం/ సూర్యాపేట టౌన్ :** రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈసి అనుమతి తీసుకోని వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో టిపియుఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు గత ఆరు సంవత్సరాలుగా బదిలీలు నిర్వహించకపోవడంతో మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 8 సంవత్సరాలుగా పదోన్నతులు లేకపోవడంతో అనేక పాఠశాలల్ సబ్జెక్ట్ టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికుల కొరతతో పాటు బాల బాలికలకు మూత్రశాలలు, తాగు నీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెల్లకొండ రామమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్, బ్రహ్మచారి, వెంకట్ రెడ్డి, తిరుమలేష్, సాయి కుమార్, పూలసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

టియుడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** జూన్ 19, 20న ఖమ్మంలో నిర్వహించే టియుడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా ఇంచార్జి కన్వీనర్ నగునూరి శేఖర్ పిలుపునిచ్చారు. చిగురుమామిడి టియుడబ్ల్యూజే (ఐజెయు) మండల అడహక్ నూతన కమిటీ ఎన్నిక సంధర్భంగా నగునూరు శేఖర్‌ను జర్నలిస్టులు,కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సంధర్బంగా నగునూరు శేఖర్ మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ టియుడబ్ల్యూజే (ఐజెయు) దేశంలోనే అతిపెద్ద పాత్రికేయ సంఘమన్నారు. జర్నలిస్టుల అక్రిడియేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, నివేషణ స్థలాల కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. త్వరలోనే రాష్ట్ర నూతన కమిటీ అనంతరం జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జేరిపోతుల వెంకటస్వామి, మార్త ప్రకాష్, ఎండీ రఫీ, అడహక్ మండల కమిటీ కన్వీనర్ పత్తెం రమేష్ పటేల్, సభ్యులు బొల్లమల్ల రాజమౌళి, శేషం నరసింహాచార్యులు, జేరిపోతుల సదానందం, పత్తెం శ్రీనివాస్, ముడికె కనకయ్య, ఎనగందుల అశోక్, బుల్లి రంజిత్, బండారి అజయ్య, గడ్డం అనిల్ కుమార్‌తో పాటు పాత్రికేయ సభ్యులున్నారు.

# వాతావరణ పరిరక్షణ కోసం కృషి

ఇరిగేషన్ శాఖ మంత్రి
ఉత్తంకుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** క్లీన్ ఎనర్జీ, వాతావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అన్నారు. కర్బన ఉద్గారాలను 2070 నాటికి పూర్తి స్థాయిలో తగ్గించాలని కేంద్రం ఆదేశించిందని, దీనిని అన్ని రాష్ట్రాలు పాటించాలని కోరిందని, ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణ పెరుగడం వల్ల భూ తాపం పెరుగుతోందన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్, సిటిజన్ కన్స్యూమర్ అండ్ సివిక్ యాక్షన్ గ్రూప్, పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ ఇన్ ఇండియా , ఫోకస్ ఆన్ తెలంగాణ అన్న అంశంపై శనివారం హోటల్ హరిత ప్లాజాలో ఒక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో చాలా మార్పులు జరిగాయని, కొన్ని సార్లు అంచనాలకు అందుకుండా మార్పులు జరుగుతున్నాయన్నారు. పంటల మార్పిడి కూడా జరిగిందని అంటూ వాతావరణ మార్పులు రాకుండా భూమిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్లీన్ ఎనర్జీ కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు ఇవ్వడానికి కట్టుబడి ఉందన్నారు. అదే సమయంలో సోలార్, విండ్, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ రంగానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్లీన్ ఎనర్జీ, వాతావరణ పరిరక్షణ కోసం మేధావులు, పర్యావరణ వేత్తలు కలిసి డాక్యుమెంట్ రూపంలో తమకు ఇస్తే ప్రభుత్వం ద్వారా కచ్చితంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం విద్యుత్ నిపుణులు వేణుగోపాల్ రావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు వినియోగం తగ్గించాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పూర్తి స్థాయిలో గత పాలకులు బయటి రాష్ట్రాల నుండి కొనుగోలు చేసుకున్నారని, ప్రస్తుత పాలకులు అయినా దీని నుండి బయట పడ్డాలని సూచించారు. కేవలం థర్మల్ విద్యుత్ కొనుగోలు కోసమే లక్షన్నర కోట్లు వ్యయం చేస్తున్నారని ఇది ప్రజా ధనాన్ని వ్యయం చేయడంగానే తాము భావిస్తున్నామన్నారు. పర్యావరణ వేత్త దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ రంగంలో తీసుకుంటున్న చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వ్యవసాయం, బొగ్గు వినియోగం, పారిశ్రామికీకరణ, వంటి అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికైనా శిలాజ ఇంధనాలను తగ్గించుకుంటూ ప్రత్యామ్నాయ ఇంధనాలను వాడుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. మరో పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్, ట్యాంక్ బండ్‌ను పరిశుభ్రంగా ఉంచుతామన్న గత పాలకులు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉంచారో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సందర్శించే పర్యటకులు కనీసం కొన్ని నిమిషాలు అయినా స్వేచ్ఛగా అక్కడ నిలుచుని అందాలను వీక్షించుకునేలా చేయాలని కోరారు.

## లొంగిపోయిన 33 మంది మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో శనివారం పోలీసులు ఎదుట 33 మంది మావోయిస్టులు లొంగిపోయారు. గత నాలుగు మాసాలుగా చోటు చేసుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు లొంగుబాట పట్టారు. తాజాగా లొంగిపోయిన వారిలో ఇద్దరు ముఖ్యనేతలు ఉన్నట్లు, వారిపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది. చోటుచేసుకున్న అనేక ఎన్‌కౌంటర్లలో పై సాధిస్తున్న బలగాలు సుమారు 90 మంది మావోయిస్టులకు పైగా మట్టుపెట్టారు. దీంతో మావోయిస్టు పార్టీలో అంతర్మథనం చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దండకారణ్యంలో సమాంతర పాలన సాగించిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు క్రమక్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఆ రాష్ట్రంలో బిజెపి అధికారంలోనికి రావడంతో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్లు సఫలీకృతం అవుతున్నాయి. తాజాగా ఆపరేషన్ కగర్ పేరుతో సాగుతున్న యుద్ధంలో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఆకురాలే కాలంలో దూకుడు పెంచిన భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతూ అధునాత ఆయుధాలతో మావోయిస్టులపై విరుచుకు పడుతున్నారు. ఇదిలా ఉండగా గత రెండు నెలల క్రితం మావోయిస్టు దాడుల వ్యూహకర్త హిడ్మా స్వగ్రామంలో సైతం కేంద్ర ప్రభుత్వం అధునాతన బేస్ క్యాంపును ఏర్పాటు చేసిన హిడ్మా ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. మరో ప్రక్క ఆయన స్థావరాలను పూర్తిగా తెలుసుకున్న పోలీసులు గట్టినిఘా పెంచారు. గత నాలుగు మాసాల కాలం మావోయిస్టు పార్టీకి కలిసిరాలేదని చెప్పవచ్చు. ఇప్పటి వరరు సేఫ్‌జోన్‌గా ఉన్న అబూజ్‌మడ్ ఇప్పుడు క్రమంగా వారి చే జారిపోతుండటంతో తీవ్ర ఆలోచనలో మావోయిస్టు పార్టీ పడినట్లు తెలుస్తోంది. దీంతో గత ఏడాది క్రితమే ఛత్తీస్‌గఢ్ అడువుల నుండి మహారాష్ట్ర సరిహద్దుల్లో గల ఇంద్రావతి నదీ సమీపంలోని అమర్‌కంతక్‌ను మావోయిస్టులు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ లేకుండా చేసేందుకు కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వ భద్రతా బలగాలు చేస్తున్న కృషి సత్ఫలితాలు చేస్తున్న కృషి సత్ఫలతాలు ఇస్తున్న నేపథ్యంలో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు మరింత దూకుడు పెంచుతున్నాయి.

## కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు క్యాజువల్ సెలవులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులకు ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ ప్రకారం పోలింగ్ రోజు ప్రైవేట్ సంస్థలకు సెలవు ఇచ్చే అవకాశం లేకపోవడంతో డ్యూటీ షిఫ్టులలో మార్పులు చేయాలన్నారు.

## మండలిలో సబ్బండ వర్గాలకు మల్లన్న అండ

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి
పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలోని మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలిపించడం వల్ల విద్యావంతులు, నిరుద్యోగులు, ప్రజల పక్షానే కాకుండా తెలంగాణలోని సబ్బండ వర్గాల ప్రజల పక్షాన ప్రశ్నించడానికి పట్టభద్రులంతా తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ గత పదేళ్లుగా ప్రశ్నించే గొంతుకలను, ప్రజాసంఘాలను అణిచివేసే ధోరణిని అవలంభించిందని అయినా తీన్మార్ మల్లన్న తన యుట్యూబ్ ఛానెల్ ద్వారా నిరంతరం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలను మరో వైపు అణిచివేత, దోపిడి, మోసానికి గురవుతున్న ప్రజల పక్షాన ఉండి తన గళాన్ని విప్పారని గుర్తు చేశారు. ఏనాడూ అధికార పార్టీ చూపిన ఆశలకు, బెదిరింపులకు తలొగ్గకుండా అదే తీరులో ప్రతిపక్షాలను సైతం ప్రజల పక్షాన పోరాడాలని చైతన్యం చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అన్నారు. పట్టభద్రులంతా ఒక సారి ఆలోచించి అవకాశ పదవుల ఆశపై ఉన్న పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి పార్టీలు తీన్మార్ మల్లన్నపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మకుండా ప్రశ్నించే గొంతుక, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి, గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలును ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నికార్సైన జర్నలిస్టుగా పేరుందిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## నిలిపివేసిన రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ నగరంలో చాలా ప్రాంతాల్లో పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న అంతర్గత రహదారులను వెంటనే ప్రారంభించాని పైడిపల్లి రాజు అధికారులను ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేషన్ పరిధిలోని పదవ డివిజన్‌లో గల తిరుమల్ నగర్ రోడ్డు పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం కావస్తోందని, పనులను మధ్యలోనే నిలిపివేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు వేస్తామని చెప్పి మంచిగా ఉన్న రహదారిని తవ్వేశారని, ఈ తవ్వడం వల్ల కంకరదేలి వాహనాలపై వెళ్తున్న వారు స్కిడ్ అయి పడడంతో గాయాలై ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చి స్కూల్ ప్రారంభమైతే చాలా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నగరపాలక సంస్థ మేయర్, కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారులు రోడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంపై ఎందుకు స్పందించడం లేదని ఆక్రోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులకు ఓట్ల సమయంలో ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులు కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని లేని పక్షంలో పదవ డివిజన్ ప్రజలతో కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

## హామీలు అమలు చేయించేందుకే పోటీ చేస్తున్నాం



బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక బిజెపి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో బిజెపి అధికారం కోసం పోటీ చేయడం లేదని, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయించేందుకే పోటీ చేస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగుల కోసం బిజెపి పోరాడితే తనపై 105 కేసులు పెట్టి 12 సార్లు జైలుకు పంపించడమే కాకుండా మూడు సార్లు తనను చంపాలని చూసిందన్నారు. ఐదేళ్లపాటు తన కుటుంబానికి దూరమయ్యాయని చెప్పారు. ఇంటర్, ఎస్ఎస్‌సి తో పాటు ఉద్యోగాల నోటిఫికేషన్ నుంచి పేపర్ లీకేజీలు చేసిన బిఆర్ఎస్‌ను ఓడించేందుకు బిజెపి ఎన్నో పోరాటాలు చేసిందని, తాము చేసిన పోరాటాలతోనే కెసిఆర్ ప్రభుత్వం గద్దె దిగిందన్నారు. ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ మేధావుల చేతుల్లో ఉందని, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎంఎల్‌సి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే శాసన మండలిలో నిరుద్యోగ పక్షాన కొట్లాడుతారని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, ఎంఎల్‌సి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, మాదగోని శ్రీనివాస్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు యాదవ్, గోలి అమరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

**ప్రజాపక్షం/శాలిగౌరారం :** పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించి శాలిగౌరారం మండల పరిధిలోని గురజాల గ్రామం వద్ద నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శ్రవణ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలం, చిర్రగూడూరు గ్రామానికి చెందిన ఖమ్మం పాటి సోమన్న 20 కిలోల నకిలీ విడి పత్తి విత్తనాలను తీసుకువెళ్తుండగా పక్క సమాచారంతో పోలీసులు గురజాల గ్రామ శివారులో సోమన్నను పట్టుకొని విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు వారి పరిధిలోని గ్రామాలలో పత్తి, వరి విత్తనాలపై రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు తెలియజేస్తున్నారని, అదేవిధంగా మండల వ్యవసాయ అధికారులు మండలంలోని విత్తన విక్రయ డీలర్ల షాపులను విస్తృతంగా తనిఖీ చేసి వారి వద్ద నకిలీ విత్తనాలు గుర్తించినట్లయితే వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి సర్కారు కృషి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మహిళల ఆర్థిక అభివృద్ధికి సర్కారు ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అందుకోసమే మహిళా సంఘాలకు యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. శనివారం కరీంనగర్‌లోని భాగ్యనగర్, సరస్వతి నగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సంధర్భంగా స్కూల్ యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియను పరిశీలించారు. యూనిఫామ్స్ తయారీపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దారం కట్ కాకుండా డబుల్ స్టిచ్చింగ్ చేసి ఏడాది పాటు ఉండేలా యూనిఫామ్స్ తయారు చేయాలని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధతో డ్రెస్సులను కుట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధతో డ్రెస్సులను కుట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్కూల్ పిల్లలకు అవసరమయ్యే జ్యూట్ బ్యాగులను తయారు చేయాలని సూచించారు. ఇందుకు తయారు చేసే విధానంపై స్వయంగా కలెక్టర్ నిర్వాహకులకు వివరించారు. జ్యూట్ బ్యాగులు పిల్లలు కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అత్యుత్తమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే పాఠశాలల్లో మరమ్మత్తు పనులు చేపట్టామని చెప్పారు. విద్యార్థులు కొత్త వాతావరణంలో అడుగుపెట్టేలా పాఠశాలలను రూపుదిద్దుతున్నామని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభం రాగానే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి మెప్మా పిడి స్వరూపారాణి, డీఎంసి శ్రీవాణి, టీఎంసి అనిత, సిఓలు, పాల్గొన్నారు.

## పట్టభద్రుల పోలింగ్ ఏర్పాట్లపై సమీక్ష

సిబ్బందికి ఎన్నికల అధికారి
హరి చందంన సూచనలు



**ప్రజాపక్షం /నల్లగొండ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి దాసరి హరి చందంన అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుండి ఎంఎల్‌సి ఎన్నికలు జరగనున్న 12 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మెటీరియల్ సరఫరా, బ్యాలెట్ బాక్సుల సీలింగ్ ,వాటిని తిరిగి రిసెప్షన్ కేంద్రాల తేవడంలో పాటించాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. బ్యాలెట్ బాక్సులు సీల్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే స్టిక్కర్లు, ఏజెంట్ల సంతకాలు వంటి అన్నింటిపై వివరంగా తెలియజేశారు ప్రతీ పోలింగ్ కేంద్రానికి 50 మంది ఓటర్లకు ఒక వైలెట్ కలర్ స్కెచ్ పెన్ ఇవ్వడం జరుగుతుందని, దాని ద్వారానే ఓటరు ఓటు వేసేలా చూడాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లను క్లోజ్ కంటైనర్ లో మాత్రమే నల్గొండకు పంపించాలని కోరారు. ప్రిసైడింగ్ అధికారి డైరీ, ఫారం 16 లను పరిశీలించేందుకు అన్ని జిల్లాలలో సరిపోయినన్ని బృందాలను ఏర్పాటు చేయాలని ,పిఓ డైరీ పూర్తిగా కరెక్టుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రిసెప్షన్ సెంటర్లో అప్పగించాల్సిన డాక్యుమెంట్లు అన్ని పూర్తిగా అందించేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బందికి వసతులు, వారి సంక్షేమంపై దృష్టి సారించాలని అన్నారు.ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సమయానికి 48 గంటల ముందు ప్రచారం చేయకూడదనే విషయాన్ని, అలాగే 144 సెక్షన్ విధింపు,ఉందన్నారు వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, డీఆర్ఓ డి. రాజ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా స్థాయి అధికారులు ఉన్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు అరెస్ట్



**ప్రజాపక్షం/ మంచిర్యాల క్రైం :** మంచిర్యాల జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిందితుల వద్ద నుండి రూ. 9, 22, 000 విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ. 60 వేలు విలువ చేసే వెండి, ఒక ఎల్ఇడి టివి, హోం థియేటర్, 3 సెల్ ఫోన్లు, మోటార్ సైకిల్, గిటార్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిలో మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన పాగిడి కార్తీక్, గన్నారం మధుకర్, మంచిర్యాల పట్టణానికి చెందిన తాడికొండ స్వామి, బెల్లంపల్లి మండలంలోనిలక్ష్మి పురంకు చెందిన పుప్పాల రాహుల్, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన కుర్సింగ ఈశ్వర్, మడావి రాము, వెద్మ ప్రవీణ్‌లు ఉన్నారన్నారు. నింధితులు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడ్డారని, జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నింధితులపై ఇప్పటికే రెండు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని అన్నారు. నింధితులను కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా సిపి అభినందించారు.

## రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/మంథని:** మంథని మండలం సిరిపురం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. మంథని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ప్రజా పంపిణీ బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయ్ అధికారులు సిరిపురం గ్రామంలో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 35క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని, రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి చెందిన రంజిత్ అనే వ్యక్తి సిరిపురం గ్రామ రేషన్ డీలర్ నుంచి తక్కువ రేటుకు బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు తేలిందని, సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు అక్రమంగా రేషన్ బియ్యం రవాణాచేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## విత్తనాలు కొనేముందు రైతులు జాగ్రత్తలు పాటించాలి



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** వర్షాకాల పంటల కోసం రైతులు విత్తనాలు కొనేముందు తగు జాగ్రత్తలు పాటించాలని కోరుట్ల ఏడిఈ లావణ్య అన్నారు. ఈ మేరకు రాఘవపేట, ముత్యంపేట, దాంరాజుపల్లి, కుస్తాపూర్, రేగుంట, సాతారం, గుండంపల్లి, సంగెం గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాలలో మాత్రమే విత్తనలు కొనుగోలు చేయాలని, దుకాణదారుల నుండి రసీదులను తప్పకుండా తీసుకుని పంట చేతికి వచ్చే వరకు భద్రపరచుకోవాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేట్లపై తేదిలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని అన్నారు. లైసెన్స్ లేని షాపులు కాకుండా ప్రయివేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసయ విస్తరణ అధికారులు గజానంద్, సంధ్య, సాయి ప్రియ, నవిత, అనిల్, రైతులు సంతోష్, సిద్దయ్య, రవి, ప్రవీణ్, గంగారాం, గంగు, నర్సయ్య, రమ తదితరులు ఉన్నారు.

## కోర్సిని గ్రామంలో వ్యక్తి దారుణహత్య



**ప్రజాపక్షం / చింతలమానేపల్లి :** చింతలమానేపల్లి మండలం కోర్సిని గ్రామంలో బొట్టుపల్లి సదయ్య (34) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు.. చింతలమానేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బొట్టుపల్లి సదయ్య స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ములకల రాజకుమార్ ఇంటికి వెళ్లడంతో వారిద్దరి మధ్య మాటల వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ముల్కల రాజ్ కుమార్ అనే వ్యక్తి బొట్టుపల్లి సదయ్యను పైపు రాడ్తో తలపై చెవిపై తీవ్రంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి బొట్టుపల్లి మల్లక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బీడీ కార్మికుల పెరిగిన కనీస వేతనాలు, యాజమాన్యాలతో చర్చలు సఫలం



**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్:** తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.వీరి వేతనాల ఒప్పంద కాలపరిమితి 2024 ఏప్రిల్ 30వ తేదీతో ముగిసిపోయింది కొత్త వేతన ఒప్పందం 2024 మే ఒకటో తేదీ నుండి అమలు కావలసి ఉంది బీడీ కార్మికుల వేతన ఒప్పందం జరగాలని బీడీ యజమానుల సంఘం బీడీ కార్మిక సంఘాల నాయకులతో శనివారం రోజున హైదరాబాదులో గల గ్రాండ్ మినర్ హోటల్లో చర్చలు సుదీర్ఘంగా జరిగి సఫలమైనవని తెలియజేస్తున్నాం బీడీ కార్మికులకు 1000 బీడీలకు రూ.425 పైసలు,బీడీ ప్యాకర్స్‌కు నెలకు రూ.3650, బీడీ చాలర్స్ వాచ్మెన్ గంపవాల బట్టి వాళ్లకు నెలకు రూ.1700, పెంచుతున్నట్టు ఇరువర్గాలు ఒప్పందం కుదర్చుకున్నాయి. దీనివలన బీడీ పరిశ్రమలు తలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మందికి అమలు అవుతాయని ఇది కార్మికుల పోరాట విజయమని తెలియజేస్తున్నాం. ఈ చర్చలతో బీడీ యజమానుల సంఘం అధ్యక్ష కార్యదర్శి లు ఉపాధ్యాయ గాంధీ రశ్మికాంత్ పటేల్ రమన్ భాయ్ ప్రభాకర్ యూనియన్ నుండి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వనమాలీ కృష్ణ నరేందర్ కే రాజన్న సిఐటియు నాయకులు రమ బిఎంఎస్ నాయకులు కళాల్ శ్రీనివాస్ టీఆర్ఎస్ కె.వి.మంచి నర్సింహులు హెచ్ ఎం.ఎస్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై పిడి చట్టం

తరచూ రైతులను మోసగించినట్లు కేసులు నమోదైతే అణచివేత: జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్




**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** నకిలీ విత్తనాల మూలంగా వ్యవసాయ రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనాలనే అందించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో వినయ్ గార్డెన్‌లో నకిలీవిత్తనాలు, ఎరువుల విక్రయాలపై డీలర్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి సురేష్ కుమార్, ఇంఛార్జి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి క్రిష్ణారెడ్డి, కాగజనగర్ ఆర్‌డిఒ సురేష్ తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ నకిలీ, కాలంచెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగుమందులు అమ్మితే సహించేది లేదని, పిడి యాక్ట్ నమోదుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ,కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, విత్తన కార్పొరేషన్, పోలీసు బలగాలతో జాయింట్ టాస్క్ ఫోర్స్ బృందాలను జిల్లా పరిధిలో గల కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్లలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసిన, దుకాణాలలో, ఏజెంట్లు,మధ్యవర్తుల ముసుగులో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించిన తీవ్రమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా నకిలీ విత్తనాల విక్రయాలలో గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా వుంటుందన్నారు. తరచూ కేసులు నమోదైతే పిడి యాక్ట్ అమలు చేస్తామని అన్నారు. ప్రధానంగా గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. అదే విధంగా ఏ ప్రాంతంలోనైనా కచ్చితమైన కంపెనీ పేరు, బిల్లులు లేకుండా విడిగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానీ, మండల వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదు అని రైతు బాగుంటేనే దేశం బాగుంటదని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాలు జిల్లా పరిధిలోని విత్తన ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నకిలీ విత్తనాల సమస్యలను నియంత్రించేందుకు ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమాచారం వ్యవస్థను పటిష్టం చేసినట్లు తెలిపారు. దీనికి తోడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి దుకాణాదారు నుంచి రశీదు తీసుకోవాలన్నారు. నగరాల్లో, మండలాల్లో టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలియజేసారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ప్రతి షాపు ముందు ఎరువులు, విత్తనాల ధరల పట్టిక వివరాలను ఉంచాలని, డీలర్ షాప్ లైసెన్స్ వివరాలను ప్రదర్శించాలని చెప్పారు. ఈ సమావేశంలో కాగజ్ నగర్ డిఎస్‌పి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణాధికారులు, కాగజ్ నగర్ డివిజన్ పరిధిలో గల సిఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది, రెవిన్యూ శాఖ అధికారులు, డీలర్లు, ఫెర్టిలైజర్ షాప్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను గాలికి వదిలేసి... విదేశాల్లో సేద తీరుతున్న చెన్నూరు ఎమ్మెల్యే

బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు



**ప్రజాపక్షం / చెన్నూర్ :** ప్రజలు నమ్మి ఓటు వేస్తే వారి కష్టలను పట్టించుకోకుండా నియోజకవర్గ ప్రజల సమస్యలను గాలికి వదిలి చెన్నూరు ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి విదేశాల్లో సేద తీరుతున్నారని చెన్నూరు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ మండిపడ్డారు. శనివారం చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలం బబ్బెరచిలక, దేవులవాడ, పరుపెల్లి, అలగామ్ గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గం, కోటపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల నుండి వడ్లను తరలించడంలో జాప్యం జరుగుతుందని, మళ్ళీ వర్షం పడితే రైతులు మరింత నష్టపోతారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చెన్నూర్ నియోజకవర్గ ఎంఎల్ఏ బాల్క సుమన్ తండ్రి ఆసుపత్రిలో వెంటిలేటర్ పై ఉన్నకూడా రైతుల, నియోజకవర్గ ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి సకాలంలో వడ్లు కొనుగోలు కేంద్రాల నుండి తరలించి రైతులకు న్యాయం చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో స్థానిక ఎంఎల్ఏ వివేక్ వెంకటస్వామి అకాల వర్షంతో నష్టపోయిన రైతులను పరామర్శించే సమయం లేకుండా పోయిందని, నియోజకవర్గానికి వచ్చి రైతులకి న్యాయం చేసే ఆలోచన కూడా చేయడం లేదని, ఎంఎల్ఏకు ప్రజల కన్న పదవులు, జల్సాలే ముఖ్యం అని ఆరోపించారు. రైతులకు అండగా బిఆర్ఎస్ ఉంటుందని, రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ సాంబ గౌడ్, మాజీ సర్పంచ్ గోనె సత్యనారాయణ రావు, మండల యూత్ అధ్యక్షులు మారిశెట్టి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు అసంపల్లి సంపత్ కుమార్, నాయకులు సందీప్ రెడ్డి, దుర్గ మల్లయ్య, బాపు, అనిల్ గడ్డి, శంకర్,మధుకర్, యోగానంద్, చకినారపు అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యం.. ఆపేదెవరు?



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని వైన్ షాప్ అమ్మకందారులు ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా మద్యం కల్తీ చేస్తూ.. మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు లోబడి మద్యం దుకాణాల టెండర్లు దక్కించుకున్న వ్యక్తులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు ఆశ చూపి నకిలీ మద్యం తయారీదారులు దుకాణాలను సొంతం చేసుకుంటున్నారు. ఆ రకంగా వైన్ షాపులను దక్కించుకొని విచ్చలవిడిగా ప్రభుత్వమందిస్తున్న నాణ్యమైన మధ్యాన్ని డబ్బుల కోసం కల్తీ చేస్తూ మద్యం ప్రియుల జీవితాలను రోగాల పాలు చేస్తున్నారు. పేద, మధ్యతరగతికి చెందిన అనేక మంది రోజంతా శ్రమించి కష్టపడి సంపాదించిన సొమ్ములో తనను నమ్ముకున్న కుటుంబానికి ఎంత కేటాయిస్తున్నారో తెలియదు గానీ, దినమంతా పడిన కష్టాన్ని, బాధలను మరిచిపోవడానికో లేదా, మరేదో కారణం తోనో కాస్త ఊరట కొరకు వైన్ షాపులను ఆశ్రయిస్తున్నారు. తీరా ఇష్టమైన బ్రాండ్ ను నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేసినప్పటికీ లేబుల్ కలిగిన సీసా ఉంటుందే తప్ప దానిలో మాత్రం కల్తీ మద్యం ఉండడాన్ని చూస్తూ నిరాశ చెందుతున్నారు. అసహనానికి లోనై కొనుగోలు చేసిన కష్టమర్లు నాణ్యమైన మద్యం లేదా డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రశ్నిస్తే, వైన్ షాప్ సిబ్బంది మూకుమ్మడిగా దబాయిస్తూ.. డబ్బులు తిరిగి ఇవ్వం ఎక్కడైనా చెప్పుకో అని నిర్లక్ష్యపు సమాధానాలు చెపుతున్న సంఘటనలు లేకపోలేదు. జరుగుతున్న అనేక సంఘటనలకు స్పందించి సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు కల్తీ మద్యం అమ్ముతున్న వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలని, ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మద్యం ప్రియులకు ఎంఆర్‌పి ధరలకు నాణ్యమైన మద్యాన్ని కల్తీ లేకుండా అందించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## లంకె బిందెల పేరిట...లక్షలు దోచారు

మాయమాటలు నమ్మడంతో 30లక్షలు హాంఫట్

అత్యాశకు పోయి అంతా పోగొట్టుకున్న మహిళ



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** దొంగ బాబాలను, పూజారులను, జ్యోతిష్యులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించిన వేములవాడ పట్టణ సిఐ వీర ప్రసాద్ అమ్మగారి ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని నమ్మబలికి అమాయక మహిళను మోసగించిన ముగ్గురు కేటుగాళ్ళను వేములవాడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వేములవాడ పట్టణ సిఐ వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లి కోనాయపల్లి గ్రామానికి చెందిన సింగారపు అంజవ్వ అనే మహిళ గత ఏడాదిన్నరగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ విషయాన్ని తన సమీప బంధువు ఎల్లయ్య దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో ఎల్లయ్య వేములవాడ అర్బన్ మండలంలోని చంద్రగిరిలో మహిపాల్ అనే ఒక పూజారి ఉన్నాడని, అతని దగ్గరికి వెళ్లి నాటు వైద్యం చెట్ల మందులతో కూడిన చేయించుకుంటే నీకున్న రోగం నయమవుతుందని అంజవ్వను నమ్మబలికి మహిపాల్ దగ్గరికి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో వైద్యం కొరకు నిత్యం మహిపాల్ దగ్గరికి వెళ్తూ, వస్తున్న హన్మవ్వ తనకున్న అన్ని సమస్యలతో పాటు వ్యక్తిగత విషయాలను సైతం పంచుకుంది. ఇక ఇదే అదునుగా భావించిన మహిపాల్, అంజవ్వ జాతకం చూసి తన తల్లి గారి ఇల్లైన కోనాయపల్లిలో లంకె బిందెలు ఉన్నాయని, వాటిని తవ్వితీస్తే పెద్ద ఎత్తున బంగారం లభిస్తుందని, వాటిని తవ్వి తీసేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని నమ్మబలికాడు. ఇది నిజమని నమ్మిన అంజవ్వ విడతల వారిగా మహిపాల్‌కు డబ్బులు ఇవ్వడం ప్రారంభించింది. ఇలా సుమారు 20లక్షల రూపాయల వరకు మహిపాల్‌కు అప్పజెప్పింది. ఇదే సమయంలో మహిపాల్, ఆంజవ్వల వ్యవహార శైలిని గమనించిన సుద్దాలకు చెందిన అబ్రహం అనే వ్యక్తి కొంతకాలం తర్వాత వీరువురిని సంప్రదించి లంకె బిందెల్లో నుండి తీసిన బంగారం కడిగేందుకు తాను సహకరిస్తానని చెప్పి వారితో జతకట్టాడు. అబ్రహం మాటల నమ్మిన అంజవ్వ 10లక్షల రూపాయల వరకు అప్పజెప్పింది. ఇలా మొత్తం 30లక్షల రూపాయలు ఇద్దరికి అప్పజెప్పింది. అయితే రోజులు గడుస్తున్నా మహిపాల్, అబ్రహంలు చెప్పిన విధంగా జరగకపోవడం, ఇచ్చిన డబ్బుల విషయంలో వారు ఇద్దరు స్పందించకపోవడంతో ఇక మోసపోయానని గ్రహించిన అంజవ్వ చేసేదేమీ లేక వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసింది. అంజవ్వ ఇచ్చిన పిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, ఈ క్రమంలో మహిపాల్(ఎ1), అబ్రహం (ఎ2), ఎల్ల(ఎ3)లను చాకచక్యంగా పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగ బాబాలను, పూజారులను, జ్యోతిషులను నమ్మి మోసపోవద్దు సిఐ వీర ప్రసాద్ అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని ఈ మధ్య కాలంలో కొంతమంది సాధారణ వ్యక్తులే సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బాబాలు, పూజారులు, జ్యోతిష్యం చెబుతాం అనుకుంటూ వచ్చి ప్రజలను బురిడీ కొట్టించి అక్రమ మార్గంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాంటి వారిని నమ్మి మోసపోవద్దు. మూఢ నమ్మకాలను విశ్వసించవద్దు. అసాంఘిక, చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి వారి వల్ల మోసపోయిన వారు ఇంకా ఎవరైనా ఉంటే నిర్భయంగా వచ్చి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయవచ్చు.

## పర్యావరణ రక్షణతో పచ్చటి ప్రకృతే మనందరి బాధ్యత

ఎంపిడిఒ సత్యనారాయణ



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** పర్యావరణాన్ని రక్షించుకొని పచ్చగా మార్చడం మనందరి తక్షణ బాధ్యత అని ఎంపిడిఒ సత్యనారాయణ అన్నారు. శనివారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని కార్జెపల్లి, డోర్పల్లి గ్రామంలో గల పంచాయతీ పరిధిలోని నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నర్సరీలోని ప్రతి మొక్కను రక్షించాలని, మొక్కలకు సమయానికి తగినట్టు నీటిని అందించాలని, ఎండవేడి ఎక్కువగా తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు నానబెట్టడం, నాటడం వంటి పనులు ఒక ప్రణాళిక ప్రకారం చేయాలని తెలిపారు. వానాకాలంలో మొక్కలు నాటేందుకు, అవసరమగు మొక్కలు అందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. మొక్కల సంరక్షణకు తీసుకునే జాగ్రత్తలపై నర్సరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సోలాగూడ, కొమ్ముగూడ, డోర్పల్లి, పాఠశాలలను, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించడం జరిగింది. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేసి ఈ విద్యా సంవత్సరం అన్ని వసతులతో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇజిఎస్ విలాస్, ఎస్ఒ కిషన్ ఫాహిం భాను తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ చేసి నిండు ప్రాణాన్ని కాపాడిన ఎఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సీపీఆర్ చేసి నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్ ని అభినందించిన జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ నిన్నటి రోజు సాయంత్రం హార్ట్ ఎటాక్ తో కుప్పకూలిన ఓ మహిళకు సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న గడ్డమిది శ్రీనివాస్, తండ్రి శంకర్ మరణ వార్త విని గుండె పోటుకు గురై కుప్పకూలిన సిరిసిల్ల పట్టణానికి చెందిన గాంధీ నగర్ కు చెందినా చిలగాని అనూహ్య అనే మహిళా ఇంట్లో నుండి కేకలు వినబడడంతో వెంటనే స్పందించి ఇంట్లోకి పరిగెత్తుకు వెళ్ళి ఆమెకు సీపీఆర్ చేసిన అక్కడే రోడ్డుపై ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్, ఆక్కడ ఏం జరిగిందో ఇంట్లో వాళ్ల గమనించేలోపే, అక్కడే ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించారు. ఆమెకు గుండె పోటు వచ్చినట్టు గుర్తించి వెంటనే సీపీఆర్ చేశారు. అనంతరం సమీపంలోని ఆస్పత్రికి తన సొంత వాహనంలో తరలించారు. కానిస్టేబుల్ చాకచక్యంతో ఆమె ప్రాణాలతోబయటపడ్డారు. ప్రస్తుతం ఆమెకు తారక రామారావు హాస్పటల్ లో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. సీపీఆర్ చేసి మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించిన పలువురు నెటిజన్లు హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి తక్షణం సాయపడేలా పోలీసులకు ఉన్నతాధికారులు ఇప్పించిన సీపీఆర్ శిక్షణ ఓ నిండు ప్రాణం నిలబెట్టిందనే చెప్పాలి.

## రోహిణి ఎండలు వచ్చేశాయి..!

ఎండలు ప్రచండం.భానుడి భగభగ..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** రోహిణికార్తె ఎండలు రానేవచ్చేశాయి. ఎండలు మరింతగా ప్రచండంగా మారాయి. ఈదురుగాలులు, ఎండ వేడిమి ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. జూన్ తొమ్మిది వరకు మరింతగా ఎండలు మండుతాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో తేమశాతం కూడ ఎండుకపోయి రోకలిబండలి సైతం పగిలే విధంగా ఉంటాయని ప్రాచిన శాస్త్రంలో అంటుంటారు. సూర్యుడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించే విధానాన్ని రోహిణికార్తెగా పిలుస్తాం. తీవ్రమైన ఎండ వలన, వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఎండ వేడిమికి అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని జాగ్రత్త వహించాలని మరో పదిహేను రోజుల పాటుగా పలు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకున్న వారమగుతారని అంటున్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండటం వలన మన శరీరం తొందరగా అలసిపోతామని అంటున్నారు. కాటన్ దుస్తులు ధరించాలని, రెండుసార్లు స్నానం చేయాలని తగు జాగ్రత్తలు తీసుకోవడం వలన కొంత ఉపశమనం కలుగుతుందని అంటున్నారు. మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని, వేపుడు పధార్థాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



**ప్రజాపక్షం / గొల్లపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించి, వారిలో దాగున్న ప్రతిభను గుర్తించి సామాగ్రి అందజేసి బిబికే క్రికెట్ టోర్నమెంట్ పేరిట క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించి క్రీడాకారులకు ట్రోఫీలను అందజేయడం పాత్రికేయుడైన బొమ్మన కుమార్ కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణీ కాంత కుమారీ అన్నారు. మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్నటువంటి భీమ్‌రాజ్ పల్లి బొమ్మన కుమార్(బిబికే) క్రికెట్, వాలీబాల్, మహిళలకు కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించగా శ్రీమతి కాంత కుమారీ చేతుల మీదుగా దమ్మన్నపేట, లక్ష్మిపూర్, భీమ్‌రాజ్‌పల్లి విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఎస్ఎస్‌సి లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆటపాటలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయ వృత్తిలోఉంటూ మరోవైపు క్రీడాకారులను ప్రోత్సహించి గెలుపొందిన విజేతలకు తన చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం సంతోషమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆట పాటలతో రాష్ట్ర, జాతీయ క్రీడాపోటీల్లో రాణించి, గ్రామానికి, మండలానికి, జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బార్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు తాండ్ర సురేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి కుటుంబంలో జన్మించి పాత్రికేయుడిగా మంచిపేరు సంపాదించుకుని క్రీడాకారులను ప్రోత్సాహిస్తు బహుమతులు ప్రధానం చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. అనంతరం బిబికే టోర్నమెంట్ స్పాన్సర్ బొమ్మన కుమార్‌కు క్రీడాకారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు తాండ్ర సురేందర్, మాజీ సర్పంచ్ రేవల్ల సుజాత లింగయ్య, పురంశెట్టి వెంకటేశం, తాదూరి సత్యనారాయణ, కిష్టంపేట రమేష్ రెడ్డి, పల్లెర్ల వీరేశం, కంది స్వామి, డీలర్ రాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సేఫ్టీ సమావేశం బహిష్కరణ



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని సిహెచ్‌పిలో శనివారం నిర్వహించిన సేఫ్టీ కమిటీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు గుర్తింపు సంఘం (ఎఐటియుసి) నాయకులు శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సిహెచ్‌పి డిజిఎం ఉద్దేశపూర్వకంగానే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. రక్షణ సూత్రాలను పాటించడం లేదని, రక్షణ పరమైన విషయాలను అడిగిన కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. గతంలో పర్యటనలో భాగంగా శ్రీరాంపూర్ జిఎం సిహెచ్‌పిని సందర్శించిన సందర్భంలో మహిళా కార్మిక సోదరీమణులను పని విధానాలను, పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. వారు పనులలోని సమస్యలను జిఎంకు వివరించిన విషయాలను దృష్టిలో ఉంచుకొని మహిళా కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత సేఫ్టీ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘంగా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటివరకు వాటి పరిష్కారం చేయనందువలన సేఫ్టీ కమిటీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, ఫిట్ కార్యదర్శి చల్ల తిరుపతి, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



**ప్రజాపక్షం / వడ్డేపల్లి :** లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గరనే రైతులు విత్తనాలు కొనాలని మండల వ్యవసాయ అధికారి రాధ పేర్కొన్నారు.శనివారం ఆమె వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్లు గ్రామంలో రైతులతో సమావేశం అయ్యారు.ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనే ముందు వారు లైసెన్స్ కలిగిన డీలర్లా కాదా నిర్ధారించుకోవాలి అలాగే ఒకవేళ విత్తనాలు కొంటే బిల్లు తప్పని సరిగా తీసుకోవాలని అలాగే కంపెనీ పేరు ఉండేటట్లు చూసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామాలలో ఎవరైనా లూజు విత్తనాలు అమ్మినా ఎక్కువ తక్కువ రేటు అమ్మినా అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులకు తెలిపారు. ఏఈఓ రవిందర్, రైతులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షా కేంద్రంలో తనిఖీ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం లోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని కాకతీయ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ తిరుమల దేవి శనివారం తనిఖీ చేశారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ల పరీక్షలు 20 రోజులుగా జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ పరీక్షలు జరుగుతున్న తీరును ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సమయానుసారంగా హాజరుకావాలని సూచించారు. అడిషనల్ కంట్రోలర్ తిరుమలదేవితో పాటు కళాశాల ప్రిన్సిపల్ జాకీర్ ఉస్మాని, అబ్జర్వర్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

## చట్టాలపై మహిళలకు అవగాహన



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**ప్రస్తుత కాలంలో చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని ఆసిఫాబాద్ డివిజన్ షీటీంసభ్యులు ప్రకాష్ సూచించారు. శనివారం జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ ఆదేశాల మేరకు రెబ్బెన మండలం కైర్గాం గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లే మహిళలకు చట్టాలపై అవగాహనకల్పించారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీటీం ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న తదితరులుపాల్గొన్నారు.

## ఓటు హక్కు..ఓ వజ్రాయుధం



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః**వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 27న ములుగు జిల్లాలో ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నదన్నారు. జిల్లాలో మొత్తం 10,299 మంది పట్టభద్రుల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని అన్నారు. ఇందులో 6587 మంది పురుషులు, 3712 మంది స్త్రీలు ఉన్నారని తెలిపారు. జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మే 27న ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/వాజేడుః**వాజేడు మండలంలోని పూసూరు వంతెన సమీపంలో గల మండపాక గ్రామం వద్ద 163 జాతీయ రహదారిపై శనివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. వాజేడు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సివిల్, సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి ఛత్తీస్‌గడ్, భద్రాచలం, వెంకటాపురం, ఏటూరునాగారంలకు వచ్చి పోయే వాహనాలనుపరిశీలించారు. ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వాహనదారుల వాహన పత్రాలు పరిశీలించి అనుమానితుల వివరాలు సేకరించి వదిలిపెట్టారు. అనుమానితులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఆరోవిడత ఎన్నికల ఓటింగ్‌లో.. ప్రముఖులు




**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల ఆరో విడత పోలింగ్ శనివారం జరిగింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు ఓటింగ్ నిర్వహించారు. తొలి గంటల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఓ పోలింగ్ కేంద్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్, ఆయన సతీమణి సుదేశ్ క్యూలైన్‌లో నిల్చుని ఓటు వేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తొలి పురుషుడు ఈయనే కావడంతో అధికారులు సర్టిఫికేట్ ఇచ్చారు. ఆ విషయాన్ని ఆయన ఎక్స్‌లో పంచుకుంటూ తన సర్టిఫికెట్ చూపించారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ కుమార్తె మిరయా, కుమారుడు రేహాన్ వాద్రా క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలి గంటల్లో ఓటేశారు. అయితే రాహుల్, సోనియాగాంధీ హస్తం గుర్తుకు కాకుండా ఇతర పార్టీ గుర్తుకు ఓటేయడం గమనార్హం. తూర్పు ఢిల్లీ ఎంపి, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, బిజెపి లోక్‌సభ అభ్యర్థి బన్సూరీ స్వరాజ్, ఆమె తండ్రి కౌశల్ స్వరాజ్, కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ దంపతులు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ కుటుంబం, ఢిల్లీ మంత్రులు సౌరభ్ భరద్వాజ్, ఆతిశీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, హర్యానా సిఎం నాయబ్ సింగ్ సైనీ, మాజీ సిఇసి సుశీల్ చంద్ర తదితరులు తొలి గంటల్లో ఓటేశారు.

### నియంతృత్వం, ద్రవ్యోల్బణం, పెరుగుదలకు వ్యతిరేకంగా ఓటు వేశా: అరవింద్ కేజ్రీవాల్

దేశ వ్యాప్తంగా పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, నియంతృత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశానని ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. లోక్‌సభకు శనివారం జరుగుతున్న 6వ దశ పోలింగ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కేజ్రీవాల్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.తన తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చిన కేజ్రీవాల్.. అక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. 'మా నాన్న, భార్య, ఇద్దరు పిల్లలందరూ ఓటు వేశారు. ఆరోగ్యం బాలేకపోవడంతో అమ్మ ఓటు వేయలేకపోయారు. నియంతృత్వానికి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా నేను ఓటేశాను. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

## ఓట్ల వివరాల విషయంలో ఇసిని సుప్రీంకోర్టు సమర్థించడం శోచనీయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో పోలింగ్ జరిగిన బూత్‌ల వారీగా ఓట్ల వివరాలు ఇవ్వలేనని సుప్రీంకోర్టుకు ఎన్నికల కమిషన్ తెలియజేయడం, దానిని కోర్టు అంగీకరించడం అభ్యంతరకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాని కార్యాలయం ఏమి చెబితే అది చేస్తుందని, ప్రధాని మోదీ ప్రభుత్వానికి ఇసి అండగా ఉందని విమర్శించారు. ఇసిని సుప్రీంకోర్టు సమర్థించడం శోచనీయమన్నారు. ఢిల్లీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఉందని, ఢిల్లీలో 7 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్, ఆప్ గెలుపొందబోతున్నామన్నారు. ఉత్తర భారత రాష్ట్రాల్లో 30 నుంచి 40 శాతం మేరకు ఓట్ల శాతం బిజెపికి తగ్గనుందని, కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు కావడం అసాధ్యమన్నారు. మేధాపాట్కర్ కు పరువునష్టం దావా కేసులో ఢిల్లీ మెట్రోపాలిటన్ కోర్టు శిక్ష వేసిందని, ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాకు వ్యతిరేకంగా మేధాపాట్కర్ గతంలో చేసిన ఒక ప్రకటనపై వేసిన పరువు నష్టం దావా కేసులో దోషిగా నిర్ధారించిందన్నారు. మేధాపాట్కర్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏ పని చేయదని, ఆమె ఓ సామాజిక కార్యకర్త అన్నారు. సక్సేనాపై మేధా పాట్కర్ చేసిన వ్యాఖ్యలను సామాజిక కోణంలోనే చూడాలన్నారు. ప్రధాని మోదీ భాష ఏమిటి, ఆయన మాటలు ఏమిటిని ప్రశ్నించారు. విద్వేషపూరిత రాజకీయాలపై మీదే విజయం అంటూ కేజ్రీవాల్‌నుద్దేశించి పాకిస్తాన్ మంత్రి చేసిన అభినందన ప్రకటనపై మోదీ రాజకీయం చేస్తున్నారన్నారు. పాకిస్తాన్ మంత్రితో మోదీయే ప్రకటన చేయుంచి ఉండవచ్చని, సమాచారం లేకుండా పాకిస్తాన్ వెళ్ళొచ్చిన మోదీ ఏమైనా చేస్తారన్నారు.

## 'ఇండియా' కూటమిదే గెలుపు

### పంజాబ్ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో డిప్యూటి సిఎం భట్టి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హిందూ, ముస్లిం పేరిట మత రాజకీయాలు చేయడం తప్ప బిజెపికి మరో ఎజెండానే లేదని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు ఆరోపించారు. శనివారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ లోక్‌సభ నియోజక వర్గం పరిధిలోని మొగ, ధరం కోట్ అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క పలు సమావేశాలలో పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఇండియా కూటమి ఏర్పడిందని, దానికి అనుగుణంగానే పోరాడుతుందని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు వివరించారు. దేశంలో కొద్ది మంది తన మిత్రులు మాత్రమే ధనికులుగా మిగలాలనీ, ఇతరులంతా కూడా పేదవారిగా మిగిలిపోవాలని ప్రధాని మోడీ కోరుకుంటున్నారని ఆరోపించారు. కేంద్రంలో బిజెపి మరో సారి గెలిస్తే ఇక రాజ్యాంగం అంతమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఉండవని, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, రిజర్వేషన్లను రద్దు చేస్తారన్నారు. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ముందంజలో ఉందని అన్నారు. గత పదేళ్లలో నరేంద్రమోడీ ఎన్నో హామీలు ఇచ్చినా వాటిని నెరవేర్చనే లేదని, అందుకే ఈ సారి ప్రజలు ఇండియా కూటమికి మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. విపక్ష పార్టీలను విమర్శించే మోడీనే పెద్ద అబద్ధాల కోరు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు.

## ఫీజు నియంత్రణచట్టం అమలుకు డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని వివిధ విధ్యార్థి సంఘాలు రౌండ్‌టేబ్ సమావేశంలో డిమాండ్ చేశాయి. శనివారం కరీంనగర్లోని మం కమ్మతోటలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబ్ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగంధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, పిడిఎస్‌యు రత్నం రమేష్, ఎంఎస్ఎఫ్‌నవీన్, బిసిసంఘం అనిల్ యాదవ్, డివైఎఫ్ఐజిల్లా అధ్యక్షుడు నరేష్ పటేల్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి భోగేష్, జిల్లా ఉపాధ్యక్షుడురోహిత్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల ఆగడాలు చెలరేగిపోతున్నాయని, ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో ఎల్‌కెజి విధ్యార్థికి రూ.50వేల నుంచి రెండు లక్షల వరకు ఫీజు లు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు అనేది నోటీసు బోర్డులో పెట్టాలి కానీ.. ఏ ఒక్క విద్యాసంస్థ కూడా వారు పాఠశాలలో ఫీజులు బహిర్గతం చేసిన పరిస్థితి లేదన్నారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు.ప్రైవేట్ ఫీజుల దందాను నియంత్రించేందుకు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ సహా 15 రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తెచ్చాయి. తెలంగాణలో కూడా ఇదే బాట పట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత భావించినప్పటికీ మంత్రుల సబ్ కమిటీ వేసి ఫీజులు నిర్ణయించాలనుకున్నాచేయలేదన్నారు. రాష్ట్రంలో ఫీజులను నియంత్రణ చేయాల్సిన అవసరముందని, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1) ప్రకారం విద్యను ఉచితంగా అందించాలన్నారు. ఇంటర్నేషనల్, సిబిఎస్ఈ, ఐసిఎస్ఇ లాంటి తోక పేర్లను ప్రచారం చేస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఆయా సంస్థలు ఫీజులను ప్రతి యేటా ప్రభుత్వం సమగ్రంగా అకౌంట్స్ పరిశీలన చేసి సరైన కారణాలు ఉన్నప్పుడు మాత్రమే నిర్వహణ ఖర్చులు 15 శాతం మించకుండా పెంచుకునేలా చట్టం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఫీ రెగ్యులేషన్ కమిటీ ఫీజులను నియంత్రణ చేసే వ్యవస్థ ఉండాలన్నారు. ప్రత్యేక చట్టాన్ని ఆమోదించి ఫీజులను అమలు చేయాలన్నారు. విద్యావేత్తలు, చిన్న విద్యాసంస్థల యాజమాన్యాలు కలిసి రావాలని కోరారు.

## బిజెపి, బిఆర్‌ఎస్‌లకు ఓటమే

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** మతోన్మాద బిజెపిని, అవినీతి బిఆర్‌ఎస్‌ను ఓడిద్దామని, సిపిఐ, సిపిఎం బలపర్చిన కాంగ్రెస్‌అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్‌అన్నారు. నర్సంపేట పట్టణంలోని శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో పది సంవత్సరాలు పరిపాలనసాగించిన బిజెపి ప్రభుత్వం ఈదేశంలో ఉన్న నిరుద్యోగ యువకులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పది సంవత్సరాలు గడిచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి లక్షలాది మంది ఉద్యోగులను నిరుద్యోగులుగా మార్చిందన్నారు. ఈదేశ సంపదను కొంత మంది చేతుల్లోకి నేటివేసిఅదాని,అంబానీలకుదోచిపెట్టిందన్నారు. భారతదేశ ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి మత ఉన్మాదాన్ని ప్రేరేపించి మతం పేరుతో ప్రజల ఓట్లు దండుకోవాలని చూస్తున్న బిజెపిని తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తూ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని మాయమాటలు చెప్పి మభ్యపెడుతూ నిరుద్యోగ యువతీ యువకులు ఆత్మహత్య చేసుకునే విధంగా ఉరితాలు బిగించుకునే విధంగా బిఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన కొనసాగించిందని విమర్శించారు. పట్టభద్రుల ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి అభ్యర్థులను చిత్తుగా ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థితీన్మార్‌మల్లన్నను ఆదరించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు గడ్డం యాకయ్య, మియాపురం గోవర్ధన్, కవిత, శైలజ, మమత, నాగరాజు, స్వామి, మంజూల పాల్గొన్నారు.

## నిరుద్యోగుల పక్షాన మల్లన్న నిలబడతాడు..

### సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/మునుగోడుః** గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన బిఆర్‌ఎస్, బిజెపి అభ్యర్థులను పట్టభద్రుల ఎన్నికల్లో ఓడించి నిరంతరం ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తున్న కాంగ్రెస్ ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించి శాసన మండలికి పంపిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మునుగోడు మండల కేంద్రంలో మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల మునుగోడు నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో లౌకిక విలువలు ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్‌కి మద్దతు ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగానే మూడు జిల్లాలో జరుగుతున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు. పట్టభద్రులైన ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్‌ఎస్ గత పదేళ్లలో నిరుద్యోగాన్ని పెంచి పోషించాయని విమర్శించారు. కాంగ్రెస్ ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగుల పక్షాన శాసన సభల్లో తన గలాన్ని విప్పుతానన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజల ఆమోదంతోనే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నానని 24 ఉద్యోగ సంఘాలు తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చారని తెలిపారు.డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్‌జిల్లా అధ్యక్షులు శంకర నాయక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐమండలకార్యదర్శిచాపల శ్రీను, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

## కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, మిరప, మామిడి, ఆయిల్ పామ్, కందులు, సోయాబిన్, పెసర్లు, వేరుశనగ, జొన్న, పసుపు తదితర పంటలు సాగు చేసే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేశారు. సుమారు 66 లక్షల ఎకరాల్లో సాగు చేయనునన్న వరికి సంబంధించి వివిధ రకాలైన సన్నాలు, దొడ్డు వడ్ల విత్తనాలు 16.50 లక్షల క్వింటాళ్లు, అదేవిధంగా 55 లక్షల పత్తి సాగుకుగానూ సుమారు 55 వేల మెట్రిక్ టన్నుల పత్తి విత్తనాలు అవసరం ఉన్నట్లు అధికారులు లెక్కలు వేశారు. అదేవిధంగా వానాకాలం పంటలకు సంబంధించి 11.25 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువుల కారణంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు మూడంచెల నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు, పోలీసుశాఖతో పాటు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కలిసి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ఎరువులు, విత్తనాల డీలర్లు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, రైతులు కొనుగోళ్లు చేసిన విత్తనాలను మండల వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి నకిలీవని గుర్తిస్తే అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు.

**పత్తి విత్తనాలపై ప్రత్యేక దృష్టి :**

ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం మరింత పెరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర సర్కార్ విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం బోల్‌గార్డ్ (బిజి–II) విత్తనాలను మేలు రకమైనవి గుర్తించడమే కాకుండా పత్తి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ.864గా నిర్ణయించింది. దీంతో ఈ విత్తనాల్లో నకిలీ చోటు చేసుకుంటున్న పటిష్ట చర్యలు తీసుకోవడమే కాకుండా డీలర్లు ఇష్టానుసారంగా అధిక ధరలకు అమ్మకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలను చేపడుతోంది. అదేవిధంగా ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉండడంతో 125 లక్షల ప్యాకెట్లను మార్కెట్లల్లో అధికారులు ఇప్పటికే అందుబాటులో ఉంచారు.

**సన్న వడ్ల విత్తనాలకు ఈ ఏడాది మరింత డిమాండ్:**

సన్న వడ్లకు బహిరంగ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉండడంతో పాటు ఈ వానకాలం పంటల నుంచి సన్నవడ్లకు ప్రభుత్వం సైతం మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది సన్న రకాల వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. యాసంగితో పోల్చితే ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా సన్న వడ్ల విస్తీర్ణం ప్రతి ఏటా అధికంగా ఉంటుంది. ఎందుకంటే వర్షకాలంలో నీటి లభ్యతతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండడం, దీనికి తోడు రైతు కుటుంబాలు తమ ఇంటి అవసరాల కోసం కొంత సన్నాలు సాగు చేస్తుంటారు. అయితే ఈసారి ప్రభుత్వం సన్నాలకు ప్రత్యేకంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈసారి రైతులు రెట్టింపు స్థాయిలో సన్నాలు సాగు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందుకు అధికారులు సైతం రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడంతో పాటు మేలైన విత్తనాలు, ఎరువులను అందించడం ద్వారా రైతు అనుకున్న స్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరిగే విధంగా చర్యలు చేపడుతున్నారు. తద్వారా రైతులకు అధిక లాభాలు వస్తే వారే మరింత మంది రైతులను చైతన్యపర్చే అవకాశాలు ఉండడంతో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇది సఫలీకృతం కావాలంటే మార్కెట్‌లో ముందుగా నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

## చేనేత కార్మికులను బిఆర్‌ఎస్ విస్మరించింది

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వం చేనేత కార్మికులను పూర్తిగా విస్మరించిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత చేనేత కార్మికుల దీర్ఘకాలిక లబ్ధిచేకూరే పథకాల అమలుకు చర్యలు చేపడుతోందని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వం 2018 లో పవర్ లూమ్ కార్మికులకు ఇన్‌పుట్ సబ్సిడీ లింక్డ్ వేతనాలపరిహారపథకం (10శాతం యార్న్ సబ్సిడీ) ప్రవేశపెట్టగా ఈ పథకానికి క్యాబినెట్ ఆమోదము లేకపోవడంతో న నేటి వరకు నిధులు విడుదల కాని విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రూ. 33.23 కోట్ల నిధులను నేతకార్మికులకు 10శాతం యార్న్ సబ్సిడీ రూపం లో టెస్కో నిధుల నుండి విడుదల చేశామన్నారు. అయితే కొంతమందిమధ్యదళారులు పవర్‌లూమ్ వస్త్రములను చేనేత వస్త్రములుగా విక్రయించినట్లు తమ దృష్టికి రావడంతో విచారణ అదేశించామన్నారు. గత ప్రభుత్వం చేనేత మిత్ర పథకాన్ని కేబినేట్ ఆమోదం లేకుండా హడావిడిగా ప్రవేశపెట్టడం ద్వారా ఆ పథకానికి కూడా నిధుల విడుదల కాలేదని, ఆర్భాట ప్రచారాల కోసం పథకాలు ప్రవేశపెట్టి చేనేత కార్మికులను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని తెలిపారు.ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత పద్ధతి ప్రకారం అసలైన చేనేత కార్మికులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని, మరమగ్గాల , చేనేత మగ్గాల ఆధునీకరణకు బిసి సంక్షేమ శాఖ ద్వారా నేతన్నలకు సహాయం. 2024/25 సంవత్సరానికి బిసివెల్ఫేర్‌శాఖకు కేటాయించిన నిధు ల్లో నుంచి రూ 400 కోట్ల బడ్జెట్ వినియోగించుటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారని తెలిపారు. అదేవిధంగా వివిధ శాఖల ద్వారా రూ. 255 కోట్ల రూపాయల విలువైన వస్త్ర సరఫరాకు టెస్కో కు ఆర్డర్లు వచ్చాయని, తద్వారా చేనేత కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందన్నారు. నేత చేనేత కార్మికులు ,మరమగ్గ కార్మికులు స్వయంసమృద్ధి సాధించేందుకు దీర్ఘకాలికంగా లబ్ధిచేకూరే పథకాల రూపకల్పనకు అన్నిర చర్యలుతీసుకుంటున్నామనిమంత్రి వెల్లడించారు. చేనేత కార్మికుల దీర్ఘకాలిక లబ్ధికోసమే ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. తమ రాజకీయ పబ్బంకోసం వివిధ రాజకీయ పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ చేనేత కార్మికుల ఆత్మస్థైర్యము దెబ్బతీసేప్రయత్నాలుమానుకోవాలని లేకపోతే ప్రజాజీవితంలో వారికి గుణపాఠం తప్పదన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## పనుల్లో నాణ్యత తప్పనిసరి



ప్రజాపక్షం/వనస్థలిపురం: భూగర్భ డ్రైనేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్లోని ఆఫీసర్స్ కాలనీల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ భవిషత్ తరాలకు ఉపయోగపడే విధంగా డ్రైనేజీ పనులు చేయాలని, పనుల్లో కాంట్రాక్టర్ బాధ్యతయుతంగా పనిచేయాలని, హెచ్ఎండబ్ల్యూస్ అధికారులు పనులపై పరివేక్షణ ఉండాలని అధికారులను సూచించారు. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా పనుచేయాలని తెలిపారు. డ్రైనేజీ పనులను కాలనీ సంక్షేమ వాసులు పరిశిలించుకోవాలని, దీంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంలేకుండా పనులు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



ప్రజాపక్షం/నార్సింగి: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మహిళా మేయర్ గా లతా ప్రేమ్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత శనివారం మర్యాద పూర్వకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య సలహా దారుడు వేం నరేందర్ రెడ్డి,మాజీ ఎంపి రంజిత్ రెడ్డి లను కలిసి కృతజ్ఞతలు తెలిపి, ఆశీర్వాదం తీసుకున్నారు..ఈ కార్యక్రమంలో తెలంగాణ పాడి పరిశ్రమల చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీత్రినేత్ర హనుమాన్ జాతర



ప్రజాపక్షం/వనస్థలిపురం: బియన్‌రెడ్డినగర్ డివిజన్‌లో సాహెబ్ నగర్ గ్రామంలో శ్రీత్రినేత్ర అంజనేయ హనుమాన్ జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాహెబ్‌నగర్ గ్రా మంలో వీధురోడ్డుపై లైటింగ్‌లు, ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పా టు ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో చేశారు. భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్‌లు పర్యవేక్షణ చేస్తున్నారు. దాదాపు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉన్నాయని వారు తెలిపారు. మొదటి రోజు శ్రీత్రినేత్ర అంజేనేయ హనుమాన్ ఆలయంను శ్రీఉమారామలింగేశ్వరస్వామిదేవస్థానం చైర్మన్ ముద్దగౌని సతీష్‌కుమార్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం పూజలు చేశారు. దేవాలయ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నీళ్ల కృష్ణగౌడ్, ఆలయ అర్చకులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ గంగమ్మ కల్యాణం



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని గున్‌గ్రామంలోని శ్రీ పెద్దమ్మ, గంగమ్మ దేవి ప్రథమ వార్షికోత్సవానికి ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి రానున్నారని ఆలయ కమిటి అధ్యక్షులు గిరిమోని బిక్షపతి, నీరటి రామచంద్రయ్య, గిరమోని అశోక్, గొట్టం కృష్ణ, లు తెలిపారు. గున్‌గల్ గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మించి సంవత్సరం పూర్తి చేసుకున్నామని అన్నారు. ప్రథమ వార్షికోత్సవం సంధర్భంగా అంగరంగ వైభవంగా పెద్దమ్మ ,గంగమ్మ దేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామంలోని పెద్దలందరు సహకరిస్తున్నారని అన్నారు. ఈ నెల 19 నుండి 26 వ తేది వరకుల వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25 నేడు గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద పెద్దమ్మ గంగమ్మ లకు కళ్యాణం ఎంతో వైభవంగా జరిపినట్లు తెలిపారు. కని విని ఎరుగని రీతిలో ముదిరాజులతో బాటు గ్రామస్తులందరు పెద్దెతున హాజరైనట్లు తెలిపారు. రేపు ఎంఎల్‌ఎ వస్తున్నందున పార్టీలకు అతీతంగా అందరు హాజరుకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరమోని దుర్గయ్య, పూజారి రాకేశ్, గిరమోని ఈశ్వర్, గిరమోని రవింధర్,శ్రీనివాస్, కృష్ణంరాజు, బుచ్చమ్మ, రవింధర్, జంగయ్య, శివకుమార్ తదితరులు పాల్గోన్నారు.

## రైతులను మోసం చేస్తే చర్యలు

ప్రజాపక్షం/యాచారం : మండలంలోని పర్టిలైజర్ వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి సందీప్ తెలిపారు. శనివారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్,కుర్మిద్ద గ్రామాల్లో రైతులకు అవగాహణ సదస్సులు నిర్వహించారు. ఈ సంధర్భంగా వ్యవసాయధికారి సందీప్ మాట్లాడుతూ నేడు మార్కేటులోకి నకిలీ వత్తినాలు వస్తున్నాయి. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు వ్యవసాయధికారుల సూచనలు సలహాలు తీసుకొవాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత దుకాణం నుండి తప్పకుండా రషీదును తీసుకొవాలని అన్నారు.అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు.

## కూలీలకు డబ్బులు చెల్లించాలి



పజాపక్షం/యాచారం :ఉపాధిలో పనిచేస్తున్న కూలీలందరికి సకాలంలో కూలీ డబ్బులు చెల్లించాలని ఎంపిపి కొప్పు సుకన్యభాష అధికారులను కొరారు. శనివారం యాచారం మండల కేంద్రంలో ఉపాధి పథకం కింద చేస్తున్న పనులను ఎంపిడిఓ నరేంధర్‌రెడ్డితో కలిసి ఆమే పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆమే మాట్లాడుతూ కూలీలకు వారం వారం పేమెంటు వచ్చే విధంగా చూడాలని అన్నారు. కూలీలు ఎంతో కష్టపడి పని చేస్తున్నారు. కూలీ తక్కవగా వస్తే ఇబ్బందులు పడుతారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం తెచ్చిందని అన్నారు. అర్హులైన వారందరకి పనులు కల్పించాలని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఉదయం వెళ్ళల్లో పనులు చేయించాలని అన్నారు. ఉపాధి ఎపిఓ లింగయ్య పాల్గోన్నారు.

## ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు

ప్రజాపక్షం/యాచారం : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024/2025 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న సిట్ల భర్తి కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య శనివారం తెలిపారు. హైద్రాబాద్, రంగారెడ్డి తూర్పు రిజియన్ పరిధిలో నాన్ సివోఈ శంషాబాద్ కళాశాలలో ఎంఈసి,సిఈసి,కందుకూరు కొందుర్గు కళాశాలలో ఎంపిసి, బైపిసి, విద్యార్థులు దరఖాస్తు చేసుకొవాలని అన్నారు. ఈ నెల 24 నుండి 31 వరకు దరఖాస్తుల స్వికరణ కార్యక్రమం ఉంటుందని అన్నారు.మేరిట్ అధారంగా సిట్ల భర్తి ప్రక్రియ ఉంటుందన్నారు.

## కోడ్ ముగిసిన వెంటనే పనులు పూర్తి

ప్రజాపక్షం/హయత్ నగర్ : ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆగిపోయిన పనులను పూర్తి చేసినందుకు కృషి చేస్తానని జిహెచ్ఎంసి హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అన్నారు.శనివారం డివిజన్ లోని ఇన్ఫర్మేషన్ కాలనీలో మార్నింగ్ వాక్ లో భాగంగా పర్యటించి ఆయన కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ వాసులు సిసి రోడ్ సదుపాయం లేకపోవడంతో వర్షాలు పడిన ప్రతిసారి గుంతలు ఏర్పడి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ వలన అభివృద్ధి పనుల్లో కొంత ఆలస్యం జరుగుతుందన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాపక్షం/నార్సింగి: మణికొండ మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను శనివారం టౌన్ ప్లానింగ్ యంత్రాంగం కూల్చివేశారు. పంచవటి కాలనీ,రాఘవేంద్ర కాలనీ, పుప్పల్ గూడ, ప్రాంతాలలో అక్రమనిర్మాణాలు మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ అదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ కూల్చివేశారు.

## హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తే
# సహించేది లేదు



- పలు విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ విపత్తు నిర్వహణ వ్యవస్థ
- ఔటర్ లోపల ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని రూపొందించాలి
- జూన్ 4లోపు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తే సహించేది లేదని, నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పనిచేసే వారిని ప్రోత్సహిస్తామని, వారికి ఉన్నత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ మహానగరానికి సంబంధించి వివిధ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ'విపత్తునిర్వహణ వ్యవస్థ'ను రూపొందించాలన్నారు.ఔటర్‌రింగ్‌రోడ్డులోపల ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని,జూన్4లోపు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అధికారులతో హైదరాబాద్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. కేవలం వర్షాకాలంలో మాత్రమే కాకుండా 365 రోజులు పనిచేసేలా వ్యవస్థను రూపొందించాలని,ఒక్కో విభాగం నుంచి ఒక్కో అధికారి బాధ్యత వహించేలా చూడాలని సూచించారు. నాలాల పూడికతీతలో నిర్లక్ష్యం వద్దని, పూడిక తీసిన చెత్తను సమీప ప్రాంతాలకు తరలించాలని, క్వారీ ఏరియాలను గుర్తించి, ఆ ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కోడ్ ముగిసిన తరువాత ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, పనుల్లో నిర్లక్ష్యంవహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఓపెన్ సెల్లార్ గుంతల వద్ద ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వాటికి బారికేడింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలు ఆధారంగా ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని, కంటోన్మెంట్ ఏరియాలో నాలాల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని సిఎం ఆదేశించారు. సమస్యాత్మక నాలాల వద్ద అవసరమైతే ప్రతీ రోజు క్లీనింగ్ చేపట్టాలన్నారు.విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, పవర్ మేనేజ్‌మెంట్ సరైన విధంగా ఉండాలని తెలిపారు.

### డ్రగ్స్ కేసుల్లో ఎంతటి వారున్నా ఉపేక్షించొద్దు

న్యూఢిల్లీ: గంజాయి,డ్రగ్స్ నిర్మూలనలో పురోగతి గురించి నార్కోటిక్స్ అధికారులను అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు. వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలని సూచించారు.సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సరఫరా చైన్ బ్రేక్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అసలు వాటిని సరఫరా చేయాలంటేనే భయపడేలా చర్యలుండాలన్నారు. కేసుల్లో సెలబ్రిటీలు, ప్రముఖులు ఉన్నా ఉపేక్షించొద్దన్నారు. అవసరమైతే యాంటీ డ్రగ్‌టీమ్స్‌ను ఏర్పాటు చేయమని చెప్పారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పని చేసేవారిని ప్రోత్సహించాలని, అందుకు కావాల్సిన సహాయ సహకారాలుప్రభుత్వం సమకూరుస్తుందని వెల్లడించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చి, ఇతర రాష్ట్రాలకు టీఎస్ న్యాబ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## మోసపూరిత ప్రకటనలు చేసే వారిపై దృష్టి




ప్రజాపక్షం/హైదరాబాద్:రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) దాడులను కొనసాగిస్తోంది.అధికధరలకు విక్రయిస్తున్న మందుల షాపులు, ఆయుర్వేదం పేరుతో మోసపూరిత ప్రకటనలు చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇందులో భాగంగానే ఆసిఫాబాద్, నారాయణపేటలో దాడులు నిర్వహించారు. జైటాస్ పిటి ఇన్‌జెక్షన్ ను ఎంఆర్‌పి ధరను కేంద్రం రూ.447.31 నిర్ధయించగా, హిమాచల్ ప్రదేశ్‌లో ఉత్పత్తి అవుతున్న ఈ మందును జర్మన్ రెమెడీస్ ఫార్మక్యూటికల్ మార్కెటింగ్ సంస్థ రూ. 546.15 తో విక్రయిస్తున్నారు. దీనిని ఆసిఫాబాద్‌లోని ఒక మెడికల్ షాపులో స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయుర్వేదం పేరుతో కిడ్నీ రాళ్లకు సంబంధించి మోసపూరిత ప్రకటన చేస్తున్న లుదియానలోని ఇండియన్ హెర్బో ఫార్మకు చెందిన 'ఆయు ఆర్‌సి' సిరప్‌ను నారాయణపేటలోని ఒక మెడికల్ షాపులో విక్రయిస్తున్నారు. ఈషాపు పైన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడి చేసి, ఆయు ఆర్‌సి సిరప్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ కంట్రో ల్ అసిస్టెంట్ డైరక్టర్ ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో నారాయణపేట డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు ఎ.ఎన్. క్రాంతి కుమార్, మహ్మద్ రఫి,పి.శ్రవణ్‌కుమార్, కరీంనగర్ డ్రగ్ ఇన్స్పెక్టర్ టి.చందన బృందం పాల్గొన్నది. నేషనల్ ఫార్మక్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ( ఎన్‌పిపిఎ) నిర్ధేశించిన ధరకంటే అధిక ధరలకు మందులను విక్రయిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ వి.బి.కమలాసన్ రెడ్డి హెచ్చరించారు.

## అంబర్‌పేట్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్: మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలను పెద్ద అంబర్‌పేట్ కమిషనర్ రవింద్రర్‌రెడ్డి టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌అధ్వర్యంలోశనివారం జేసిబిలతో కూల్చివేయడం జరిగింది.మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా భారిషేడ్‌లను నిర్మించినా వాటి జోలికి వెళ్లాకుండా చిన్నా చిన్నా అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం పెద్ద నిర్మాణాల జోలికి పోకపోవడం వేనుక అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహాంవ్యక్తంచేస్తున్నారు. అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేయాలని ఏన్నిసార్లు ఫిర్యాదులు చేసినాఎన్నికలకోడ్‌లో కూల్చివేయడం లేదని తమకు ఉన్నత అధికారుల అదేశాలున్నావని సమాధానం చెప్పి తప్పించుకున్న అధికారులు కూల్చివేతలు చేసినప్పటికి బారి షెడ్డులు, సెల్లార్‌లు జోలికి పోకపోవడం విచారకర మన్నారు. కొందరు అధికారుల తీరుపై స్థాని కులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాజకియ పలుబడిలేనివి కూల్చివేశారనే అరోపణ లు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నత అధికారులు ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులపై విచారణ చేసి పెద్ద అంబర్‌పేట్ లోని అన్ని వార్డులలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలనిబాధితులుకోరుతున్నారు. మున్సిపాలిటి పరిధిలోని సర్వే నేంబర్ 169, 170, 183, 149లో బలిజగూడ రోడ్డులో అనుమతులు లేకుండా నక్క శ్రిధర్ శంకర్‌పోరెడ్డి బాల్‌రెడ్డి షట్టర్‌లను, సర్వేనేంబర్ 272,273 లోని కృష్ణరెడ్డి షెడ్డునుకూల్చివేసినట్లుఅధికారులు వివరిం చారు.

## రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహిస్తాం

మియాపూర్‌లో ప్రాపర్టీ ఎక్స్‌పోను
ప్రారంభించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : హైద్రాబాద్‌ను ప్రపంచ నగరాలతో పోటీ పడేలా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహిస్తు పరిశ్రమలను హైద్రాబాద్‌కు తీసుకోస్తామని తెలంగాణ నీటి పారుదల, ఆహర, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వెస్ట్ హైద్రాబాద్ 2024 ప్రాపర్టీ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ నీటిపారుదల, ఆహర, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఐజిబిసి జాతీయ వైస్ చైర్మేన్ శేఖర్ రెడ్డి, ఆంధ్ర, తెలంగాణ రెస్పాన్స్ హెడ్ కమల్ కృష్ణన్‌లు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హైద్రాబాద్ యొక్క విశిష్టమైన ప్రాపర్టీని ప్రదర్శించడానికి ప్రత్యేకంగా ఇక్కడ మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో మూడు రోజుల పాటు వెస్ట్ హైద్రాబాద్ 2024 ప్రాపర్టీ షోను ఏర్పాటు చేశారని బిల్డర్లకు, కొనుగోళ్ళుదారులకు ఇది చక్కని వేదిక అని హైద్రాబాద్ రియల్ రంగంలో వ్యూహాత్మక అంశాలతో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉండడంతో పాటు వేగవంతమైన మౌలిక సదుపాయలతో అనువైన నివాసానికి ,వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగంలో హైద్రాబాద్ ఏంతో అభివృద్ధి చెందినదని, ప్రపంచ నగరాలకు ధీటుగా హైద్రాబాద్‌ను తయారు చేస్తామని తెలంగాణ నీటి పారుదల, ఆహర, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## సొంత నిధులతో రాజీవ్ విగ్రహం చేయించా

మాజీ ఎంపి వి. హనుమంతరావు




ప్రజాపక్షం /హైదరాబాద్ : తన సొంత నిధులతో మాజీ ప్రధాని రాజీవ్ విగ్రహాన్ని తయారు చేయించానని, రాజీవ్ గాంధీ జయంతి ఆగస్టు 20న ఆ విగ్రహాన్ని కాంగ్రెస్ యువనేత ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ఆవిష్కరించాలన్నదే తన కోరిక అని కాంగ్రెస్ మాజీ ఎంపి వి. హనుమంతరావు అన్నారు. ఈ మేరకు శనివారం గాంధీ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉప్పల్ స్టేడియంకు రాజీవ్ గాంధీ పేరు పెట్టాలి అని గతంలోనే రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి సలహా ఇచ్చానని వి. హనుమంత్‌రావు అన్నారు. ఉప్పల్ స్టేడియం నిర్మాణం కోసం కొంత డబ్బులు తక్కువ పడితే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వద్దకు తీసుకువెళ్లి కలిపించానని, ఆమె వెంటనే సంతోషించి కొన్ని నిధులు ఇచ్చి రాజీవ్ గాంధీ పేరు పెట్టడానికి ఒప్పుకున్నారన్నారు. ఇతరుల పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ రాజీవ్ గాంధీ పేరు పెట్టడంలో నాటి సిఎం రాజశేఖర్ రెడ్డి ముఖ్య పాత్ర పోషించారని గుర్తు చేశారు. అయితే ఆ స్టేడియానికి రాజీవ్ పేరు పెట్టినా... అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం లేదన్నారు. అందుకే తన సొంత నిధులతో అమలపురంలో 13 అడుగుల ఎత్తు.. వెయ్యి కిలోల బరువు గల బ్రాన్జ్ తో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తయారు చేయించానని విహెచ్ అన్నారు. అంబేద్కర్ సన్మానించిన శ్రీనాథ్ వడియర్ శిల్పి ట్యాంక్ బండ మీద ఉన్న విగ్రహాలు చెక్కగా, ఆయనవారసుడు రాజ్‌కుమార్ వడియర్‌తో తాను రాజీవ్ గాంధీ విగ్రహం చేయించానని తెలిపారు.

## ఘనంగా ఫ్యామిలీ డాక్టర్స్ డే



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : వరల్డ్ ఫ్యామిలి డాక్టర్స్ డే ను పురస్కరించుకొని కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో ని వృద్ధాశ్రమంలో న్యూట్రిషియన్ ఫర్ ద ఎల్డర్లీ అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర ఎ ఎఫ్‌పిఐ ఫ్యామిలీ డాక్టర్స్ అధ్యక్షురాలు డాక్టర్ కిరణ్మయి డాక్టర్ల అవశ్యకత సోసైటీలో ఏంత అవసరమో వివరించారు. వద్దులకు ఎలాంటి అవసరమో, షుగరు వ్యాధి, రక్త పోటు ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో, ఆహారంలో ఎన్ని క్యాలరీస్ ఉండాలో చూసుకొని వ్యాయమం ఎలా చెయాలో ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశ్వర్‌రావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ శ్రీమతి డాక్టర్ కె. రజనీ తదితరులు పాల్గొన్నారు.

## పౌరసరఫరాలలోని అక్రమాలపై కఠిన చర్యలు

సిఎం రేవంత్‌రెడ్డికి
బిజెపి నేత మహేశ్వర్‌రెడ్డి లేఖ




ప్రజాపక్షం /హైదరాబాద్ : పౌర సరఫరాల శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ శాసనసభ బిజెపి పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధన ప్రకారం మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం తీసుకున్న తర్వాత వాటిని మిల్లింగ్ చేసి బియ్యం తిరిగి ఇవ్వని డిఫాల్టర్లయిన మిల్లర్లపై చర్యలు తీసుకోవాల్సింది పోయి మళ్లీ వారికే ధాన్యం ఇస్తున్నారని ఇందుకు ప్రతిఫలంగా సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు వందల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారని మరోసారి ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే మీడియా సమక్షంలో బయటపెట్టాని ఆ వాస్తవాలను కూడ సిఎం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఈ లేఖ రాస్తున్నట్లు మహేశ్వరరెడ్డి తెలిపారు. పేదలకు పిడిఎస్ ద్వారా ప్రతి నెలా పంపిణీ చేసే నాణ్యమైన రేషన్ బియ్యం పథకానికి కేంద్రం పేదల కోసం వేల కోట్ల వెచ్చిస్తోందని, ఈ నిధులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ బియ్యం రీసైక్లింగ్ ను అరికట్టకుండా దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. . వేల కోట్ల కేంద్ర నిధులను దుర్వినియోగం చేసేలా తెలంగాణ పౌర సరఫరాల శాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐకి కూడా ఫిర్యాదు చేయనున్నానని ఈ అక్రమాలపై సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మట్టిని తరలిస్తున్న వాహనం పట్టివేత




ప్రజాపక్షం/కేశంపేట: కేశంపేట మండలం భైర్‌ఖాన్‌పల్లిలోని పోసముద్రం చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమో దు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం చెరువులో ఉదయం టిప్పర్ల ద్వారా బీహార్‌కు చెందిన రాహుల్ కుమార్, అజయ్‌కుమార్ యాదవ్‌లు మట్టిని తరలిస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, ఇటాచ్చిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఫీల్డ్ సూపర్‌వైజర్ తట్టెపల్లి లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## వర్షాకాల ప్రణాళికకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అధికారులను ఆదేశించిన జలమండలి
ఎం.డి. సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాకాల ప్రణాళికలకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి అధికారులని ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన డైరెక్టర్ ఆపరేషన్స్2 స్వామి, సిజిఎంలు, జిఎంలు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. డివిజన్‌ల వారీగా ఉన్న మ్యాన్ హోల్స్, డిప్‌మ్యాన్ హోల్స్, నీళ్లు నిలిచే ప్రాంతాలు తదితర అంశాలను అధికారులను ఎం.డి. అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే మ్యాన్ హోల్స్ మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. స్టోర్స్‌లో సరిపడా సామగ్రి ఉందో లేదో చూసుకోవాలని సూచించారు. ఇంకా ఏమైనా అవసరం అయితే, ముందే తెప్పించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి కావాల్సిన భద్రతా పరికరాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ కావాల్సిన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత, రోజూ వాటర్ లాగింట్ పాయింట్‌ల దగ్గరికి వెళ్లాలన్నారు. మేనేజర్ లేదా సిబ్బంది రోజు వెళ్లి పర్యవేక్షించాలన్నారు. అన్ని డివిజన్‌లలో మ్యాన్‌హోల్స్‌పై సేఫ్టీ గ్రిల్స్, హెచ్చరిక బోర్డులు, రెడ్ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## లింగాకారి మరణం సిపిఐకి తీరనిలోటు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబటిపల్లి గ్రామంలో కామ్రేడ్ లింగాకారి పెద్దవిరోజ్ మరణం సిపిఐకి తీరనిలోటు. అంబటిపల్లి గ్రామంలో సిపిఐ తరపున గతంలో ఎన్‌టిరామారావు ప్రభుత్వం ఉన్నప్పుడు ఉపసర్పంచ్‌గా పని చేశారు. పెత్తందారులు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి అనేక సమస్యలను ఎదుర్కొని నిలబడింది. దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తి కామ్రేడ్ లింగాకారి అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ అంతిమయాత్రలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జి పాల్గొని ఆయన సేవలను ఎన్నటికి మరువలేమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు.

## ఎల్‌ఒసి లెటర్‌ను అందజేసిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/మల్దకల్ : జోగులాంబ గద్వాల్ జల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామానికి చెందిన బి.గోవర్ధన్ తండ్రి బి.నగేష్‌కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మంజూరు అయిన 1లక్ష 50 వేల రూపాయలు ఎల్‌ఓసి లెటర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా గోవర్ధన్‌కు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మల్దకల్ ఎంపిపి రాజారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి భాస్కర్, బండి చిన్న తిమ్మన్న, ఆర్‌టిసి డీజిల్ మెకానిక్ గోవిందు, దేవ సహాయం, దేవరాజ్ బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి

ప్రజాపక్షం/అచ్చంపేట : పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలపై బిఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త కొంతమందితో కలిసి దాడిచేయగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌ఐ రాము తెలిపారు. వివరాల ప్రకారం ఇటీవల జరిగిన ఎంపి ఎన్నికలలో అచ్చంపేట పట్టణం సాయినగర్‌కు చెందిన కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఘర్షణ పడ్డారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త బాల్‌రాజు కుటుంబంపై దాడిచేశారు. అప్పుడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేసి ఇద్దరిని జైలుకు పంపించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం సాయిరామ్ టాకీస్‌వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు లాలు యాదవ్ ఆధ్వర్యంలో నిల్చున్నారు. ఈసమయంలో బిఆర్‌ఎస్ కార్యకర్త బాల్‌రాజు కత్తితో ఇరువురిపై దాడిచేశారు. అందులో ఇద్దరికి తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. ఈవిషయంపై చుట్టుపక్కలవారు అడ్డుకోవడంతో అక్కడినుంచి పారిపోయాడు. గాయపడిన లాలుయాదవ్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## వేసవి శిక్షణ శిబిరం ముగింపు



ప్రజాపక్షం/జడ్చర్ల : అవోప జడ్చర్ల వారి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా 2024–25 సంవత్సరానికి 10వ తరగతిలోకి వెళ్తున్న విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల చే గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రంలను తెలుగు, ఇంగ్లీష్ మాంధ్యమ విద్యార్థులకు బోధించడం జరిగింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అవోప ఫైనాన్స్‌సెక్రెటరీ కందికొండ శ్రీనివాసులు, జడ్చర్ల యంఈఓ మంజుల, సంగీత నాటక అకాడమీ మాజి చైర్మన్ బాద్మీ శివకుమార్, అవోప అధ్యక్షులు ఎలిశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి శివకుమార్, మాజీ అధ్యక్షులు నరసింహ స్వామి, తదితరులు పాల్గొన్నారు. అతిథులు, శిక్షణ శిబిరాన్ని రాష్ట్రంలో కేవలం జడ్చర్ల ఆవోప వారు గత 13 సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన



ప్రజాపక్షం/వంగూరు : మండలకేంద్రంలో ఆటోడ్రైవర్లకు ప్రజలకు శనివారం సైబర్ నేరాలపై రోడ్డుప్రమాదాలపై ఎస్‌ఐ మహేందర్ అవగాహన సదస్సు నిర్వహించాంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాలను ఆరికట్టాలని అన్నారు. ఆటో డ్రైవర్లతో పాటు వివిధ వాహనాల డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలను ఆరికట్టేందుకు డ్రైవింగ్ నియమాలను పాటించాలని అన్నారు. అత్యవసర సమయంలో 100కు దయల్‌చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ఆయా గ్రామాల ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిటి స్కాన్ ప్రారంభించిన చిన్నారెడ్డి



ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు పట్టణ కేంద్రంలో రాఘవేంద్ర ఆసుపత్రి సిటి స్కాన్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో వసతులను వైద్యానికి సంబంధించిన పరికరాలను సందర్శించి పరిశీలించడం జరిగింది. అనారోగ్యానికి గురైన బాధితులను ప్రేమా ఆప్యాయతతో స్వాగతించి ప్రజల అభిమానాలు సొంతం చేసుకోవాలని డా. రాఘవేంద్రకు సూచించడం జరిగింది. టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మాజీ మార్కెట్ యారిటి చైర్మన్ గొని బుచ్చారెడ్డి, పెబ్బేర్ సింగిల్ విండో చైర్మన్ గొని కోదండరాం రెడ్డి, రాంపురం సహదేవుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మన్యం కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలపరిధిలోని జిల్లెల గ్రామానికి చెందిన వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు పెరుమాళ్ల కృష్ణయ్య, నాప జంగయ్యలు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు ఎంఎల్‌ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు దామోదర్‌గౌడ్, రాకేష్‌కుమార్, జిల్లెల్ల ఆంజనేయస్వామి, దేవాలయ చైర్మన్ రవిగౌడ్, రమాకాంత్‌రెడ్డి, గ్రామకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మహేందర్, ప్రభాకర్, చంద్రకాంత్, వెంకటేష్, సురేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

# మందస్తుగానే బల్దియా 'డిమాండ్'

### ఆస్తిపన్ను వసూళ్ల కోసం 'నోటీసులు'
### ముదస్తుగానే జారీ చేస్తోన్న జిహెచ్‌ఎంసి
### ఎర్లీబర్డ్‌లో చెల్లించనివారిపై ఫోకస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపు పథకం ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకొని వారిపై మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) దృష్టిసారించింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం పన్నులో ఎర్లీబర్డ్ పథకం ద్వారా రాయితీ కల్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఎర్లీబర్డ్ పథకం ముగిశాక ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకొని మిగితా వారికి జూలై లేదా ఆగస్టు నెలలో ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా జిహెచ్‌ఎంసి అధికారులు డిమాండ్ నోటీసులు జారీ చేస్తుండేవారు. సాధారణ నోటీసులకు పన్ను చెల్లింపుదారులు స్పందించకపోతే అనంతరం రెడ్ నోటీసులు జారీ చేసేవారు. ఈసారి అందుకు భిన్నంగా ఏప్రిల్ నెలాఖరుతో ఎర్లీబర్డ్ ముగియగానే, డిమాండ్ నోటీసుల జారీ చర్యలకు శ్రీకారం చుట్టి ప్రస్తుతం వాటిని జారీ చేస్తున్నారు. గతంలో లేని విధంగా ఎర్లీగా డిమాండ్ నోటీసులను జిహెచ్‌ఎంసి అధికారులు జారీ చేస్తున్నారు. తద్వారా ఇళ్ల పన్నుచెల్లింపు దారులకు నెలకు 2 శాతం వడ్డీ భారం తగ్గుతుందని చెప్తున్నారు. జిహెచ్‌ఎంసి ఖజానాకు సైతం తగిన మొత్తంలో నిధులు జమ కాగలవని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

**ఆదాయంతో పాటు పెరుగుతున్న ఖర్చులు..**

ఏడాదికేడాది జిహెచ్‌ఎంసికి ఆస్తిపన్ను ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతోంది. ఖర్చులు అంతకుమించి పెరుగుతుండటంతో సిబ్బంది వేతనాలు నుంచి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల వరకు జాప్యం జరుగుతోంది. జీతాల చెల్లింపుల్లో జాప్యం ఉండరాదని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలుండటంతో చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆస్తిపన్ను చెల్లించాల్సిన అందరి నుంచి ఆస్తిపన్ను వసూళ్లు చేసేందుకు జిహెచ్‌ఎంసి ఈ సంవత్సరం ఎర్లీగానే డిమాండ్ నోటీసులు జారీ చేస్తోంది. ఈ సంవత్సరం రూ.2200 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. ఎర్లీబర్డ్‌ను వినియోగించుకోవడం ద్వారా 7.34 లక్షల మంది ఇళ్ల యజమానులు రూ. 827 కోట్ల ఆస్తిపన్ను చెల్లించారు.

**ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ. 20 కోట్ల కంటే తక్కువ ఆస్తిపన్ను వసూలైన సర్కిళ్లు**

| సర్కిల్ | వసూలు (రూ.కోట్లు) |
|---|---|
| ఉప్పల్ | 16.10 |
| మలక్‌పేట | 14.62 |
| సంతోష్ నగర్ | 6.06 |
| చాంద్రాయణగుట్ట | 2.78 |
| చార్మినార్ | 5. 35 |
| ఫలక్‌నుమా | 3.11 |
| రాజేంద్రనగర్ | 19.72 |
| మొహదీపట్నం | 17.38 |
| కార్వాన్ | 8.39 |
| ముషీరాబాద్ | 17.54 |
| యూసుఫ్‌గూడ | 12.50 |
| గాజుల రామారం | 13.39 |
| అల్వాల్ | 15.35 |
| సికింద్రాబాద్ | 11.04 |




ఈ సర్కిళ్ల నుంచి ఎర్లీబర్డ్ ద్వారా తక్కువ ఆస్తిపన్ను మాత్రమే వసూలైంది. డిమాండ్ నోటీసులు, ఎస్‌ఎంఎస్‌లతో అలర్ట్ చేయడంతో ఈ సర్కిళ్లే కాక మిగతా సర్కిళ్ల నుంచి కూడా ఆస్తిపన్ను చెల్లించేవారు చెల్లిస్తారని, తద్వారా కొన్ని పనులకైనా ఈ నిధులు వినియోగించుకోవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

## అర్హులైన వారికి సంక్షేమ పథకాలు





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందించాలని, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ శాంతకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌జెఆర్ ఫంక్షన్‌హాల్‌లో జెడ్‌పి చైర్‌పర్సన్ అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమం, విద్య, వ్యవసాయం, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఎజెండాలో చేర్చిన అంశాలపై చర్చించారు. శాఖలవారిగా జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి మాట్లాడారు. పలువురు జెడ్‌పిటిసిలు తమ మండలాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై ప్రశ్నించగా, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కలిసికట్టుగా పని చేసి జిల్లాను అభివృద్ధిపర్చాలని సూచించారు. అచ్చంపేట ఎంఎల్‌ఏ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లెలా అధికారులు కృషి చేయాలన్నారు. విద్య, వైద్యం, పేదప్రజలకు అందేలా అధికారులు నిరంతరంగా కృషి చేయాలన్నారు. వ్యవసాయరంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నాణ్యమైన విత్తనాలు , ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈసమావేశంలో జడ్పివైస్‌చైర్మన్ బాలాజిసింగ్, జిల్లాపరిషత్ సీఇవో దేవసహాయం, పలువురు జడ్పిటిసిలు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలు, హక్కులపై...

### సీనియర్ సివిల్ జడ్జి సబిత



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలు, హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి సబిత తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ మండలంలోని ఎండబెట్ల గ్రామంలో కార్మికులు మహిళలతో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగంలోని కార్మికులను వివిధ సాంఘిక సంక్షేమ చట్టాలు, పరిపాలన కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాల ప్రకారం ప్రయోజనాలను పొందేందుకు పేదల హక్కులకు భంగం కలిగినప్పుడు వారికి ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సేవలు అందించేందుకు జిల్లా, మండల స్థాయిలో న్యాయసేవాధికార సంస్థ పనిచేస్తుందన్నారు. అసంఘటితరంగంలో పనిచేసే కార్మికులు తమపేర్లను ఈశ్రమ్‌పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్రప్రభుత్వం ద్వారా కార్మికులకు లభించే పథకాలు, నష్టపరిహారం వంటివి పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. మహిళలు, పిల్లలు, ఎస్సి, ఎస్టిలు, వికలాంగులు, కార్మికులు న్యాయ సేవలు పొందాలన్నారు. సుదీర్ఘకాలం పాటు కోర్టులచుట్టూ తిరగకుండా అన్ని గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించేలా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనిధి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన




ప్రజాపక్షం/రాజోలి : మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామంలో శనివారం నకిలీ విత్తనాలపై ఎఇఒ ఇబ్రహీం రైతులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు ఉండి, గుర్తింపు ఉన్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ఒరిజినల్ బిల్లు తీసుకోవాలన్నారు. పంట దిగుబడి వచ్చేంతవరకు బిల్లులు రైతుల వద్ద జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. లూజ్ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయారాదన్నారు. అంతేకాక పంటల దిగుబడి కోసం రసాయన, ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేస్తే భూమి సారవంతం అవుతుందన్నారు. 60 సబ్సిడిపై జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు ఆధార్ కార్డు జిరాక్స్‌లు ఇచ్చి జీలుగు విత్తనాలు కొనుగోలు చేసి పొలాల్లో సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రాముడు, సైమాన్, రామకృష్ణ, మద్దిలేటి, నాగరాజు, కురుమున్న, నాగన్న, రమేశ్, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద భూములపై విచారణ



ప్రజాపక్షం/వీపనగండ్ల : మండల పరిధిలోని రంగవరం గ్రామ సమీపంలో వివాదాస్పదంగా ఉన్న ప్రభుత్వ భూమిపై విచారణ జరిపి అర్హులైన రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. రంగవరం సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 357లో 351 ఒక ఎకరాలను గోపాల్ దిన్నె, రంగవరం, పుల్గర్ చర్ల గ్రామాల చెందిన 173 మంది రైతులకు ప్రభుత్వం పట్‌టాలను అందించింది. అయితే ఇందులో కొందరు రైతులు పట్టాలు పొందిన భూమి కంటే ఎక్కువ భూమిని సాగు చేస్తుండటంతో రైతుల మధ్య వివాదాస్పదం నెలకొంది. ఈ విషయంపై రంగవరం, గోపాల్ దిన్నె గ్రామానికి చెందిన కొందరు రైతులు తమకు పట్టాలు చూపించిన విధంగా భూమికి హద్దులు చూపించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలుమార్లు ఆందోళనలు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు ప్రభుత్వ భూమిపైకి వెళ్లి విచారణ చేపట్టిన సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, వనపర్తి ఆర్‌డిఒ పద్మావతి స్వయంగా ప్రభుత్వ భూమిని పరిశీలించి ఏ రైతు ఎంత భూమిని సాగు చేసుకుంటున్నారో తెలుసుకున్నారు. పట్టాలు పొందిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వరలక్ష్మి ప్రత్యేక భూ సేకరణ అధికారి నాగరాజు పర్యవేక్షణలో వీపనగండ్ల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ కాంత్, వనపర్తి డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌లతో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి భూపట్టాలను పొందిన రైతుల నుంచి వాగ్మూలం తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. సర్వే నంబర్ 357లోని ప్రభుత్వ భూమిలో పట్టాలు పొందిన కొందరు రైతులు పట్టాలు చూపించిన దాని కంటే మోకపై ఎక్కువగా సాగు చేసుకుంటున్నారని, అలా కాకుండా పట్టాదారుకు ఎంత భూమి ఉందో గుర్తించి ఎలాటి వివాదాస్పదం లేకుండా, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీపనగండ్ల ఆర్‌ఐ కురుమూర్తి, ఘనపూర్ ఆర్‌ఐ గణేష్ , చిన్నంబావి ఆర్‌ఐ రాములు, జూనియర్ అసిస్టెంట్లు మధు, రాజశేఖర్ ఉన్నారు.

## రైతు చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాపక్షం/నర్వః న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో శనివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ ఢిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీ పతి గౌడ్ పాల్గొని రైతుల కోసం ప్రత్యేక చట్టాలు రూపోందించాలని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతు నష్టపోయిన పంటకు నష్టపరిహారాన్ని పొందే హక్కు రైతులకు ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వాలు రైతులకు ప్రత్యేకించి చట్టాలను ఏర్పాటు చేసిందన్నారు. దామరగిద్ద మండల ఎఇఒ శివజ్యోతి మాట్లాడుతూ రైతుల పండించే పంటల కోసం ప్రత్యేకంగా క్రిమి సంహారక మందులను, పండించిన పంట సంరక్షణ చర్యలను తెలియజేశారు. టిటిడి న్యాయవాది రఘువీర్ యాదవ్ సదస్సులో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజల హక్కు అని తెలిపారు. ఈ సదస్సులో దామరగిద్ద పంచాయితీ సెక్రెటరీ తిరుపతి రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఆవు మృతి

### ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సూర్యగౌడ్ విజ్ఞప్తి

ప్రజాపక్షం/మల్దకల్ః జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలంలోని కుర్తిరావుల చెరువు గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ఈదురుగాలులు వీచిన సమయంలో కుర్తిరావుల చెరువు గ్రామ సూర్యగౌడ్‌కి సంబంధించిన ఆవు తన పంట పొలంలో ఒక్కసారిగా భారీ పిడుగు పడడంతో ఆవు మరణించడం జరిగింది. దీన్ని విలువ సుమారు 50 వేలు ఉంటుందని తెలిపారు. విషయం తెలిసిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.భగవంతు, కరుణాకర్ సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. రైతు సూర్యగౌడ్ కి ప్రభుత్వ ఆర్థిక పరంగా రావాల్సిన ఆర్థిక సహాయం పట్ల సహకరిస్తామని మనోధైర్యం కల్పించారు.

## కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ : కలెక్టర్




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించనున్న కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది అందరికి కూడా కౌంటింగ్ ప్రక్రియ పైన పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని తద్వారా జూన్ 4వ తేదీన నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ విజయవంతం చేసే బాధ్యత మీ పైననే ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ , ఇతర శిక్షణ అధికారులు బాలు యాదవ్ , బైకాని దూకుడు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

### హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ భవనంలో సుక్ష్మా పరిశీలకులు, పర్యవేక్షకులు, సహాయకులు, ఏఆర్‌ఓలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించారు. లెక్కింపు ప్రక్రియలో పాటించాల్సిన ఆయా అంశాలపై రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎలక్ట్రానిక్ మెషిన్ కౌంటింగ్‌కి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ జిల్లాలో ఓట్ల లెక్కింపునకు మొత్తం 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సెగ్మెంట్‌ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. లెక్కింపు ఉదయం 8:00 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

**ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓట్ల లెక్కింపు చేపట్టాలి..**

నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవిఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు అందుబాటులో ఉండి, సరి చేస్తారన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అన్ని సెగ్మెంట్‌లలో ఓట్ల లెక్కింపునకు ప్రతిహాల్‌లో 14 చొప్పున ఏర్పాటు చేస్తున్నామని, రౌండ్‌ల వారిగా లెక్కింపు జరుగుతుందని వివరించారు. ప్రతి టేపతి ఒక సుక్ష్మా పరిశీలకుడు, లెక్కింపు సూపర్‌వైజర్, సహాయకుడు ఉంటారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగడంలో సుక్ష్మా పరిశీలకుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. సుక్ష్మా పరిశీలకులు రౌండ్‌ల వారిగా ప్రతి రిపోర్ట్‌ను ఎన్నికల పరిశీలకులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లెక్కింపు ప్రక్రియలో ఏ సమస్య తలెత్తినా ఏఆర్‌ఓకు తెలపాలని సూచించారు. లెక్కింపు హాల్లోకి మొబైల్ ఫోన్‌లు అనుమతించబడవన్నారు. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అన్ని విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలను పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్ధతతో విధులు చేపట్టాలని స్పష్టం చేశారు.



**అప్రమత్తతో లెక్కింపు నిర్వహించాలి : అనుదీప్ దురిశెట్టి**



జిల్లా కలెక్టర్, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఈ సందర్భంగా వివి ప్యాట్ స్లిప్పుల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించిన ఆయా ప్రక్రియలను నిర్వహణ అంశాలను వివరించారు. లెక్కింపు సిబ్బంది ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సిఈఓ, అదనపు కమిషనర్ (యుబిడి), జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సునంద రాణి, ఏఆర్‌ఓలు, సుక్ష్మా పరిశీలకులు, లెక్కింపు పర్యవేక్షలు, సహకులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం ఉద్యోగుల బదిలీలు

### బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య
### తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ డిమాండ్



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : వేసవి సెలవులు ముగిసే లోపే రాష్ట్రంలోని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్ ఒక ప్రకటనలో కోరారు. మన రాష్ట్రంలోని ఉద్యోగులు అందరికి మేలు చేయాలని కోరుతున్నాం. గత ఆరు సంవత్సరాల క్రితం 2018లో ఉద్యోగులు బదిలీలు జరిగాయి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరగవాల్సిన సాధారణ ప్రక్రియలను గత ప్రభుత్వం చేపట్టలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్య సంవత్సరానికి ఇబ్బంది కాకుండా బదిలీలు చేపట్టాలని ఆదేశించినప్పటికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం చాలా బాధకరమన్నారు. ఈసీ అనుమతితో వెంటనే రాష్ట్ర ఉద్యోగుల బదిలీలు తక్షణమే చేపట్టాలని లేని పక్షంలో విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలతో కలిసి తగు కార్యాచరణ ప్రకటిస్తామని బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ అన్నారు.

## బిఎల్ఆర్ ట్రస్టుతో కమాన్ ఏర్పాటు

**పజాపక్షం/చర్లపల్లి:** నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎంఎల్‌ఏ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తా నుండి చిన్న చర్లపల్లి వెంకట్‌రెడ్డి నగర్ చౌరస్తా రోడ్డులో అనుని త్యం రద్దీతో ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు వెళ్లడంతో వైర్లు తెగిపోతున్నాయని, విద్యుత్ స్తంభాలను భారీ వాహనాలు ఢీ కొట్టడం జరుగుతుందని, పారిశ్రామిక వాడ ఉండడంతో అనేక వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయి చర్లపల్లి వాసులు ఇబ్బందులకు గురవుతుండడంతో కమాన్‌ను ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఏను కోరడంతో స్పందించిన ఆ యన తన బిఎల్ఆర్ ట్రస్టు ద్వారా కమాన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చర్లపల్లి వాసులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు,చర్లపల్లి వాసులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

**ప్రజాపక్షం శామీర్‌పేట :** మండలంలోని రైతులకు అందుబాటులో పచ్చిరొట్టెవిత్తనాలు ఉన్నాయని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్టె విత్తనాలైన జనుము, జీలుగా విత్తనాలపై 60 శాతం సబ్సిడీ ఉందని తెలిపారు. శామీర్‌పేట సోసైటిలో ఈ విత్తనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకవచ్చి విత్తనాలను పొందగలరని చెప్పారు. జనుము 40కిలోల బస్తా పూర్తిధర రూ.3620 సబ్సిడీ రూ. 2172 పోను రూ. 1448 రైతు ధర, జీలుగా 30 కిలోల పూర్తిధర రూ.2790సబ్సిడీ రూ. 1674 కాగా రైతుకు ఇచ్చే ధర రూ. 1116 ఉందని తెలిపారు. పచ్చిరొట్టె విత్తనాలు వేసిన తర్వాత 45 రోజులకు భూమిని కలియదున్నడం వలన భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అవకాశాన్నిరైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## ప్రతిగింజనూ కొనుగోలు చేస్తాం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులు పండించిన ప్రతిగింజను కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దని డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ సెంటర్‌ను సందర్శించారు. రైతులు తీసుకవచ్చిన వరి దాన్యాన్ని పరిశీలించారు. రోజుకు ఎన్ని సంచుల దాన్యం వస్తుందని సోసైటి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు సమీపిస్తున్నందున రైతులు తమ దాన్యాన్ని త్వరగా కేంద్రానికి తీసుకవచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తీసుకవచ్చిన దాన్యాన్ని మ్యాచరింగ్ చూసి కొనుగోలు చేయాలన్నారు. నాణ్యతగా ఉన్న గన్నీ బ్యాగులను రైతులకు పంపిణీ చేయాలన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దాన్యం సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట రైతుబంధు సమితి అధ్యక్షుడు కమతం కృష్ణారెడ్డి, మాజి ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, డైరక్టర్ నరేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వీరారెడ్డి, రాజు, రాంరెడ్డి, ఎల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, అలియాబాద్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి శనివారం సందర్శించారు. సెంటర్‌లో రైతుల నుంచి దాన్యం ఎంతమేరకు వచ్చింది అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతుల పండించిన వరి పంటను త్వరితగతిన కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని చెప్పారు. రైతులు దాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాన్యం సేకరణ జరుగాలని సూచించారు. తాలు పొట్టు విషయంలో ప్రభుత్వ నిబంధలన మేరకు దాన్యం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శామీర్‌పేట, అలియాబాద్‌లోని సెంటర్‌లలో రికార్డులను పరిశీలించారు. శామీర్‌పేట రైతుబంధు సమితి అధ్యక్షుడు కమతం కృష్ణారెడ్డి, ఆర్ఐ కుమార్, డైరక్టర్‌లు, రైతులు, సోసైటి సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవీందర్ తెలిపారు.చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని బిఎన్ రెడ్డి నగర్ 11 కెవి ఫీడర్‌ను 11 గంటల నుండి 12.30 గంటల వరకు నిలిపి వేయడంతో ఐడిఏ ఫేస్ 1లోని కొద్ది భాగం,బిఎన్ రెడ్డి కాలనీ,11 కెవి గజానన్ తంబా ఫీడర్‌ను 3 గంటల నుండి 4.30 గంటల వరకు నిలిపి వేయడంతో ఐడిఏ ఫేస్1లో, ఫేస్5లోని కొద్ది భాగం,బిఎన్‌రెడ్డి నగర్ ఇండస్ట్రీయల్‌లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

## ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమార్‌కు కాంస్య పతకం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** యూరప్ ఖండంలోని చెక్ రిపబ్లిక్ దేశంలో జరిగిన 52వ ప్రిక్స్ లిబరేషన్ ప్లెజెస్ 2024 క్రీడా పోటీల్లో రాచకొండ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఇనస్పెక్టర్ ప్రసన్న కుమార్ బృందం కాంస్య పతకాన్ని సాధించింది. ఈ నెల ఒకటో తేది నుండి 5 వరకు జరిగిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాచకొండ కమిషనరేట్ నుండి పోలీసుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా ఆ బృందం పాయింట్ 32 పిస్టల్ పురుషుల విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న ఇనస్పెక్టర్ ప్రసన్న కుమార్ విశిష్ట ప్రతిభ కనపరచి కాంస్య పతకాన్ని సాధించారు. క్రీడా పోటీల అనంతరం నగరానికి తిరిగి వచ్చిన ఇనస్పెక్టర్ ప్రసన్న కుమార్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి శనివారం అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆంకాక్షించారు.

## కొండల్‌రెడ్డికి డాక్టరేట్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి/మర్పల్లి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల నికి చేందిన సనగారి కొండల్‌రెడ్డి ఎస్‌కేఆర్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తోడ్పటు యువకులకోసం క్రీడ పోటీలలో సహకరం అందించడం ఎవరైన మరణిస్తే అంత్యక్రియలకు ఆర్థిక సహాయం ,చలివేంద్రల ఏర్పాటు ,లాక్ డౌన్‌లో నిరుపేదలకు ఉచితంగా రేషన్ సరుకులు, ప్రభుత్వ ప్రభుత్వేతర పరంగా ఎంతో మందికి సేవలందించిన ఎస్‌కేఆఱ చైర్మన్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి సేలను గుర్తించి తమిళనాడు గ్లోబల్ హ్యూమన్ ఫీస్ ఇంటర్నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ అద్వర్యంలో ఫీపుల్ ఫోరం ఫ్ ఇంటియా భరత్ సేవక్ సమాజ్ చైన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన వివిధ రంగాలలో పేవలు అందించిన ప్రముఖులకు డాక్టరేట్ ప్రధాన కార్యక్రమం నిర్వహించింది. హ్యూమన్ పీస్ సంస్థ ప్రశంసించి సేవలను గుర్తిస్తూ సమాజిక సేవరంగంలో గౌరవ డాక్టరేట్ పట్టను గ్లోబల్ హుమన్ ఫీస్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ మానుఏల్ , రిటైర్డ్ జడ్జి వైస్ చాన్సలర్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యునివర్సిటీ న్యాయమూర్తి డా.కె . వెంకటేశం చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఈ డాక్టరేట్‌తో తన బాధ్యత మరింత పెరిగిందని నేను చేస్తున్న సేవలను గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పేస్ యూనివర్సిటీ సంస్థ ప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెల్పుతే ఈ ఉత్సాహంతో తమ సేవాకార్యక్రమలను మరింత ముందుకు తీసుకుని వెళ్లాని జిల్లా ప్రజలకు సేవలు అందించుటకు తాను ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ప్రజలు అయకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన పాఠశాల భవనాలుగా తీర్చిదిద్దాలి



కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపల్, మండల పరిధిలోని కొంపల్లి, రామయ్యగూడ, కొటాలగూడ, కామారెడ్డి గూడ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ మాట్లడుతూ ప్రభుత్వం మహిళాసంఘాలపై ఉన్న నమ్మకంతో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకై బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. పాఠశాలల్లో చేపట్టిన వివిధ పనులకు అంచనాల మేరకు కొంత నిధులను ముందుగానే చెల్లించడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలలో చేపట్టే పనులె నాణ్యత ప్రమానాలతో కూడుకొని ఉండాలని కలెక్టర్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా మౌలిక సౌకర్యాలు అయిన మంచి నీటి సౌకర్యం ,టాయిలెట్స్ నిర్మాణాలు ,మరమ్మత్తులు ,విద్యుత్తు పనులను మంజురు అయిఐన నిధుల ద్వారా పక్కగా చేపట్టాలని అన్నారు. అమ్మ ఆదర్శ కింద వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకుంటు పాఠశాలల్లో కావాలసిన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తలుపులు ,కిటికీలు , గోడల పగుళ్ల ,సిలింగ్ పనులు ,వంటివి చేపట్టి కొత్త పాఠశాలల భవనాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. కొటాలగూడ పాఠశాలలో చేపడుతున్న పనులు కలెక్టర్ పరిశీలించిన పనులు నాణ్యతగా ఉన్నాయని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శాంతిబాయి, పనులు చేపడుతున్న బాల్‌రెడ్డి లను కలెక్టర్ అభినందించారు. చిన్న చిన్న పనులను చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఉంచారు. కలెక్టర్ ఆ కస్మిక తనికీలో భాగంగా వికారాబాద్ మండల ప్రత్యేక అ ధికారి జెడ్పి సీఇఓ సుధీర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అమ్మద్ ,ఎంపిడిఓ వినయ్‌కుమార్, మండల విద్యాధికారి బాబు సింగ్ , ఏంపిఓ నాగరాజు ,హెచ్ఎం మౌనిక ,వెంకట్‌రెడ్డి , రహిమబేగం, స్వరుప, శాంతాబాయి, సుజాత లతో పాటు సంబంధిత శాఖల అధికారుల పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలకు ఉచిత పాఠ్యపుస్తకాలు వస్తున్నాయి. 202425 సంవత్సరానికి సంబందించి జున్ 12న పున ప్రారంభంవరకు పాఠశాలలాకు రాష్ట్రం ప్రభుత్వం ముందగానే ప్రభుత్వ జెడ్పీ ,ఎయిడెడ్ , స్కుళ్లలో పార్ట్ వన్ కు సంబంధించిన 1నుండి 10వ తరగతివరకు పుస్తకలు, కేజీబిపీ, మోడల్‌స్కుల్ , గురుకలాల్లో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకులు అందించన్నుట్లు తెలుస్తుంది.డిఇఓల నుండి ప్రభుత్వం ఇండేంటు ను సేకరించింది. అందుకు అనుగుణంగా మండల రిసోర్స్ సెంటర్లకు తరలించనున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాకు సంబంధించిన పాఠ్యపుస్తకలు చేరినాట్లు జిల్లా మేనేజర్ వెంకటగిరి తెలిపారు.ప్రభుత్వనికి 52,7030 అవసరం అని పంపించడం జరగింది , అందులో భగంగా అప్పటివరకు జిల్లా కు338810 , 188220, జిల్లాకు 80శాతం పుస్తకాలు వచ్చాయని తెలిపారు. ఇందులో పార్టు1 ,ఫార్టు2 పుస్తకాల ముద్రణ , పాఠశాలలోని విద్యార్థులకు అంగ్లము తెలుగు మాధ్యమాల్లో పుస్తకులను తయారుచేశారు . ఒక వైపు ఇంగ్లిష మరో వైపు తెలుగు ఉండే విధంగా తయారు చేశారు. ప్రస్తుతం ఫార్ట 1మత్రమే వచ్చాయి ఇందులో 80శాతం పుస్తకాలు వచ్చాయినఅని అన్నారు. మిగితవి పాఠశాల ప్రారంభం వరకు వస్తాయని అన్నారు. గతంలో తెలుగు ఇంగ్లిష మీడియం పుస్తకాల వేర్వేరుగా ఉండేవి. ఇప్పుడు ఇంగ్లిష్ ,తెలుగు మాధ్యమంలో రెండు పుస్తకాలను ఫార్ట్ 1 గా ఇవ్వడం వల్ల విద్యార్థులకు తకమక పడకుండా ఎ సెక్షన్ అయితే తీసుకుంటరో ఆ సెక్షన్ సంబంధించిన పాఠ్య పుస్తకాలను సులభతరంగా అర్థం చేసుకోని చదువుకునే విధంగా రూపొందించారు. అంతే కాకుండా బుక్ పర్ నాట్ సేల్ అనే నినాదంలో పాటు కొత్తగా క్యూర్ కోడ ను కూడా అచ్చువేసి ఇస్తున్నారు. విద్యార్థులు నెట్ ద్వారా చూసే వేసులుబాటును సైతం కల్పించారు.



## మౌలిక వసతులు కల్పించాలి

ఎఐవైఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోగా మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయటం ద్వారా మౌలిక వసతులు కల్పించాలని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, గిరిబాబు, బాల సంఘం నేతలు మహేష్, కిరణ్, అజీమ్ తదితరులతో కల్సి ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర, సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ తాము సందర్శించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా సంస్థల్లో మౌలిక వసతులు సక్రమంగా ఉండే విధంగా మరమ్మత్తులు, కొత్త వాటి కొనుగోలు కోసం అవసరమైన నిధులు మంజూరు చేయటమే కాకా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే ఏర్పాటు చేయాలన్నారు.

## కెపిహెచ్‌బి కాలనీలో పార్కుల పరిశీలన



**మన తెలంగాణ/బచ్చన్నపేట:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో నెలకొన్న పలు పార్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం పార్కులను సందర్శించారు. పార్కుల నిర్వహణ, పార్కులలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా అవసరాల పేరుతో కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో అవసరాలు లేనప్పటికీ గత ప్రభుత్వ నాయకులు ఖాళీ స్థలాలను కమిషన్ల కోసం పార్కులను నిర్మించారని ఆరోపించారు. నిర్మించిన పార్కుల నిర్వహణ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో జరగాలని, అయితే ఇక్కడ మాత్రం బిఆర్ఎస్ నాయకులు పార్కులో తిష్ట వేసి సొంత జాగరుగా వాడుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాక కేపీహెచ్ బిఎల్ఐజి ఫ్లాట్స్ ప్రాంతంలోని పార్కుల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే జిహెచ్ఎంసి అధికారులు పార్కులను పరిశీలించి, ప్రజా అవసరాల కోసం వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ పార్కుల విషయాన్ని తాము జిహెచ్ఎంసి అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని శేరి సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్ బి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రాజు, మహిళా అధ్యక్షురాలు పొన్నం రజిత గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, ఫణీంద్ర కుమార్,మేకల మేకలు, నాగమల్లేశ్వర రావు, బాబ్జి, నితీష్ కుమార్ గౌడ్, కిరణ్, సాయి తేజ గౌడ్, అరవింద్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండల్ యాదవ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నవాబుపేట:** కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండలు యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన నివాసంలో వేడుకల ఘనంగా సాగాయి. చేవెళ్ల ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ కొండల్ యాదవ్ ని శాలువా కప్పి కేక్ కట్ చేయించారు. నవాబుపేట మండలం వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేడుకల్లో హజరయ్యారు. జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా పలువురు తీసుకొచ్చిన కేక్‌లను కట్ చేయించి ఆయనకు తినిపించారు. శాలువాలు కప్పి, బొకేలు, జ్ఞాపికలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తనపై ఇంత ప్రేమభిమానాలు చూపించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/పోచారం :** కష్టాల్లో ఉన్న వారికి తోచిన సహయం చేసి మానవత్వాని చాటుకోవాలని ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ గ్రామానికి చెందిన శివ రాత్రి లింగస్వామి గత చాలరోజులనుండి పక్షవాతంతో బాధపడుతుండగా చూసి 20వేలు, అదే గ్రామానికి చెందిన ఎన్ వెంకన్న కుటుంబానికి 10 వేలు ఆర్థిక సాయం ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డి జన్మదిన సందర్భంగా నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. సామల సందీప్ రెడ్డి ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువజన సంఘాల నాయకులు, ఎస్ఎస్ఆర్ టీం సభ్యులుపాల్గొన్నారు.

## ప్రాసెసింగ్ క్లస్టర్ యూనిట్లతో రైతులకు లాభార్జన

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** వివిధ కారణాల వల్ల ప్రతి ఏటా పండ్లు, కూరగాయ లు వ్యర్థం అవటాన్ని అరికట్టటం ద్వారా రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంగా క్లస్టర్ పనులు దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. పండ్లు, కూరగాయలకు ధరలు పడి పోయి గిట్టు బాటు ధర రాని సమయంలో వాటిని కట్ చేసి ప్యూరీ, పౌడర్, చట్నీలు తయారు చేసి మార్కెటింగ్ చేయటం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చని ఆయన తెలిపారు. దీని కోసం పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ చేసి ప్యూరీ, పౌడర్లు, సాస్, కట్ ఫ్రూట్స్, చట్నీలు తయారు చేసేందుకు ప్రాసెసింగ్ క్లస్టర్ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరమయ్యే యంత్రాలు సమకూర్చటం, వాటి తయారు చేసే పనులకు అవసరమయ్యే ఆర్థిక సహకారం చేసేందుకు సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నోడల్ ఏజన్సీగా వ్యవహరించి సహకరిస్తుందని ఆయన తెలిపారు. ఈ విధంగా పూడూరు గ్రామంలో ఆదర్శ రైతు సేవా సహకార సంఘం సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి పథకం కింద సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (MSME)ఆర్థిక సహాయంతో కూరగాయలు, పండ్లు ప్రాసెసింగ్ క్లస్టర్ యూనిట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నీరజ గాంధీ, ఎంఎస్ఎంఇ అధికారి సూర్య ప్రకాష్ గౌడ్, ఆదర్శ రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు విశిష్టసేవలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** సహకార బ్యాంకులపై ఆర్‌బిఐతో ఒత్తిడి తేవటం ద్వారా బలహీన పరచే ప్రభుత్వ పాలకుల యత్నాలను తిప్పి కొడుతూ నేటికీ అగ్రస్థానంలో కొనసాగుతున్న ఉమ్మడి రాష్ట్ర విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు సేవలు కొనియాడదగినవని ఆర్‌బిఐ విశ్రాంత అధికారి ఆర్ఎం వైద్యనాథం అన్నారు. బ్యాంకు 109 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా శనివారం స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన నాగోల్ బ్రాంచ్ మహా జనసభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశంలో 1904లోనే సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ప్రారంభమైందని, దేశానికి స్వాతంత్రం వచ్చేనాటికి దేశంలో 2000 సహకార బ్యాంకులు ఉన్నాయన్నారు. విశిష్టమైన సేవలందించే సహకార బ్యాంకులను నిబంధనల పేరిట బలహీన పరచేందుకు ప్రభుత్వాలు ఆర్‌బిఐని అస్త్రంగా వినియోగించారన్నారు. సహకార బ్యాంకులను రక్షించుకొనే బాధ్యత ప్రజలదే అని ఆయన అన్నారు. బ్యాంకు డైరెక్టర్ జెవి సత్యనారాయణ మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాదారులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ ముందుకు వెళుతోందన్నారు. ప్రమాద బీమా. ఆరోగ్య బీమా, విద్యావంతులకు ప్రోత్సాహక పథకాలు, సులభతరమైన రుణాలు, వీధి వ్యాపారులకు వారి చెంతే రుణ సౌకర్యం లాంటి అనేక పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. తమ 52 సహకార బ్యాంకు శాఖలకు 14 సొంత భవనాలు కల్గి ఉన్నాయన్నారు. డైరెక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ తమ బ్యాంకులో రుణాలు తీసుకొని సకాలంలో తిరిగి చెల్లించిన వారికి నాలుగు శాతం తిరిగి ఇస్తున్నామన్నారు. నాగోల్ విశాఖ బ్రాంచ్ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా నారాయణరెడ్డి, గోవిందరావు, సుధాకర్‌రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, ఎంవి మూర్తి, నాగజ్యోతిలను ఎన్నుకొన్నారు.

## ధనుంజయ డయాగ్నస్టిక్ సెంటర్ సీజ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ఉప్పల్‌లో నిర్వహిస్తున్న ఓ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని(డయాగ్నస్టిక్ సెంటర్) శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు తాళాలు వేసి సీజ్ చేసారు. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజి సమీపంలో ఉన్న ధనుంజయ డయాగ్నస్టిక్ సెంటర్‌పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రఘునాథస్వామి, కీసర ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎన్. నారాయణరావు, డా.చంద్రకళ, ఉప్పల్‌లోని వైద్యాధికారిణి డా.సౌందర్యలత, శ్రీనివాస్‌లు ఈ సెంటర్లపై ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆ సెంటర్లలో గర్భ నిర్ధారణ ప్రక్రియలకు సంబంధించిన నిబంధనలను పాటించక పోవటం, అందుబాటులో సంబంధిత రిజిస్టర్లు సక్రమంగా లేకపోవటం, ఫారం ఎఫ్, స్కాన్ చేస్తున్న చేస్తున్న వైద్యులు సంతకాలు చేయని నిర్ధారణ నివేదికలు ఉండటంలాంటి ప్రభుత్వ నిబంధనలను పాటించక పోవటాన్ని అధికారులు గుర్తించి ఆ సెంటర్‌ను సీజ్ చేసారు. జిల్లాలో గర్భ నిర్ధారిత స్కానింగ్‌లు, సరైన దస్తావేజులు లేని పక్షంలో ప్రీ కాన్సెప్షన్ మరియు ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్ యాక్ట్ 1994 క్రింద కఠినమైన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రఘునాథస్వామి హెచ్చరించారు.

# క్రీడ

## అభిషేక్ అదుర్స్

### టీమ్ఇండియాకు అతడే బలం!

**హైదరాబాద్:** ఐపిఎల్ హిస్టరీలో మూడోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపిఎల్ ఫైనల్ ఆడబోతోంది. మే 24న రాజస్థాన్‌తో జరిగిన క్వాలిఫైయర్ 2లో అద్భుత విజయంతో ఫైనల్‌లో అడుగుపెట్టింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటింగ్‌లో రాణించకపోయినా, తన స్పిన్‌తో అదరగొట్టాడు. హైదరాబాద్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో చెపాక్‌లోని పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ అభిషేక్ చేసిన బౌలింగ్‌కి ప్రశంసలు కురుస్తున్నాయి. రాజస్థాన్ కీలక బ్యాటర్లు సంజూ శాంసన్, ప్రమాదకర హిట్టర్ షిమ్రాన్ హెట్‌మెయర్ వికెట్లు పడగొట్టాడు. 4 ఓవర్లలో కేవలం 24 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు.



**అభిషేక్ అరుదైన ప్యాకేజీ:** ఆస్ట్రేలియన్ మాజీ క్రికెటర్, ఎస్‌ఆర్‌హెచ్ మాజీ ప్రధాన కోచ్, టామ్ మూడీ అభిషేక్‌ను ప్రశంసించాడు. టీమ్‌లో ఏ రోల్ ఇచ్చినా అభిషేక్ నిర్వహించడానికి సిద్ధంగా ఉంటాడని చెప్పాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ చేసే టాపార్డర్ బ్యాటర్ చాలా అరుదు అని, అతడు మరింత ఎక్కువ బౌలింగ్ చేయాలని మూడీ పేర్కొన్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో 14 మ్యాచుల్లో అభిషేక్ కేవలం మూడు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. అలానే 156 వైట్‌బాల్ మ్యాచ్‌లలో (లిస్టు ఎ, టి20లు) 91 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయడం గమనార్హం.

**నాథన్ లియాన్‌తో పోలిక:** అతడు డొమెస్టిక్ క్రికెట్‌లో ఎక్కువగా బౌలింగ్ చేయట్లేదు. కానీ భారత క్రికెట్ భవిష్యత్తు కోసం, అతను బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది' అని ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. అంతే కాదు అభిషేక్‌ని నాథన్ లియోన్‌తో పోల్చాడు. ఇద్దరూ ఓవర్‌స్పిన్ , డిప్‌ని జనరేట్ చేయడానికి బంతిని ఫ్లైటింగ్ చేసే అప్రోచ్‌ని వివరించాడు. క్యారమ్ బాల్‌ను ఎగ్జిక్యూట్ చేయడంలో అభిషేక్ ప్రావీణ్యం ఉందని, అతను దాని కోసం చాల కాలం ప్రయత్నించడాన్ని ప్రశంసించాడు. హెట్‌మెయర్‌ని ఔట్ చేసిన డెలివరీ ఒక అద్భుతమైన ఉదాహరణగా పేర్కొన్నాడు.

**యువీ కంటే బెటర్ బౌలర్? :** ఇక తన బౌలింగ్ గురించి అభిషేక్ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. 'నా బౌలింగ్ గురించి నేను యువీ పాజీతో మాట్లాడినప్పుడల్లా, నేను అతని కంటే మెరుగైన బౌలర్‌ను కాగలనని చెబుతాడు. ఆ మాటలు ఎప్పుడూ నా మనస్సులో ఉంటాయి. నా ప్రదర్శనతో యువీ పాజీ నిజంగా సంతోషంగా ఉంటాడు' అని చెప్పాడు. కాగా, 2024 ఐపీఎల్ మొత్తం అభిషేక్ శర్మ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. 15 ఇన్నింగ్స్‌లలో 207.75 స్ట్రైక్‌రేటుతో 482 పరుగులు చేశాడు. ఇందులో 36 ఫోర్లు, 42 సిక్సులు ఉన్నాయి. లీగ్‌లో ఎస్‌ఆర్‌హెచ్ ఫైనల్ వరకు రావడంలో అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషించాడు.

## మా గేమ్ ప్లాన్ మారింది!

### వరల్డ్‌కప్‌లో కొత్త పాకిస్థాన్‌ను చూస్తారు




**న్యూఢిల్లీ :** టీ20 వరల్ కప్‌లో భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ కోసం క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘ ఐపిఎల్ టోర్నీనే భారత జట్టు బెస్ట్ ప్రిపరేషన్‌గా భావిస్తోంది. ఒక్క వార్మప్ మ్యాచ్ తర్వాత టి20 ప్రపంచకప్ బరిలోకి దిగుతోంది. మరోవైపు పాకిస్థాన్ వరుసగా ఇంటర్నేషనల్ టి20 సిరీస్‌లు ఆడుతోంది. ఇటీవలే ఐర్లాండ్‌తో 3 మ్యాచ్‌ల టి20 సిరీస్‌ని 21తో గెలుచుకుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో 4 మ్యాచ్‌ల టి20 సిరీస్ ఆడుతోంది. తాజాగా వరల్ కప్ సన్నాహాలపై పాక్ స్టార్ బ్యాటర్ ఫఖర్ జమాన్ ఓ స్పోర్ట్ ఛానెల్‌తో మాట్లాడాడు. మెగా టోర్నీలో తమ గేమ్ ప్లాన్ ఎలా ఉండబోతోందో చెప్పాడు. 'ఐర్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత, మా మైండ్‌సెట్, బాడీ లాంగ్వేజ్ చాలా మారాయి. ఎవరూ ఓడిపోవడానికి ఇష్టపడరు. మేము దాన్ని అర్థం చేసుకున్నాం. ఆ మొదటి మ్యాచ్ తర్వాత, మారిన మా మైండ్ సెట్ కంటిన్యూ అయితే, కొత్త పాకిస్థాన్‌ని చూస్తారు. ప్రతి గేమ్ తర్వాత మీటింగ్స్ ఉంటాయి. ఇప్పుడు మా ఆలోచనంతా మొదట బ్యాటింగ్ చేస్తే, 200కి పై గా స్కోర్ చేయడంపైనే ఉంటుంది. వరల్ కప్‌లో మా బ్యాటింగ్ గురించి చర్చలు జరుగుతాయి. మా బౌలింగ్ కూడా వరల్ క్లాస్' అని చెప్పాడు.

**పాక్ కొత్త కోచ్ గ్యారీ కిర్‌స్టన్**

టీ20 వరల్ కప్‌కి ముందు కిర్‌స్టన్ పాక్‌కి కోచ్‌గా ఎంపికవ్వడంపై ఫ ఖర్ స్పందించాడు. 'గ్యారీ చాలా గొప్ప వ్యక్తి. అ తను కొత్తవాడు. కానీ అతను కొత్త అని మాకు అనిపి ంచలేదు. ఎందుకంటే అతను వచ్చిన రోజే టీ మ్‌తో కలిసిపోయాడు. అతను అందరితో మాట్లాడడానికి ఇష్టపడతాడు. అతనితో పని చేయడానికి చాలా సంతోషిస్తున్నాం. అతడికి అంత సమయం లేదు. కానీ అతని మనస్తత్వం, స్నేహితుల్లా కూ ర్చుని మాతో మాట్లాడే విధానం, నాకు నచ్చింది. ప్రపంచకప్ చాలా దగ్గరగా ఉంది. ప్రస్తుతం ఎవరి మాటను( బ్యాటింగ్ సూచనలు గురించి) సరిగ్గా వినను. అది అంత సులభం కాదు. నేను ఇప్పుడు ఎలా ఉన్నానో, అలానే వరల్ కప్ ఆడుతాను. ఆ తర్వాత అతనితో కలిసి పని చేస్తాను' అని చెప్పాడు.

**వైస్ కెప్టెన్సీకి అఫ్రిదీ నో**

పాక్ టీ20 వరల్ కప్ టీమ్‌కి బాబర్ అజామ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాలని వచ్చిన ఆఫర్‌ను స్టార్ బౌలర్ షాహీన్ అఫ్రిదీ తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతానికి అధికారికంగా పాక్ జట్టుకు వైస్ కెప్టెన్ లేదు. అంతకుముందు ఒక టీ20 సిరీస్‌లో పాకిస్థాన్‌కు అఫ్రిది కెప్టెన్సీ చేశాడు. అనంతరం తొలగించారు. ఈ నేపథ్యంలో వైస్ కెప్టెన్సీ తిరస్కరించినట్లు భావిస్తున్నారు. కెప్టెన్‌గా తనను తొలగించడానికి గల కారణాలను తనకు ఎప్పుడూ సరిగా వివరించలేదని అఫ్రిదీ భావించినట్లు కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి.

# రీల్



## 'అఖండ 2' పై కొత్త అప్ డేట్

అఖండ 2 సినిమా షూటింగ్ ఎప్పుడు అంటూ బాలయ్య ఫ్యాన్స్ పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే, ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పై తాజాగా ఓ అప్ డేట్ వినిపిస్తోంది. ఫస్ట్ డ్రాఫ్ట్ స్క్రిప్టు పూర్తి అయ్యింది అని, బోయపాటి శ్రీను ప్రస్తుతం తన రైటింగ్ టీమ్ తో బెటర్ మెంట్స్ కోసం కసరత్తులు చేస్తున్నాడని తెలుస్తోంది. పాటల రచయిత కళ్యాణ్ చక్రవర్తి కూడా ఈ సినిమా స్క్రిప్ట్ టీమ్ లో వర్క్ చేస్తున్నారట. ఇక రెండు నెలల తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను స్టార్ట్ చేయాలని బోయపాటి ప్లాన్ చేస్తున్నాడు. అఖండ 2 కోసం అరకు, కొచ్చి లాంటి ప్రదేశాల్లో కొన్ని అద్భుతమైన లోకేషన్స్ను మూవీ యూనిట్ పరిశీలించిందట. ఇక కథ ప్రకారం.. సినిమా పూర్తిగా శైవత్వంపై సాగుతుందని.. హిందుత్వానికి ప్రతిరూపం దక్షిణ భారతదేశం అనే కోణంలో సీన్స్ ఉంటాయని తెలుస్తోంది. అలాగే..హిందూ దేవాలయాలకు సంబదించిన లింక్స్ తో పాటు దక్షిణ భారత దేశం గొప్పతనాన్ని కూడా ఈ సినిమాలో బాగా ఎలివేట్ చేస్తున్నారని తెలుస్తోంది. 'అఖండ 2' లో బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ కూడా ఓ కీలక పాత్రలో నటించబోతునట్లు తెలుస్తోంది.



## 'గాడ్ ఫాదర్' కాంబినేషన్‌పై లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ అప్డేట్.!

లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు వశిష్ట కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న భారీ చిత్రం విశ్వంభర కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా తర్వాత చిరు మరోసారి గాడ్ ఫాదర్ దర్శకుడు మోహన్ రాజా తో కలిసి వర్క్ చేయనున్నారు అని ఇంట్రెస్టింగ్ బజ్ రీసెంట్ గానే మొదలైంది. ఇక ఇప్పుడు మరిన్ని డీటెయిల్స్ వినిపిస్తున్నాయి. ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉందట. అలాగే ఈ రానున్న జూన్ మొదటి వారంలోనే సినిమాపై ఆఫీషియల్ అనౌన్స్మెంట్ అందిస్తారని వినిపిస్తోంది. అంతే కాకుండా సినిమా రెగ్యులర్ షూట్ ఈ ఆగస్ట్ నుంచే మొదలు కానున్నట్టు తమిళ సినీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి అయితే పక్కా ప్లానింగ్ ప్రకారం మెగాస్టార్ నెక్స్ట్ వెళుతుంది అని చెప్పాలి. ఇక ఈ ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ సంబంధించి మరిన్ని డీటెయిల్స్ రావాల్సి ఉంది.

## టాక్.. మరోసారి ఫిదా కాంబినేషన్?





మన టాలీవుడ్ లో ఉన్నటువంటి కొన్ని క్రేజీ హిట్ కాంబినేషన్ లలో మ్యాజికల్ దర్శకుడు శేఖర్ కమ్ముల అలాగే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ల కాంబినేషన్ కూడా ఒకటి. మరి కలయికలో వచ్చిన ప్రేమ కథా చిత్రం ఫిదా సెన్సేషనల్ హిట్ అయ్యింది. అంతే కాకుండా హీరోయిన్ గా సాయి పల్లవి కి కూడా టాలీవుడ్ లో భారీ వెల్కం దక్కింది. అయితే లేటెస్ట్ గా కొన్ని రూమర్స్ మళ్లీ ఫిదా కాంబినేషన్ రిపీట్ కానున్నట్టుగా చెబుతున్నాయి. అయితే ఈ ముగ్గురూ కాదు కాని శేఖర్ కమ్ముల, వరుణ్ తేజ్ కలయికలో ఓ బ్యూటిఫుల్ సినిమా ఉండబోతుంది అని వినిపిస్తోంది. మరి ఈ హిట్ కాంబినేషన్ సంబంధించి మరిన్ని డీటెయిల్స్ రావాల్సి ఉన్నాయి. ఇక ప్రస్తుతం వరుణ్ తేజ్ తన మట్కా సినిమాలో బిజీగా ఉండగా, సాయి పల్లవి బాలీవుడ్ లో రామాయణం, తెలుగులో 'తండేల్ లాంటి భారీ చిత్రాలు చేస్తోంది. అలాగే శేఖర్ కమ్ముల కోలీవుడ్ హీరో ధనుష్ తో కుబేర లో బిజీగా ఉన్నారు.

## శర్వానంద్ నెక్ట్స మూవీ పై లేటెస్ట్ అప్డేట్!



శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన శర్వానంద్ చిత్రం మనమే జూన్ 7, 2024న థియేటర్లలో విడుదల కానుంది. ఇదిలా ఉండగా, అతని మరో ప్రాజెక్ట్ (శర్వా 37) ఇటీవల చర్చనీయాంశమైంది. లూజర్ వెబ్ సిరీస్కి పేరుగాంచిన అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఇటీవలే శర్వానంద్, ప్రముఖ నటుడు రాజశేఖర్, బ్రహ్మాజీలతో షూటింగ్ షెడ్యూల్ను పూర్తి చేయడంతో ఈ చిత్రం దృష్టిని ఆకర్షించింది. ఇప్పటికే సగానికి పైగా చిత్రీకరణ చేయగా, మిగిలిన పార్టను వచ్చే షెడ్యూల్లో పూర్తి చేయనున్నారు. తదుపరి దశ చిత్రీకరణ వచ్చే నెలలో ప్రారంభం కానుందని సమాచారం. ఈ సినిమాలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ నటిస్తుంది. ప్రముఖ స్వరకర్త జిబ్రాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ పై నిర్మిస్తున్నారు..



## ఢిల్లీలో భూసేకరణ చర్యలకు సుప్రీం సమర్ధన

న్యూఢిల్లీ : ఢిల్లీలో అభివృద్ధి పనుల నిమిత్తం 1957 నుండి 2006 వ సంవత్సరం వరకూ వివిధ ప్రభుత్వ అభివృద్ధి సంస్థలు సేకరించిన భూముల సేకరణను సుప్రీంకోర్టు సమర్ధించింది. ఢిల్లీ డవలప్‌మెంట్ అథారిటీ, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్, ఈస్ట్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ ఫర్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ సేకరించిన భూముల ప్రయోజనాన్ని కోర్టు సమర్ధించింది. 1894లో ఢిల్లీ ప్రభుత్వం ఈ భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. దేశరాజధానిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం ఈ సేకరణ లక్ష్యం. యాభైఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానంలో వివిధ సెక్షన్ల కింద అనేక నోటిఫికేషన్లను ప్రభుత్వం జారీ చేసింది. దీనిపై వందలాది పిటిషన్లు కోర్టులో దాఖలయ్యాయి. కోర్టు వీటిపై వాదనలు విన్న తర్వాత ఈ తీర్పు చెప్పింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం మే 17న తీర్పు చెబుతూ, ఢిల్లీ హైకోర్టు తీర్పును పక్కకు నెట్టేశారు. ఈ సేకరణ ప్రక్రియకు సంబంధించిన కాల పరిమితి 2013 నాటి భూ సేకరణ, పునరావాస చట్టం సెక్షన్ 24 (2) కింద ముగిసిపోయిందని ఢిల్లీ హైకోర్టు తొలుత పేర్కొంది.




## ఫ్రాన్స్‌లో సమ్మె: వందలాది విమానాలు రద్దు

**పారిస్ :** ఫ్రాన్స్‌లో పౌర విమానయాన సిబ్బంది శనివారం సమ్మె చేశారు. దీంతో 70 శాతం విమానాలు గాల్లోకి ఎగరకుండా కిందే ఉండిపోయాయి. వందలాది విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకూ ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఈ సమ్మెతో పారిస్‌లో నిత్యం తీవ్రమైన రద్దీగా ఉండే ఓర్లీ విమానాశ్రయం నిశ్శబ్దంగా ఉండిపోయింది. సిబ్బంది కదలికలు లేకపపోవడంలో అంతా నిర్మానుష్యంగా మారింది. మరో 56 రోజుల్లో ఫ్రాన్స్‌లో ఒలింపిక్స్ ఎన్నికల సందోహం ప్రారంభం కానున్నది. ఈ దశలో విమాన సిబ్బంది సమ్మె ప్రభుత్వానికిఅశనిపాతంగా మారింది. వర్కింగ్ కండిషన్స్, భద్రత గురించి సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

### నియోజకవర్గాల వారీగా ఐదు దశల ఓటింగ్ డేటా

## వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసిన ఇసి



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో మొదటి ఐదు దశల్లో జరిగిన పోలింగ్ వివరాలను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఎంతమంది ఓటర్లు తమ ఓటుహక్కు ఉపయోగించుకున్నారన్న విషయాల వివరాలను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం జరగలేదని ఈ సందర్భంగా ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. మొదటి ఐదు దశల్లోనూ జరిగిన పోలింగ్ వివరాలను నియోజకవర్గాల వారీగా విడుదల చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభ ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ గణాంకాలను వెబ్‌సైటులో 48 గంటల వ్యవధిలో పోస్టుచేసేలా భారత ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించిన తర్వాత ఎన్నికల సంఘం ఈ గణాంకాలను విడుదల చేస్తూ, దేశంలో ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు, తప్పుడు కథనాలు సృష్టించి, మోసపూరితమైన చర్యలకు పాల్పడే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించింది.పోలింగ్ పూర్తయిన 48 గంటల వ్యవధిలోనే వెబ్‌సైటు ద్వారా తెలియజేసేవిధంగా ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని స్వచ్ఛంధ సంస్థ 'అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్' (ఎడిఆర్) చేసిన విజ్ఞప్తి మేరకు సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఎన్నికల సంఘం దాఖలు చేసిన 225 పేజీల అఫిడవిట్‌లో కూడా పోలింగ్‌ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడింది. ఈ పూర్వరంగంలో నియోజకవర్గాల వారీగా మొత్తం 329 నియోజకవర్గాలకు సంబంధించి ఎంత మంది ఓటర్లు ప్రతి నియోజకవర్గంలో ఓట్లు వేశారనే వివరాలు తన వెబ్‌సైటు ద్వారా విడుదల చేసింది. ఆరోదశ ఎన్నికల ప్రక్రియ శనివారంనాడే జరిగింది. ఇదే రోజున మొదటి ఐదు దశలలో ఓటర్లు ఎంతమంది ఓట్లు వేశారన్న సమాచారాన్ని వెబ్‌సైటులో ఎన్నికల సంఘం అప్‌లోడ్ చేసింది. ఇకమీదట ఈ ఓటర్ టర్నౌట్ వివరాలను మరింత స్పష్టంగా వివరంగా తెలియజేసేందుకు తాము ప్రచురించే చార్జుల విధానాన్ని విస్తరిస్తామని కూడా తెలియజేసింది. ఎంతమంది మొత్తం ఓటర్లు ఉన్నారు, ఎంతమంది ఓట్లు వేశారు, ఎంత శాతం ఓట్లు వేశారు అనే వివరాలను ఎడిఆర్ తన పిటిషన్‌లో సుప్రీంకోర్టుద్వారా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. ఐతే నియోజకవర్గాల వారీగా ఓటర్లసంఖ్య, శాతాన్ని బట్టి ఎంతమంది ఓట్లు వేశారన్న వివరాలు సులభంగా తెలుసుకోవచ్చునని పేర్కొంది.



## అలరించిన శ్రీనిక కూచిపూడి నృత్యం

హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శనివారం జరిగిన సంగీత నృత్యోత్సవంలో చింతా వెంకట్ శిష్యురాలు ఎ. శ్రీనిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. తాళ్లపాక అన్నమాచార్యులు 616వ జయంతి సందర్భంగా శ్రీవైష్ణవీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నమాచార్య కీర్తనల సంగీత, నృత్య ప్రదర్శనలు జరిగాయి.'జగదభి రామ.. సహస్ర నామ' కీర్తనపై శ్రీనిక ప్రదర్శించిన నృత్యం సభికులను అలరించింది. (పక్కన) నిర్వాహకుల నుంచి అవార్డును అందుకుంటున్న దృశ్యం.

## ప్రధాని పదవి హుందా మరచిన మోదీ

### యుపి ర్యాలీలో ప్రియాంకా విమర్శలు



**గోరఖ్‌పూర్ :** ప్రధానమంత్రి మోదీ ఆ పదవి హుందాను, గౌరవాన్ని కాపాడటంలేదని, ఆ పదవి హుందా కాపాడాలని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. శనివారం ఉదయం ఉత్తర ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ, దేశ ప్రజలు ప్రధానమంత్రి పదవికి ఎంతో గౌరవం ఇస్తారనీ, ఆ గౌరవాన్ని ఆయన కాపాడాలని హితవు చెప్పారు. అదేవిధంగా ''ఇండియా'' కూటమిని లక్ష్యంగా చేసుకుని 'ముజ్రా' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. దేశంలో ఇంతవరకూ ఏ ప్రధానమంత్రీ కూడా ప్రతిపక్ష నాయకులపై ఆ విధమైన పదాలను ఉపయోగించి విమర్శించలేదని, మోదీ ప్రధానమంత్రి పదవీ గౌరవాన్ని విస్మరించారనీ విమర్శించారు. భయంతో వణకిపోతున్న ప్రధానమంత్రి దేశానికి, ప్రజలకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానన్న విషయం మరచిపోయారని అన్నారు. 'ముజ్రా' లాంటి పదాలు ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి నోటి నుండి రాకూడదని ఆమె అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు ఉన్న రిజర్వేషన్లను ముస్లింలకు ఇచ్చేందుకు, తద్వారా ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిలను బానిసలుగా మార్చి ముజ్రాలు చేసేందుకు 'ఇండియా' కూటమి చేసే కుట్రలను తాను అడ్డుకుంటానని అంతకుముందు ప్రధామంత్రి నరేంద్రమోదీ బీహార్‌లో జరిగిన పలు ఎన్నికల ప్రచార సభల్లో చేసిన ప్రసంగాలను ప్రియాంకాగాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి ప్రియాంకాగాంధీ గోరఖ్‌పూర్, బాన్స్‌గాన్‌లలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. 'ఇండియా' కూటమి అభ్యర్థి కాజల్ నిషాద్, సాదల్ ప్రసాద్‌లకు ఓటు వేయాలని కోరుతూ ఆమె బహిరంగ సభల్లో ప్రసంగించారు.

## ముగిసిన 'క్రియేటివ్ చైల్డ్ సెంటర్ సమ్మర్ క్యాంప్'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హిమాయత్ నగర్‌లోని ఆక్స్‌ఫర్ట్ గ్రామర్ హైస్కూల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిబిరం( 'క్రియేటివ్ చైల్ సెంటర్') శనివారంతో ముగిసింది. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రేడ్ నర్సరీ నుండి 6వ తరగతి విద్యార్థులు ఆర్ట్స్, క్రాఫ్ట్స్, యోగాతో సహా అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిమ్నాస్టిక్స్, డ్యాన్స్, సంగీతం, జుంబా ఫిట్నెస్, అవుట్‌డోర్, ఇండోర్ క్రీడల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన శిబిరం ముగింపు వేడులకల్లో పాల్గొన్న స్కూల్ డైరెక్టర్, వైస్ చైర్‌పర్సన్ మణికొండ ప్రార్థన మాట్లాడుతూ తమ విద్యార్థులు సహజసిద్ధమైన ప్రతిభను చాటేందుకు. ప్రయత్నాలు చేస్తున్నామని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ఆసక్తిని, వారి నైపుణ్యాలను గుర్తించాలన్నారు. తద్వారా వారు లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఈ ఏడాది పలు అద్భుతమైన ఈవెంట్ల కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. నేర్చుకుని తమ పనితీరును మెరుగు పరచుకోవడంలో నిబద్ధత, అంకితభావం ప్రదర్శించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. పిల్లలను ఒకే గొడుకు కింద వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడం ద్వారా వేసవిని నిర్మాణాత్మకంగా వినియోగించేందుకు పాఠశాల యాజమాన్యం కనబరిచిన చొరవ పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.